శుక్రవారం
10-10-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 19
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad,Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్రలో
మ్యాగ్జైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్ మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి : 94405 73343



హంగరి రచయితకు సాహిత్యంలో నోబెల్

స్టాక్‌హోమ్: సాహిత్య రంగంలో ఈ ఏడాది నోబెల్ బహుమతి హంగరి రచయిత లాస్లో క్రాస్నహోర్కైని వరించింది. ఆయన విలక్షణమైన, దార్శనిక రచనలకు ఈ అత్యున్నత పురస్కారం దక్కినట్లు స్వీడిష్ అకాడమీ గురువారం అధికారికంగా ప్రకటించింది. ప్రపంచ వినాశనం వంటి తీవ్ర భయానక పరిస్థితుల మధ్య కూడా కళకు ఉన్న అపారమైన శక్తిని తన రచనల ద్వారా బలంగా చాటి చెప్పినందుకు గాను లాస్లోకు ఈ గౌరవం అందిస్తున్నట్లు నోబెల్ కమిటీ తన ప్రకటనలో పేర్కొంది. ఆయన సాహిత్యం సమకాలీన

- మిగతా 2 లో

ఫోర్బ్స్ కుబేరుల జాబితాలో ముకేశ్ అగ్రస్థానం

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ మరోసారి ఫోర్బ్స్ కుబేరుల జాబితాలో అగ్రస్థానంలో నిలిచారు. ఫోర్బ్స్ తాజాగా విడుదల చేసిన భారత్‌లో 100 మంది సంపన్నుల జాబితాలో ముకేశ్ మొదటి స్థానాన్ని సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం ఆయన సంపద 105 బిలియన్ డాలర్లు. గతేడాదితో పోలిస్తే ముకేశ్ సంపద 12 శాతం క్షీణించింది. 92 బిలియన్ డాలర్లతో గౌతమ్ అదానీ రెండో స్థానంలో ఉన్నారు. జిందాల్‌కు చెందిన సావిత్రి జిందాల్ 40 బిలియన్ డాలర్లతో మూడోస్థానంలో, టెలికం దిగ్గజం సునీల్ మిత్తల్ 34 బిలియన్

- మిగతా 2 లో

అక్రమ మైనింగ్ నిర్ధారణకు కమిటీ ఏర్పాటు

విశాలాంధ్ర- సచివాలయం : సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఓబులాపురం మైనింగ్ సంస్థ లీజుకు తీసుకున్న ప్రాంతాలు, అటవీ భూముల సరిహద్దుల నిర్ణయానికి ఆరుగురు సభ్యులతో ఉన్నత స్థాయి కమిటీ నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీ చేసింది. కమిటీ చైర్పర్సన్‌గా సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి సుదాన్షు ధులియా, కమిటీ కన్వీనర్, సెక్రటరీగా సర్వే సెటిల్‌మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్‌ను నియమించారు. కమిటీ సభ్యులుగా అనంతపురం జిల్లా డీసీఎఫ్ / డీఎఫ్ వో

- మిగతా 2 లో

ఇదీ లోకం!



చూసావా? మన పెట్టుబడుల వెల్లువ! ఇక ఉద్యోగాలే ఉద్యోగాలు!

స్థానిక ఎన్నికలు నిలిపివేత

- ఉదయం నోటిఫికేషన్... మధ్యాహ్నం రిజర్వేషన్లపై హైకోర్టు స్టే
- నాలుగు వారాలకు విచారణ వాయిదా
- కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశాలు

విశాలాంధ్ర–హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలు నిలిచిపోయాయి. రెండు రోజులుగా ఎన్నికలపై కొనసాగుతున్న ఉత్కంఠతకు తెరపడింది. హైకోర్టు... రిజర్వేషన్లపై ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ 9పై స్టే విధించింది. గురువారం ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన కొద్ది సేపటికే ఆగిపోయింది. రిజర్వేషన్ల అంశం పై మధ్యాహ్నం విచారణ చేపట్టిన హైకోర్టు స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 9పై సుదీర్ఘ వాదనలు విన్న న్యాయ స్థానం... విడుదలైన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నోటిఫికేషన్‌పై కూడా మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. నాలుగు వారాల వ్యవధిలో సమగ్ర కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. ఆ తర్వాత ప్రభుత్వం సమర్పించిన కౌంటర్ పై అభ్యంతరాలు తెలియజేసే పిటిషనర్లకు రెండు వారాల సమయం ఇచ్చింది. తదుపరి విచారణ ఆరు వారాలకు వాయిదా వేసింది. తొలుత ఇరువర్గాలు ధర్మాసనం ఎదుట వాడివేడి వాదనలు వినిపించాయి. ప్రభుత్వం తరపున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. సమగ్ర సర్వే చేయాలని

- మిగతా 2 లో

హైకోర్టు ఆదేశాలు పాటిస్తాం

ఎన్నికల సంఘం

విశాలాంధ్ర- హైదరాబాద్: స్థానిక ఎన్నికలపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను పాటిస్తామని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ మేరకు ఒకే వాక్యంతో గురువారం పత్రికా ప్రకటన విడుదల చేసింది. నోటిఫికేషన్‌పై న్యాయస్థానం స్టే విధించడంతో పాటు ఎస్ఈసీ కూడా దీనికి అంగీకరించడంతో ప్రస్తుతం ఎన్నికల కోడ్ లేనట్లేనని స్పష్టమవుతోంది.

బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చాకే 'స్థానిక' ఎన్నికలకు వెళ్తాం: కాంగ్రెస్

బీసీలపై కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధి అందరికీ తెలుసని టీపీసీసీ అధ్యక్షుడు

- మిగతా 2 లో

పాఠాలు నేర్చుకోరా?

- ఈసీకి సుప్రీం ప్రశ్న
- 3.66 లక్షల మంది వివరాలు అందజేయాలని ఆదేశం
- ఎస్ఐఆర్‌పై విచారణ 16కు వాయిదా

న్యూఢిల్లీ: బీహార్‌లో ఎస్ఐఆర్ వివాదాస్పదంగా మారింది. దీనిపై సుప్రీం కోర్టులో ఫిర్యాదులు దాఖలయ్యాయి. ఇదే క్రమంలో జాబితాల నుంచి పేర్లు తొలగించిన ఓటర్లంతా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసుకోవచ్చని సర్వోన్నత న్యాయస్థానం తెలిపింది. ఇందుకోసం సంబంధిత ఓటర్లకు జిల్లా స్థాయి యంత్రాంగాలు సహకరించేలా ఉత్తర్వులు జారీచేయాలని బీహార్ రాష్ట్ర న్యాయ సేవా ప్రాధికార సంస్థ (బీఎస్ఎల్ఎస్ఏ)ను సుప్రీం కోర్టు ఆదేశించింది. ఎస్ఐఆర్ తర్వాత విడుదల చేసిన తుది జాబితా నుంచి తొలగించిన 3.66 లక్షల మంది ఓటర్ల వివరాలు ఇవ్వాలని ఎన్నికల సంఘాన్ని కోరింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీతో కూడిన ద్విసభ్య ధర్మాసనం గురువారం ఈ వ్యవహారాన్ని విచారించింది. ఓటర్ల జాబితాల నుంచి పేర్లు తొలగించబడ్డ వారికి సహకరించేందుకు పారా లీగల్ వలంటీర్ల జాబితాను జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ విడుదల చేయాలని ఆదేశించింది. దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ చేపట్టాలని భావిస్తున్న క్రమంలో బీహార్ అనుభవం నుంచి పాఠాలు నేర్చుకోవాలని ఎన్నికల సంఘానికి జస్టిస్ కాంత్ హితవు పలికారు. 'దేశమంతటా ఎస్ఐఆర్ నిర్వహించేందుకు మీరు సిద్ధమయ్యారు. బీహార్ ఇచ్చిన అనుభవం నుంచి పాఠాలు నేర్చుకోండి. విజ్ఞతతో వ్యవహరించండి. వారేం చేస్తున్నారో అధికారులకు తెలుసనే భావిస్తున్నాం' అని జస్టిస్ కాంత్ అన్నారు. అంతకుముందు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపించారు. ఎన్నికల సంఘం పారదర్శకతను ప్రశ్నించారు. మెషిన్ రీడబుల్ ఫార్మట్ నుంచి తొలగించిన 3.66 లక్షల మందితో పాటు మరో 21 లక్షల మంది వేరు జాబితా విడుదలకు ఈసీ నిరాకరించడాన్ని

- మిగతా 2 లో

ముందు మేం దిగ్భ్రాంతి చెందాం

దాడికి యత్నం ఘటనపై సీజేఐ గవాయ్

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై ఓ న్యాయవాది దాడికి యత్నించిన ఘటన కలకలం రేపింది. గురువారం దీనిపై సీజేఐ

- మిగతా 2 లో

శాంతి దిశగా తొలి అడుగు

గజా ఒప్పందం తొలి దశపై ఇజ్రాయిల్, హమాస్ సంతకాలు

- బందీలు, ఖైదీల అప్పగింతకు అంగీకారం
- త్వరలో కాల్పుల విరమణ-బలగాల ఉపసంహరణ
- చారిత్రక విజయం: ట్రంప్, నెతన్యాహు
- దౌత్యం ఫలించింది: ప్రపంచ నేతలు
- మా కష్టాలు తీరబోతున్నాయి: బాధిత కుటుంబాల్లో ఆనందం

2 లో

ఇజ్రాయిల్, హమాస్ మధ్య రెండేళ్లుగా సాగుతున్న భీకర పోరునకు తెర దించే దిశగా కీలక ముందడుగు పడింది. శాంతి నెలకొల్పేలా ఇజ్రాయిల్-హమాస్ మధ్య అంగీకారం కుదిరింది.

పలస్తీనాకు వామపక్షాల సంఘీభావం

సామ్రాజ్యవాదం నశించాలి

ఢిల్లీలో భారీ ప్రదర్శన

అమెరికా, ఇజ్రాయిల్ సామ్రాజ్యవాదం నశించాలని, పలస్తీనా ప్రజల పోరాటం వర్ధిల్లాలని సీపీఐ జాతీయ కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ నినాదమిచ్చారు. పలస్తీనాకు సంఘీభావం తెలుపుతూ ఇజ్రాయిల్ మారణహోమాన్ని ఆక్షేపించారు.

2 లో

సానుకూల దృక్పథంతో విధానాలు

అమెరికా ప్రతినిధుల బృందంతో సీఎం రేవంత్ భేటీ

విశాలాంధ్ర - హైదరాబాద్: అమెరికా తీసుకుంటున్న నిర్ణయాలు... అనుసరించే విధానాలన్నీ సానుకూల దృక్పథంతో ఉండాలని, అమెరికా-భారత్ మధ్య సంబంధాలను మరింత పెంపొందించేలా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఇటీవల అమెరికా పెంచిన రాయితీలు, వీసాలపై కఠిన నిబంధనలన్నీ ఆందోళన కలిగించాయని అన్నారు. రెండు దేశాల మధ్య ఆర్థిక వృద్ధికి దోహదపడే విధానాలు అనుసరిస్తే ప్రపంచానికి ఆదర్శవంతంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. తెలంగాణకు వచ్చిన అమెరికా ప్రతినిధుల బృందంతో ముఖ్యమంత్రి తన అభిప్రాయాలను పంచుకున్నారు. అమెరికా నుంచి వచ్చిన ప్రతినిధులు గురువారం సచివాలయంలో రేవంత్ రెడ్డి తో సమావేశమయ్యారు. ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి హాజరయ్యారు. అమెరికాలోని హడ్సన్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు 16 మంది పాల్గొన్నారు. వివిధ రంగాలకు చెందిన మేధావులు, బిజినెస్ లీడర్లు ఈ బృందంలో ఉన్నారు. ఇండియా ఫౌండేషన్ సారథ్యంలో ఈ ప్రతినిధి బృందం భారత్‌లో వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తోంది.

42 శాతం బీసీ రిజర్వేషన్లపై రేవంత్ డ్రామా

హరీశ్‌రావు

విశాలాంధ్ర - హైదరాబాద్: గత ఎన్నికల్లో మాయమాటలు చెప్పి బీసీలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ... స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ లబ్ధిపొందాలని చేసిన కుట్రలు పటాపంచలయ్యాయని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. 22 నెలలుగా బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో కొట్లాడాల్సిన సీఎం రేవంత్ రెడ్డి ... గల్లీలో కొట్లాడుతున్నట్లు డ్రామా సృష్టించారే తప్ప, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు సాధించడంపై ఏనాడూ చిత్తశుద్ధి ప్రదర్శించలేదన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42శాతం రిజర్వేషన్ కల్పించేందుకు చట్టబద్ధత కోసం కేంద్రాన్ని పట్టుబట్టాల్సిన రేవంత్... తెలివిగా దాన్ని పక్క దోవ పట్టించారన్నారు. తూతూ మంత్రంగా జీవో ఇచ్చి కొత్త నాటకానికి తెరతీశారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేశారన్నారు. ఇప్పటికైనా డ్రామాలు ఆపి 42శాతం రిజర్వేషన్ల

- మిగతా 2 లో

ఆర్టీసీ చార్జీలు తగ్గించండి

ప్రైవేటీకరణకు కాంగ్రెస్ కుట్ర: కేటీఆర్

2 లో

దశలవారీ హ్యామ్ రోడ్ల నిర్మాణం: భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్: రాష్ట్రంలో దశలవారీగా హ్యామ్ (హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) రోడ్ల నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అంబేద్కర్ సచివాలయంలో గురువారం రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్మించే హ్యామ్ రోడ్ల నిర్మాణంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ రోడ్ల నిర్మాణంలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం ఉండేలా చూడాలని, ట్రాఫిక్ సర్వేను గమనంలో పెట్టుకోవాలని డిప్యూటీ సీఎం సూచించారు. మొదటి ఫేజ్‌కు అతి త్వరలో

- మిగతా 2 లో

కేంద్రానిదే పూర్తి బాధ్యత

బీసీ రిజర్వేషన్ల అమలులో జాప్యంపై కూనంనేని, నెల్లికంటి

విశాలాంధ్ర–హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ హైకోర్టు స్టే విధించడానికి పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. బీసీలకు బీజేపీ ద్రోహం చేసిందన్నారు. 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఇచ్చిన నోటిఫికేషన్‌పై స్టే విధించడం, పెంచిన రిజర్వేషన్ అమలులో





జాప్యానికి మోదీ సర్కారే ప్రధాన కారణమన్నారు. బీసీ రిజర్వేషన్ 42 శాతానికి పెంచే బిల్లును శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించిందని గుర్తుచేశారు. రిజర్వేషన్ పెంచుతూ జారీ చేసిన ఆర్డినెన్స్ కూడా ఉందన్నారు. రిజర్వేషన్ బిల్లు నెలలు తరబడి కేంద్రం వద్ద పెండింగ్ ఉన్నందునే ప్రస్తుతం ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. స్థానిక సంస్థలు, ఉద్యోగ, విద్య రంగాలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లులను ఆమోదిస్తే, ఎలాంటి ఆటంకాలు లేకుండా ఎన్నికలు యథావిధిగా నిర్వహించవచ్చని కూనంనేని అన్నారు. రాష్ట్రానికి చెందిన బీజేపీ నేతలు ఈ విషయంలో చొరవ చూపాలని కోరారు. రిజర్వేషన్లను పెంచడం కోసం రాజ్యాంగ సవరణ అవసరమైతే తక్షణమే పార్లమెంటును సమావేశపరిచి, ఈ ప్రక్రియను పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 50 శాతం పరిమితి పేరుతో ఏళ్ల తరబడి బీసీ రిజర్వేషన్ పెంపును నాన్చడం తగదన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల

- మిగతా 2 లో

పాఠాలు నేర్చుకోరా?

(మొదటిపేజీ తరువాయి)

తప్పుపట్టారు. జాబితా విడుదల చేయడానికి భయమెందుకని ప్రశ్నించారు. ఇదే క్రమంలో సహజంగా జరిగిన న్యాయపరమైన ఉల్లంఘనలకు రుజువులు ఉన్నాయా అంటూ పిటిషనర్లను జస్టిస్ బాగ్చీ ప్రశ్నించారు. ఉంటే చూపించాలన్నారు. కనీసం ఒక్క ఫిర్యాదైనా చూపించాలని అన్నారు. కాగా, కేసు తదుపరి విచారణ ఈనెల 16కు వాయిదా పడింది. తొలుత ఎన్నికల సంఘం వాదనలు వినిపిస్తూ ఎస్ఐఆర్‌కు సంబంధించి తాము తీసుకునే చర్యలకు కొన్ని రాజకీయ పార్టీలు, సంస్థలు సహకరించడం లేదని ఆరోపించింది. తప్పుడు కథనాలు సృష్టికి యత్నిస్తున్నాయని పేర్కొంది. ఇదిలావుంటే, దాదాపు 10 శాతం మంది తమ ఓటు హక్కును కోల్పోయారని సామాజిక కార్యకర్త యోగేంద్ర యాదవ్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. భారీ సంఖ్యలో కొత్త ఓటర్లు చేరగా.. వారి నుంచి నిర్దేశిత ధ్రువీకరణ పత్రాల్లో ఒక్కటి కూడా తీసుకోలేదన్నారు. లక్షలాది మహిళా ఓటర్ల పేర్లు గల్లంతయ్యాయని, లక్షల కుటుంబాల్లో అధిక సంఖ్యలో ఓటర్లు ఉండటం అనుమానాలకు తావిస్తోందన్నారు.

ముందు మేం దిగ్భ్రాంతి చెందాం

(మొదటిపేజీ తరువాయి)

గవాయ్ స్పందించారు. ఆ ఘటనతో తొలుత తాను దిగ్భ్రాంతికి గురయ్యానని తెలిపారు. ఓ కేసు విచారణ సందర్భంగా ఈ ఘటన ప్రస్తావనకు వచ్చింది. దీనిపై జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ 'సోమవారం నాటి ఘటనతో నేను, సహచర జడ్జి షాక్ అయ్యాం. అయితే, మా వరకు అది ఒక మర్చిపోయిన అధ్యాయం' అని అన్నారు. మరో న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ స్పందిస్తూ 'సీజేఐపై దాడికి యత్నించడాన్ని జోక్‌గా తీసుకోవద్దు. ఇది సుప్రీంకోర్టును అవమానించడమే. బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాల్సిందే' అని అన్నారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ ఈ ఘటన క్షమార్హం కాదన్నారు. దీన్ని మర్చిపోయిన అధ్యాయం అనడం సీజేఐ గొప్పతనమని కొనియాడారు. అక్టోబరు 6న ఈ ఘటన చోటుచేసుకుంది. జస్టిస్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం కోర్టు నం.1లో వ్యాజ్యాలపై విచారణ కొనసాగిస్తుండగా రాకేశ్ కిశోర్ (71) అనే న్యాయవాది వేదిక వద్దకు వచ్చారు. వెంటనే తన కాలికున్న బూటు తీసి విసరబోతుండగా భద్రతా సిబ్బంది అడ్డుకుని... అతనిని బయటకు తరలించారు. ఈ సమయంలో ఆ న్యాయవాది 'సనాతన ధర్మాన్ని అవమానిస్తే సహించేది లేదు' అని నినదించడం వినిపించింది. దాడి సమయంలో జస్టిస్ గవాయ్ మనోనిబ్బరంతో కనిపించారు. 'ఇలాంటి బెదిరింపులు నా దృష్టిని మళ్లించలేవు. పనితీరును ప్రభావితం చేయలేవు' అని కోర్టు హాలులో ఉన్న న్యాయవాదులతో అన్నారు.

హంగరి రచయితకు సాహిత్యంలో నోబెల్

(మొదటిపేజీ తరువాయి)

ప్రపంచంలోని సంక్లిష్టతలను, మానవ అస్తిత్వ వేదనను వినూత్న శైలిలో ఆవిష్కరిస్తుందని ప్రశంసించింది. లాస్లో క్రాస్నహోర్కై తన రచనలతో ఆధునిక సాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఇప్పుడు నోబెల్ బహుమతితో ఆయన కీర్తి విశ్వవ్యాప్తమైంది.

ఆ లాయర్‌పై నిషేధం

న్యూదిల్లీ: సుప్రీంకోర్టులో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి పాల్పడిన న్యాయవాది రాకేశ్ కిశోర్‌పై సుప్రీంకోర్ట్ బార్ అసోసియేషన్ చర్యలు ప్రారంభించింది. రాకేశ్ సభ్యత్వాన్ని రద్దు చేసింది. దీంతోపాటు న్యాయస్థానం ప్రాంగణంలోకి ప్రవేశించకుండా ఆయన ఎంట్రీ కార్డును రద్దు చేసింది. తాజా ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో వెల్లడించింది.

అక్రమ మైనింగ్ నిర్ధారణకు కమిటీ ఏర్పాటు

(మొదటిపేజీ తరువాయి)

ఎం.గురు ప్రభాకర్, మైన్స్ అండ్ జియాలజీ జేడీ ఎస్ శ్రీనివాసరావు, సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ, కేంద్ర అటవీ, పర్యావరణ శాఖల ద్వారా నామినేట్ చేసే ఇద్దరు సభ్యులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

దశలవారీ హ్యామ్ రోడ్ల నిర్మాణం: భట్టి

(మొదటిపేజీ తరువాయి)

టెండర్లు పిలవాలని మంత్రి కోమటిరెడ్డి అధికారులను ఆదేశించారు. స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ఫైనాన్స్ సెక్రటరీ హరిత, పలువురు ఆర్ అండ్ బీ అధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్ వినియోగంపై అమితాసక్తి

రాష్ట్రంలో విద్యుత్ రంగం బలోపేతంలో భాగంగా సోలార్ విద్యుత్తు ఉత్పత్తి, వినియోగంలో ఆసక్తిగా ఉన్నామని భట్టి విక్రమార్క అన్నారు. అంబేద్కర్ సచివాలయంలో జర్మనీ ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. తెలంగాణ ప్రభుత్వం సోలార్ రంగం పై ఆసక్తిగా ఉందని తెలుసుకొని కొన్ని ప్రతిపాదనలతో వచ్చినట్టు జర్మనీ ప్రతినిధులు ఆయనకు తెలిపారు.

రాష్ట్రంలో 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లు, 200 యూనిట్ల వరకు గృహజ్యోతి పథకం కింద ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నాం అని డిప్యూటీ సీఎం జర్మనీ ప్రతినిధులకు వివరించారు. ఈ ప్రక్రియలో భాగంగా రైతులు, గృహ జ్యోతి వినియోగదారులకు ప్రతినెలా ఖచ్చితమైన ఆదాయం వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలనేది ప్రభుత్వ ఆలోచన అని తెలిపారు. జర్మన్ ప్రతినిధులు సూచించిన సోలార్ సాంకేతిక పరిజ్ఞానాన్ని రాష్ట్రంలో ఏ విధంగా అనుసంధానం చేసుకోగలం, తెలంగాణ విద్యుత్ రంగాన్ని ఆర్థికంగా, సాంకేతికంగా బలోపేతం చేసుకోవడానికి జర్మన్ బృందం ప్రతిపాదనలు ఏ మేరకు ఉపయోగపడతాయో అధ్యయనం చేయాలని విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని నవీన్ మిట్టల్ ను ఆదేశించారు. ఓ నివేదిక రూపొందించాలని సూచించారు. ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారుకి, రెడ్కో సీఎండీ అనిలా , జర్మన్ ప్రతినిధులు డాక్టర్ సెబాస్టియన్, డాక్టర్ రఘు చలిగంటి పాల్గొన్నారు.

48 గంటల్లో ఫ్రాన్స్‌కు కొత్త ప్రధాని!

పారిస్: ఫ్రాన్స్ కొత్త ప్రధాని నియామకానికి రంగం సిద్ధమైంది. రాజకీయ అనిశ్చితి క్రమంలో నెలకొన్న పరిస్థితులు, ఎదురైన సవాళ్లతో బాధ్యతలు చేపట్టిన నెల రోజుల్లోనే ప్రధాని పదవికి సెబాస్టియన్ లెకార్ను రాజీనామా చేశారు. దీంతో నూతన ప్రధాని ఎన్నిక అనివార్యమైంది. కొత్త ప్రధాని ఎవరన్నది ఒకటి లేక రెండు రోజుల్లో తేలిపోనుంది. నూతన ప్రధానిని 48 గంటల్లో దేశాధ్యక్షుడు మాక్రాన్ నియమిస్తారని సెబాస్టియన్ గురువారం వెల్లడించారు. నూతన ప్రధాని నియామకానికి అడ్డంకులు తొలగాయన్నారు. ప్రక్రియను మాక్రాన్ సజావుగా చేపట్టవచ్చన్నారు. అయితే ఈ వ్యవహారంలో తుది దశ సంప్రదింపులు జరపాలా లేదా అన్న నిర్ణయం ఆయనదేనని సెబాస్టియన్ చెప్పారు. రాజకీయ ప్రతిష్ఠంభనను ముగించేందుకు ముందస్తుగా అధ్యక్ష ఎన్నికల కోసం ప్రతిపక్షాలు పిలుపునిచ్చిన క్రమంలో తాజా పరిణామం చర్చకు దారితీసింది. తాజా పరిస్థితులపై మాక్రాన్ త్వరలో దేశాన్ని ఉద్దేశించి మాట్లాడతారని కూడా సెబాస్టియన్ అన్నారు. పింఛన్ల సంస్కరణలపై చర్చల పునరుద్ధరణ అవసరమని, అనేక విధానపరమైన సమస్యలు ఉన్నాయని ఆయన చెప్పారు. సంస్కరణలను ఆపేస్తే 2027 నాటికి కనీసం మూడు బిలియన్ యూరోల నష్టం జరుగుతుందని సెబాస్టియన్ హెచ్చరించారు. అలాగే 2026 ముసాయిదా బడ్జెట్‌ను ప్రస్తావించారు. బడ్జెట్ పరిపూర్ణమైనదిగా లేదని, దీనిపై విస్తృతస్థాయిలో చర్చించడం అవసరమని అన్నారు. బడ్జెట్‌ను వచ్చే సోమవారం కేబినెట్‌లో ప్రవేశపెట్టనున్నట్లు సెబాస్టియన్ తెలిపారు.

వ్యూహాత్మక భాగస్వామ్యం బలోపేతం

ఉత్తర కొరియా పర్యటనలో చైనా ప్రధాని

ప్యాంగ్యాంగ్: చైనా ప్రధాని లీ కియాంగ్ ఉత్తర కొరి యాలో పర్యటించారు. వర్కర్స్ పార్టీ ఆఫ్ కొరియా (డబ్ల్యూపీ కే) 80వ వార్షికోత్సవానికి రావాలని ఉత్తర కొరియా ఆహ్వానం మేరకు ఆయన గురువారం ప్యాంగ్యాంగ్ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయన కోసం ఉత్తర కొరియా ఎర్రతివాచీ పరిచింది. డబ్ల్యూపీకే పొలిట్ బ్యూరో సభ్యుడు పాక్ థే సాంగ్ ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం సైనికుల గౌరవ వందనాన్ని నాయకులు స్వీకరించారు. అధ్యక్షులు జిన్‌పింగ్, కిమ్‌జాంగ్ ఉన్ నాయకత్వంలో రెండు దేశాల సంబంధాల్లో ఇటీవల నూతనోత్సాహం కనిపించింది. కిమ్ సెప్టెంబరులో చైనా వెళ్లారు. చైనా పీపుల్స్ వార్ 80వ విజయోత్సవంలో పాల్గొన్నారు. తాజా పర్యటన క్రమంలో లీ కియాంగ్ మాట్లాడుతూ వ్యూహాత్మక భాగస్వామ్యం బలోపేతం, స్నేహాన్ని మెరుగు పర్చుకోవడం, కీలక అంశాలపై కలిసి పనిచేయడం కోసం సిద్ధమన్నారు. ప్రాదేశిక, ప్రపంచ శాంతి, సుస్థిరత, సమృద్ధికి కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. తమ మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింతగా మెరుగు పర్చుకోవడానికి చైనా కట్టుబడి ఉందని లీ కియాంగ్ వెల్లడించారు.

మా దాడులతో రష్యా గ్యాస్ సరఫరాకు దెబ్బ

జెలెన్‌స్కీ

కీవ్: రష్యా ఇంధన కేంద్రాలను కొంత మేరకు దెబ్బ తీసినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ తెలి పారు. దీర్ఘశ్రేణి క్షిపణి దాడుల్లో రష్యా గ్యాస్ నిక్షేపాలు ఐదో వంతు మేర తగ్గి నట్లు చెప్పారు. ఇంధన మౌలిక వసతు లపై పరస్పరం దాడులు జరుగుతున్నా యన్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగించే దిశగా దౌత్యపరమైన కసరత్తులు ఇటీవల స్తంభించాయి. ఉక్రెయిన్ గ్యాస్ ఉత్పత్తి కేంద్రాలను దెబ్బతీసేందుకు రష్యా దాడులు చేస్తుండగా... ఆదేశ ఆయిల్ రిఫైనింగ్ సామర్థ్యాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఉక్రెయిన్ దాడులు జరిపింది. ' రష్యా ఇంధన కేంద్రాలపై మా దాడులతో 20 శాతం వరకు గ్యాసోలిన్ సరఫరాకు నష్టం వాటిల్లిందని నమ్ముతున్నాం' అని జెలెన్‌స్కీ గురువారం విలేకరులతో అన్నారు. దేశీయంగా తయారు చేసిన నెప్ట్యూన్; ఫ్లెమింగో క్షిపణులతో ఉక్రెయిన్ దళాలు ఇటీవల దాడులు చేసినట్లు తెలిపారు. ఉక్రెయిన్‌లోని చెర్నిహీవ్ సుమీ, పోల్టావా ప్రాంతాల్లోని చమురు క్షేత్రాలపై గత నెల రోజుల్లో 1,550 సార్లు రష్యా దాడులు చేయగా 160 సార్లు విజయవంతమైందన్నారు. ఇక యుద్ధం ముగించే విషయంలో అమెరికా, రష్యా మధ్య ఇప్పటిరకు ఏకాభిప్రాయం కుదరలేదని జెలెన్‌స్కీ అన్నారు. రష్యా చెప్పేది అబద్ధమని అమెరికాకు తెలుసన్నారు. చీఫ్ ఆఫ్ స్టాఫ్, ఉక్రెయిన్ ప్రధాని త్వరలో వాషింగ్టన్ వెళతారని, రష్యాపై ఆంక్షలు, రక్షణ, ఇంధన అంశాలపై అక్కడి అధికారులతో చర్చిస్తారని జెలెన్‌స్కీ వెల్లడించారు.

పలస్తీనాకు వామపక్షాల సంఘీభావం

న్యూదిల్లీ: అమెరికా, ఇజ్రాయిల్ సామ్రాజ్యవాదం నశించాలని, పలస్తీనా ప్రజల పోరాటం వర్ధిల్లాలని సీపీఐ జాతీయ కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ నినాదమిచ్చారు. పలస్తీనాకు సంఘీభావం తెలుపుతూ ఇజ్రాయిల్ మారణహోమాన్ని ఆక్షేపించారు. గజాలో ఇజ్రాయిల్ మారణహోమంపై బీజేపీ-ఆర్ఎస్ఎస్ మౌనాన్ని ప్రశ్నించారు. సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్), ఫార్వర్డ్ బ్లాక్ (ఎఫ్‌బీ), రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్ఎస్‌పీ), సీజీపీఐ దిల్లీ స్టేట్ సంయుక్త అధ్వర్యంలో గురువారం న్యూదిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద భారీ ప్రదర్శన జరిగింది. గజాలో ఇజ్రాయిల్ మారణహోమాన్ని, పలస్తీనా భూభాగం దురాక్రమణను అమర్‌జిత్ కౌర్ ఖండించారు. విద్యార్థులు, యువతీయువకులు, కార్మికులు, మేధావులంతా పలస్తీనాకు అండగా నిలవాలని కోరారు. స్వాతంత్ర్యం కోసం పలస్తీనా ప్రజల పోరాటానికి సంపూర్ణ మద్దతివ్వాలని, రాజీలేని సంఘీభావం ప్రకటించాలని పిలుపునిచ్చారు. వక్తల్లో అరుణ్ కుమార్ (సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు), రవీ రాయ్ (సీపీఐ(ఎంఎల్) పొలిట్ బ్యూరో సభ్యులు), జి.దేవరాజ్ (ఫార్వర్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి), ఆర్ఎస్ దగర్ (ఆర్ఎస్‌పీ కార్యదర్శి), బిర్జూ నాయక్ (సీజీపీఐ కార్యదర్శి) ఉన్నారు. కార్యక్రమానికి అధ్యక్ష వర్గంగా దినేశ్ వర్ష్నే (సీపీఐ దిల్లీ కార్యదర్శి), షెబా ఫరూఖీ (సీపీఎం), సంతోశ్ రాయ్ (సీపీఐ-ఎంఎల్), ఆర్ఎస్ దగర్ (ఆర్ఎస్‌పీ), ధర్మేంద్ర కుమార్ వర్మ (ఫార్వర్డ్ బ్లాక్), బిర్జూ నాయక్ (సీజీపీఐ) వ్యవహరించారు.

శాంతి దిశగా తొలి అడుగు

వాషింగ్టన్/టెల్అవీవ్/జెరూసలేం: ఇజ్రాయిల్, హమాస్ మధ్య రెండేళ్లుగా సాగుతున్న భీకర పోరుకు తెర దించే దిశగా కీలక ముందడుగు పడింది. శాంతి నెలకొల్పేలా ఇజ్రాయిల్-హమాస్ మధ్య అంగీకారం కుదిరింది. దీంతో అమెరికా ప్రతిపాదిత గజా ఒప్పందం తొలి దశపై సంతకాలు జరిగాయి. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. 'శాంతి ప్రణాళిక తొలి దశ కోసం ఇజ్రాయిల్, హమాస్ మధ్య ఏకాభిప్రాయం కుదిరిందని ప్రకటించడం చాలా గర్వంగా ఉంది' అంటూ 'ట్రూత్ సోషల్'లో పేర్కొన్నారు. త్వరలోనే బందీలంతా విడుదలవుతారని వెల్లడించారు. పటిష్ఠ, సుస్థిర, శాశ్వత శాంతి దిశగా తొలి అడుగులు పడుతున్నాయని, తమ బలగాల ఉపసంహరణకు ఇజ్రాయిల్ ఒప్పుకున్నదని ట్రంప్ తెలిపారు. అయితే అరబ్ మీడియా కథనాలకు భిన్నంగా ఇజ్రాయిల్ ప్రకటన వెలువడింది. కేబినెట్ సమావేశంలో ఆమోదం పొందిన తర్వాతే ఒప్పందం ప్రకారం కాల్పుల విరమణ కోసం 72 గంటల కౌంట్‌డౌన్ మొదలవుతుందని వెల్లడించింది. ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇద్దరు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నట్లు నెతన్యాహు కార్యాలయం గురువారం తెలిపింది. కాల్పుల విరమణ చారిత్రకమని ట్రంప్, నెతన్యాహు అన్నట్లు పేర్కొంది. తమ సాన్నిహిత్యాన్ని, పరస్పర సహకారాన్ని మరింతగా ముందుకు తీసుకెళ్లాలని ఇద్దరు నేతలు అంగీకరించినట్లు వెల్లడించింది. నెస్సెట్ (ఇజ్రాయిల్ పార్లమెంట్)లో ప్రసంగించేందుకు ట్రంప్‌ను నెతన్యాహు ఆహ్వానించినట్లు అధికారిక ప్రకటన తెలిపింది. రెండు వేల మంది పలస్తీనా ఖైదీలకు బదులుగా 20 మంది బందీలను హమాస్ విడుదల చేసేలా ఒప్పందం తొలి దశలో అంగీకారం కుదిరింది. ఒప్పందం అమల్లోకి వచ్చిన 72 గంటల్లోగా అప్పగింతలు జరుగుతాయని హమాస్ వర్గాలు పేర్కొన్నాయి. హమాస్ చెర నుంచి విడిపించి మన వాళ్లను త్వరలోనే ఇంటికి చేరుస్తామని నెతన్యాహు ఓ ప్రకటన చేశారు. గజా శాంతిలో భాగస్వాములవుతామని ట్రంప్ హామీనిచ్చారు. ఇక బందీల అప్పగింత కోసం ఏర్పాట్లను ఇజ్రాయిల్ సైనిక దళం (ఐడీఎఫ్) మొదలు పెట్టినట్లు చీఫ్ ఆఫ్ స్టాఫ్ ఓ ప్రకటన చేశారు. ఒప్పందం ప్రకారం గజా నుంచి బలగాల ఉపసంహరణకు ఏర్పాట్లు జరుగుతున్నాయని ఐడీఎఫ్ కూడా ప్రకటించింది.

గజా పునర్నిర్మాణంలో భాగస్వాములవుతాం...

ఇజ్రాయిల్, హమాస్ మధ్య గాజాలో కాల్పుల విరమణ కోసం ఒప్పందం జరగడాన్ని స్వాగతిస్తున్నట్లు ప్రపంచ నాయకులు వేర్వేరుగా ప్రకటనలు చేశారు. త్వరలోనే శాశ్వత-రాజకీయ పరిష్కారం లభిస్తుందని ఆకాంక్షించారు. గజా పునర్నిర్మాణంలో భాగస్వాములు అవుతామన్నారు. తమ వంతు సహాయ సహకారాలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని వెల్లడించారు. కాల్పుల విరమణ తక్షణ అమలునకు, ఒప్పందం పూర్తిస్థాయి అమలునకు చర్యలు తీసుకుంటున్నట్లు పలస్తీనా అధ్యక్షుడు మహమ్మద్ అబ్బాస్ తెలిపారు. 'గజా ప్రజల రెండేళ్ల కాళరాత్రి ముగిసేలా ఒప్పందం జరిగింది. ఇన్నేళ్లుగా పడ్డ కష్టాలు, అనుభవించిన బాధలు, వేధింపుల నుంచి వారికి విముక్తి లభించబోతోంది. ఈ ఒప్పందం చారిత్రకం' అని ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫత్తా అల్ సిసీ వెల్లడించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ స్పందిస్తూ 'ఇది యుద్ధం ముగింపునకు చిహ్నం... టూ స్టేట్ పరిష్కారం ఆధారిత రాజకీయ పరిష్కారానికి నాంది' అని పేర్కొన్నారు. అమెరికా, ఖతార్, ఈజిప్టు, టర్కీ దౌత్యం ఫలించిందని, గాజాలో బందీల విడుదల, కాల్పుల విరమణకు హామీనిచ్చేలా ఒప్పందం జరగడాన్ని స్వాగతిస్తున్నామని యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వోన్ డెర్ లెయన్ వెల్లడించారు. గజా పునర్నిర్మాణానికి తమ వంతు సహాయ సహకారాలను అందిస్తామన్నారు. ఈ ఒప్పందాన్ని 'దౌత్యపరమైన ఘన విజయం'గా యూరోపియన్ యూనియన్ వర్ణించింది.ఒప్పందం పూర్తి స్థాయి అమలునకు తమ వంతు సహకారిస్తామని పేర్కొంది. ఇటలీ విదేశాంగ మంత్రి ఆంటోనియో తజానీ హర్షం వ్యక్తంచేస్తూ శాంతి దళాలను పంపేందుకు తాము సిద్ధమని ప్రకటించారు. గజా పునర్నిర్మాణంలో భాగస్వాములు అవుతామని, మానవతా సాయాన్ని అందిస్తామని చెప్పారు. ఈ ఒప్పందం అమలులో జాప్యం వద్దని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ సూచించారు. గాజాలో మానవతా సహాయంపై అన్ని ఆంక్షలను వెంటనే తొలగించాలని కోరారు.

ఐరాస హర్షం: గజా ఒప్పందాన్ని స్వాగతిస్తున్నట్లు ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ పేర్కొన్నారు. అమెరికా, ఖతార్, ఈజిప్టు, టర్కీ దౌత్యం ఫలించిందన్నారు. ఒప్పందానికి కట్టుబడి సంపూర్ణ శాంతి నెలకొల్పాలని ఇజ్రాయిల్, హమాస్‌కు సూచించారు. గజా కోసం పెద్దమొత్తంతో మానవతా సాయం సిద్ధంగా ఉందని, ఇజ్రాయిల్ అధికారులు అనుమతించిన మరుక్షణం సరఫరా జరుగుతుందని ఐరాస ఒక ప్రకటన చేసింది.

ఫోర్బ్స్ కుబేరుల జాబితాలో ముకేశ్ అగ్రస్థానం

(మొదటిపేజీ తరువాయి)

డాలర్లతో నాలుగో స్థానంలో, టెక్ బిలియనీర్ శివ నాడార్ 33 బిలియన్ డాలర్లతో ఐదో స్థానంలో నిలిచారు. 2025 ఫోర్బ్స్ జాబితాలో 100 మంది దేశీయ కుబేరుల సంపద విలువ తొమ్మిది శాతం (100 బిలియన్ డాలర్లు) పడిపోయి ఒక ట్రిలియన్ డాలర్లకు చేరింది.

అత్యంత సంపన్న మహిళగా సావిత్రి జిందాల్

భారత్‌లో అత్యంత సంపన్న మహిళగా మరోసారి ఓపీ జిందాల్ గ్రూపు అధినేత సావిత్రి జిందాల్ నిలిచారు. ఫోర్బ్స్ తాజాగా విడుదల చేసిన టాప్ 10 భారత బిలియనీర్లలో ఉన్న ఏకైక మహిళ ఆమె. 40 బిలియన్ డాలర్లతో మూడోస్థానాన్ని కైవసం చేసుకున్నారు. గతేడాదితో పోలిస్తే ఆమె సంపద 3.5 బిలియన్ డాలర్లు తగ్గింది. ప్రస్తుతం ఆమె హర్యానాలో ఎమ్మెల్యేగానూ కొనసాగుతున్నారు. స్టీల్, పవర్, సిమెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో జిందాల్ గ్రూపు వ్యాపారాలున్నాయి.

కేంద్రానిదే పూర్తి బాధ్యత

(మొదటిపేజీ తరువాయి)

రిజర్వేషన్ వర్తింపులో ఈ పరిమితి ఇప్పటికే దాటిన విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పెంపునకు సీపీఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందని కూనంనేని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే జీవో 9పై వేసిన రిట్ పిటిషన్ కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో దాఖలైన కేసుల్లో సీపీఐ తరపున ఇంప్లీడ్ అయ్యామన్నారు. హైకోర్టు స్టే విధించడంతో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కార్యాచరణ చేపట్టాలని కోరారు. గవర్నర్ వద్ద పెండింగ్ ఉన్న బిల్లులు నిర్ణీత కాలంలోగా ఆమోదించకపోతే, నోటిఫై చేయవచ్చని తమిళనాడు కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పరిశీలించాలని కూనంనేని సాంబశివరావు సూచించారు. శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించి ఆరు నెలలు దాటినగానీ తెలంగాణ వెనుకబడిన తరగతుల (గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల రిజర్వేషన్) చట్టం-2025 గెజిట్ నోటిఫికేషన్ విడుదల అవకాశాలపై నిపుణుల సలహా తీసుకోవాలన్నారు. అందుకోసం అవసరమైతే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కూనంనేని సాంబశివరావు సూచించారు.

ఆర్టీసీ చార్జీలు తగ్గించండి

ప్రైవేటీకరణకు కాంగ్రెస్ కుట్ర: కేటీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్: ఆర్టీసీ ఛార్జీల పెంపుపై ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ భగ్గుమంది. తక్షణమే ఛార్జీలు తగ్గించాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం సీనియర్ నాయకులతో కలిసి ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. హైదరాబాద్ నగర ప్రజలపై మోపిన ఛార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఆస్తులను అమ్ముకోవాలని చూస్తూ, అంతిమంగా సంస్థను ప్రైవేట్‌పరం చేసే కుట్రకు కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపిందని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ బకాయిలపై వివరాలు అడగగా, 'మహాలక్ష్మి' పథకానికి సంబంధించిన రూ.1,353 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని ఎండీ తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలో రూ.9,246 కోట్ల గ్రాంట్‌ను విడుదల చేసినట్టు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కేటీఆర్... "తెలంగాణలోని సామాన్య, మధ్య తరగతి ప్రజలపై తీవ్ర ప్రభావాన్ని చూపేలా టికెట్ల ధరలు పెంచడం అన్యాయం. మహిళలకు ఉచిత బస్సును స్వాగతిస్తున్నాం, కానీ బస్సుల సంఖ్య పెంచాలి. ఆడవాళ్లకు ఫ్రీ బస్సు అని చెప్పి మగవాళ్ల నుంచి డబుల్ వసూలు చేస్తున్నారు. ఒక చేత్తో ఫ్రీ ఇచ్చి మరో చేత్తో బస్ టికెట్ ధర పెంచడం దారుణం" అని మండిపడ్డారు. శాంతియుతంగా బస్సు ఎక్కి ఆర్టీసీ ఎండీకి లేఖ ఇస్తామంటే అడ్డగోలుగా పోలీసులను దింపి అందర్నీ అరెస్టు చేసిందని మండిపడ్డారు. ప్రజా రవాణా అనేది ప్రభుత్వ సామాజిక బాధ్యత. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఆర్టీసీ నష్టాల్లో ఉన్నా భరించింది. ఆర్టీసీ లాభాల్లో ఉంటే బస్ ఛార్జీలు ఎందుకు పెంచారు అని ప్రశ్నించారు.

'చలో బస్ భవన్' ఉద్రిక్తత, నేతల హౌస్ అరెస్ట్‌పై నిరసన

ఛార్జీల పెంపును నిరసిస్తూ బీఆర్ఎస్ నిర్వహించిన 'చలో బస్ భవన్' కార్యక్రమం ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. ఉదయం కేటీఆర్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. నిరసనలు వెల్లువెత్తడంతో ఆయనతో పాటు పార్టీ నేతలకు బస్సు భవన్ వెళ్లేందుకు అనుమతిచ్చింది. కేటీఆర్... తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్‌తో కలిసి సికింద్రాబాద్‌లోని రెజిమెంటల్ బజార్ (రెతీఫైల్) బస్ స్టాప్ నుంచి బస్సులో బస్సు భవన్‌కు చేరుకున్నారు. ఆర్టీసీ క్రాస్ రోడ్ వద్ద పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా, కార్యకర్తలు, నాయకులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారని బీఆర్ఎస్ ఆరోపించింది. చివరికి, ప్రజాప్రతినిధులను మాత్రమే బస్సు భవన్‌లోకి అనుమతించారు.

శ్రీపతి సతీశ్‌కు ఘన సన్మానం

విశాలాంధ్ర-హైదరాబాద్: అఖిల భారత ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు, టీడీపీ తెలంగాణ రాష్ట్ర బీసీ సెల్ మాజీ అధ్యక్షుడు శ్రీపతి సతీశ్‌ను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు... కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం పాలకమండలి సభ్యుడిగా బుధవారం నియమించారు. ఈ మేరకు గురువారం ఎన్టీఆర్ భవన్‌లో పార్టీశ్రేణులు శ్రీపతిని శాలువాతో ఘనంగా సన్మానించారు. పొలిట్‌బ్యూరో సభ్యులు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు... చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్‌కు తెలంగాణ పార్టీ తరపున ధన్యవాదాలు తెలిపారు. పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, టీటీడీ బోర్డు సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డి, రాష్ట్ర నాయకులు సామభూపాల్ రెడ్డి, అజ్మీరా రాజునాయక్, మేడ్చల్-మల్కాజ్‌గిరి పార్లమెంట్ పార్టీ కన్వీనర్ కందికంటి అశోక్ కుమార్‌గౌడ్, పోలంపల్లి అశోక్, జనగాం నర్సింగ్‌రావు, మీడియా కమిటీ ఛైర్మన్ ప్రకాష్ రెడ్డి, పి.చంద్రశేఖర్, మహేష్, జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ డ్రామా

(మొదటిపేజీ తరువాయి)

పెంపుపై దిల్లీలో కొట్లాడండి. పార్లమెంట్‌లో చట్టం చేయించి, షెడ్యూల్ 9లో చేర్చండి. పోరాటంలో అఖిల పక్షాలను భాగస్వామ్యం చేయండి. దిల్లీ వేదికగా యుద్ధ భేరి మోగించండి. ఉద్యమ పార్టీగా బీఆర్ఎస్ ఎల్లప్పుడూ బీసీల కోసం గొంతెత్తుతుందని అన్నారు.

కాంగ్రెస్ మోసం తేటతెల్లం: కేటీఆర్

స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం ఇన్ని రోజులూ మోసపూరితంగా వ్యవహరించిన తీరు తేటతెల్లమైందని కేటీఆర్ మండిపడ్డారు. జీవో 9పై హైకోర్టు ఇచ్చిన స్టే తో 42 శాతం రిజర్వేషన్ల పేరిట కాంగ్రెస్ సర్కారు ఇంతకాలం చేసిందంతా డ్రామా అని రుజువైందని పేర్కొన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను కాలరాసి సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని బీసీలను దారుణంగా మోసం చేశారని కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికలు వాయిదా వేసేందుకు బీసీ రిజర్వేషన్లను పావుగా వాడుకున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణవ్యాప్తంగా పెల్లుబుకుతున్న ప్రజాగ్రహం, వ్యతిరేకతను చూసి ముఖ్యమంత్రి భయంతో వణికిపోతున్నారని కేటీఆర్ అన్నారు.

హైకోర్టు ఆదేశాలు పాటిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. బీసీల సంక్షేమం కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాలను గమనిస్తున్నారని చెప్పారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. బీసీలకు మేలు చేయడాన్ని బీఆర్ఎస్, బీజేపీ నేతలు తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. ఈ వ్యవహారంలో ఆ రెండు పార్టీల నేతలు హైకోర్టులో ఇంప్లీడ్ కాలేదన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చాకే స్థానిక ఎన్నికలకు వెళ్తామన్నారు.

స్థానిక ఎన్నికలు నిలిపివేత

(మొదటిపేజీ తరువాయి)

కేబినెట్ నిర్ణయం తీసుకుందని కోర్టుకు తెలిపారు. డోర్ టు డోర్ సర్వేకు అన్ని పార్టీలు మద్దతిచ్చాయని పేర్కొన్నారు. అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం ప్రకారమే సర్వే జరిపామని వివరించారు. సర్వేలో 57.6 శాతం బీసీ జనాభా ఉందని తేలిందని హైకోర్టుకు ఏజీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. సర్వే డేటా ఆధారంగానే రిజర్వేషన్లు ఖరారు చేశారని పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని అసెంబ్లీ నిర్ణయించిందని చెప్పారు. బీసీ బిల్లుపై ఒక్క పార్టీ కూడా అభ్యంతరం తెలపలేదని గుర్తు చేశారు. బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం తెలపలేదు కాబట్టి... సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం బిల్లు ఆమోదం పొందినట్టే అని వివరించారు. ఒకవేళ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం తెలిపి ఉంటే... అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫై చేసి ఉండేదని అన్నారు. తమిళనాడు కేసులో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం... ప్రత్యేకంగా నోటిఫై చేయాల్సిన అవసరం లేదని గుర్తు చేశారు. వాదనల అనంతరం బిల్లును అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించిందా అని హైకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. దానికి సుదర్శన్ రెడ్డి సమాధానం చెబుతూ... ఎలాంటి అభ్యంతరం లేకుండా ఆమోదించిందని హైకోర్టుకు స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పుల ప్రకారం... దేశంలో మొత్తం రిజర్వేషన్ల పరిమితి 50 శాతాన్ని మించకూడదని, కాని జీవో 9 కారణంగా ఈ పరిమితి దాటడంతో.. ఇది చట్ట విరుద్ధమని పేర్కొంటూ పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారు. జీవో 9 పై సుదీర్ఘంగా వాదనలు విన్న హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. బీసీ రిజర్వేషన్ల అమలుపై తాత్కాలికంగా స్టే విధిస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం రిజర్వేషన్ల పెంపునకు సంబంధించిన శాస్త్రీయ ఆధారాలు ట్రిపుల్ టెస్ట్ నిబంధనలను పాటించడంలో సరిగా వ్యవహరించలేదనే వాదనలను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఈ అంశంపై పూర్తి వివరణ, వాస్తవాలతో కూడిన కౌంటర్ అఫిడవిట్‌ను నాలుగు వారాలలోపు దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

విశాలాంధ్ర ప్రతినిధి–పెద్దపల్లి, సింగరేణి: రామగుండం ప్రాంతంలో విద్య వైద్య శాఖల పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు నిర్దిష్ట గడువు లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం ఆయన రామగుండం ప్రాంతంలో విస్తృతంగా పర్యటించారు. రామగుండం ఐటిఐ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఏటీసీ కేంద్రం, ఎన్.టి.పి.సి లోని సాయి విద్యాలయం, పీకే రామయ్య కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, గోదావరిఖని గాంధీ పార్క్‌లోని మండల పరిషత్ ప్రాథమిక ఉర్దూ మీడియం పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక బాలికల పాఠశాల, క్రిటికల్ కేర్ ఆస్పత్రి భవన నిర్మాణ పనులు, సదరన్ క్యాంప్ నిర్వహణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండం ఐటిఐలోని ఏటిసి కేంద్రంలో యంత్రాల బిగింపు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్టిపిసి పీకే రామయ్య కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనంలో పెండింగ్ పనులు పూర్తి చేయాలని, గోదావరి ఖని గాంధీ పార్క్ ఉర్దూ మీడియం పాఠశాల, బాలికల పాఠశాల భవన నిర్మాణ పనులు 2 నెలలలో పూర్తి చేయాలని ఆదేశించారు. 15 రోజుల వ్యవధిలో 50 పడకల క్రిటికల్ కేర్ భవన నిర్మాణ పనులు పూర్తి చేసి అప్పగించాలని కలెక్టర్ సూచించారు. సదరన్ క్యాంప్ నిర్వహణ పనులు వారం రోజులలో పూర్తి చేసి దివ్యాంగులకు సదరన్ క్యాంపుల నిర్వహణ ప్రారంభించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట ఏటిసి వైస్ ప్రిన్సిపాల్ విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్ లక్ష్మీ నారాయణ, ఆర్ఎంఓ డాక్టర్ రాజు, ఏఈ విక్రం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో – మహబూబాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ ప్రాతినిధ్యం పెంచే విధంగా పొత్తులతో సంబంధం లేకుండా పోటీకి కార్యకర్తలు సన్నద్ధం కావాలని ఆత్మ కమిటీ చైర్మన్, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం జిల్లాలోని మరిపెడ మండల కేంద్రంలో జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో అధికార పార్టీ పొత్తుతో సంబంధం లేకుండా, మన పార్టీ ప్రాతినిధ్యం పెంచే విధంగా బలమైన అభ్యర్థులను ఎంపిక చేసి పోటీలో నిలుపుదామని అన్నారు. గత బీఆర్ఎస్ పదేండ్ల ప్రజా వ్యతిరేకపాలన, బిజెపి అవలంభిస్తున్న మతతత్వ, నియంతృత్వ విధానాలను ప్రతిఘటించే విధంగా వారికి బుద్ధి చెప్పి ప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేసే సిపిఐ అభ్యర్థులకు స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజలు పట్టం కట్టాలని కోరారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్‌పై మనువాదుల దాడి భారతరాజ్యాంగ వ్యవస్థపై జరిగిన దాడి అని, ప్రతీ ప్రజాస్వామిక వాది ఖండించాలని కోరారు. సిపిఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు అబ్దుల్ రషీద్, గాడిపల్లి వెంకన్న, తురక రమేష్ పాల్గొన్నారు.

11 నుండి ఇర్ఫాని దర్గా ఉర్సు ఉత్సవాలు

విశాలాంధ్ర బ్యూరో – సంగారెడ్డి : హజ్రత్ హకీమ్ ఒమర్ బిన్ అహ్మద్ సజ్జద్ యే నషీన్ బార్గ ఇర్ఫానీ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణ శివారులోని హజ్రత్ మౌలానా అల్ హజ్ హబీబ్ అహ్మద్ బిన్ ఒమర్ అల్ మారూఫ్ హబీబ్ ఇర్ఫాన్ అలీ షా బంద నవాజి (ఇర్ఫాని దర్గా) 23వ ఉర్సు ఉత్సవాలు ఈ నెల 11 నుండి రెండు రోజుల పాటు జరుగనున్నాయని పీఠాధిపతి హజ్రత్ హకీమ్ ఒమర్ బిన్ అహ్మద్ సజ్జద్ యే నషీన్ బార్గ ఇర్ఫానీ తెలిపారు. ప్రతి ఏడాది రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు హాజరై మొక్కులు తీర్చుకుంటారని తెలిపారు. మొదటి రోజైన 11వ తేదీ సంగారెడ్డిలోని జామియా మస్జిద్ నుండి సాయంత్రం 5 గంటలకు గంధం ఊరేగింపు, రాత్రి 8గంటలకు ఇర్ఫాని దర్గాలో గంధారాధన, 9 గంటలకు ఆల్ ఇండియా ముషాయిరా ఉంటుందని అన్నారు. రెండవ రోజు 12వ తేదీ సాయంత్రం దీపారాధన, ఖవ్వాలి, అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఉత్సవాలలో వివిధ దర్గాల పీఠాధిపతులు హాజరు కానున్నారని తెలిపారు. అహ్మద్ బిన్ ఉమర్ ఇర్ఫానీ, నోమాన్ బిన్ ఉమర్ ఇర్ఫానీ, ఆర్గనైజింగ్ ఇంచార్జ్ దర్గా కమిటీ షేక్ షకీల్ అహ్మద్ ఇర్ఫానీ, షబ్బీర్ అహ్మద్ హాష్మీ, సయీద్ బిన్ సాలెహ్, మహమ్మద్ బిన్ యహియ ఇర్ఫానీ, సలీమ్ ఖాన్,మీర్ అసద్ అలీ ఇర్ఫానీ, అతర్ గౌస్వి తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్లను పకడ్బందీగా నిర్వహించాలి

విశాలాంధ్ర బ్యూరో – నిర్మల్ జిల్లా : జిల్లాలో జరుగుతున్న మొదటి విడత జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్ని కల నామినేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం సారంగాపూర్ మండల కేంద్రంలో ప్రత్యక్షంగా పరిశీలించారు. ఎంపీడీఓ, ఎంఈఓ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసిన ఆమె, సౌకర్యాలు, హెల్ప్‌డెస్క్ ఏర్పాట్లను పరిశీలించి అధికారులు ఇచ్చిన వివరాలు తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఎటువంటి లోటుపాట్లు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రిజిస్టర్లను పరిశీలించిన కలెక్టర్, ప్రతి రికార్డును పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. నామినేషన్ కేంద్రాల వద్ద నిరంతర పటిష్ఠ పోలీసు బందోబస్తు కొనసాగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మొదటి విడుతలో తొమ్మిది జెడ్పీటీసీ, 75 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. నామినేషన్లు నేటి నుంచి 11వ తేదీ వరకు ఉదయం 10.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు స్వీకరించబడతాయని, అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. ఈ తనిఖీలో తహసిల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ లక్ష్మికాంత్ రావు, ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొదటిరోజు దాఖలు కాని ఎంపీటీసీ నామినేషన్లు

విశాలాంధ్ర – గూడూరు: మండల కేంద్రంలో ఉన్న మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ గురువారం అన్ని ఏర్పాట్లు చేశారు. నామినేషన్ల దాకాల్లో మొదటి రోజే ఎటువంటి నామినేషన్లు దాఖలు కాలేదని ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. నామినేషన్ల ప్రక్రియను ఆర్డీవో కృష్ణవేణి, డి.ఎస్.పి శ్రీనివాసరావు, సీఐ సూర్య ప్రకాష్ ఎస్ఐ గిరిధర్ రెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ కోమల ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఉదయం 10 గంటలకు మొదలైన నామినేషన్ల ప్రక్రియ సాయంత్రం ఐదు గంటల వరకు పోలీస్ బందోబస్తు నడుమ గట్టి ఏర్పాట్లు చేసినప్పటికీ ఎటువంటి నామినేషన్లు రాలేదనీ వారు తెలిపారు.

ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ల స్వీకరణపై సమీక్ష

నామినేషన్ కేంద్రాలు తనిఖీ చేసిన సాధారణ పరిశీలకురాలు కొర్ర లక్ష్మి

విశాలాంధ్ర – నల్గొండ బ్యూరో : జిల్లాలో జరగనున్న ఎంపీటీసీ, జెడ్పిటిసి, గ్రామపంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను నల్గొండ జిల్లా సాధారణ పరిశీలకురాలుగా రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి కొర్ర లక్ష్మి గురువారం నల్గొండ జిల్లాలో పర్యటించారు.రాష్ట్ర ఎన్నికల సంఘం నియమించిన సాధారణ పరిశీలకురాలు కొర్ర లక్ష్మి గురువారం నల్గొండ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠితో సమావేశమయ్యారు. మొదటి విడత ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్లపై ఆమె సమీక్ష నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, పోలింగ్ కేంద్రాల మౌలిక వసతులు, సిబ్బంది శిక్షణ, భద్రతా చర్యలు తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె నల్గొండ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను సందర్శించారు. హెల్ప్ డెస్కులు, రిటర్నింగ్ అధికారి చాంబర్లు, నామినేషన్ స్వీకరణ టేబుళ్లు, అవసరమైన సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం కనగల్ ఎంపీడీవో కార్యాలయంలో కూడా మొదటి విడత నామినేషన్ల ఏర్పాట్లను తనిఖీ చేశారు. జిల్లాలో మొదటి విడతగా నల్గొండ, దేవరకొండ డివిజన్ల పరిధిలోని 18 మండలాలు, 196 ఎంపీటీసీ స్థానాలకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. నోటిఫికేషన్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని, నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. ఎన్నికల నియమావళి, నామినేషన్ కేంద్రం వద్ద పాటించాల్సిన నిబంధనలు, నామినేషన్ వేయడానికి అనుమతించే వారి సంఖ్య మొదలైన అంశాలపై రాజకీయ పార్టీ ప్రతినిధులకు అవగాహన కల్పించామని కలెక్టర్ వివరించారు. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు విధులు ప్రారంభించాయని, ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన సిబ్బందికి ముందుగానే శిక్షణ ఇచ్చామని, భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో పూర్తి చేశామని తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీఆర్ఓ, నల్గొండ ఆర్డీఓ వై. అశోక్ రెడ్డి, గృహనిర్మాణ శాఖ పీడీ, ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి రాజ్‌కుమార్, జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, డీపీఓ వెంకయ్య, పరిశీలకుల నోడల్ అధికారి పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి విస్తరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

విశాలాంధ్ర ప్రతినిధి – మంచిర్యాల జిల్లా : జిల్లాలో జాతీయ రహదారి విస్తరణ ప్రక్రియ వేగవంతం చేయాలని, ప్రభావిత గ్రామాలలో అవార్డుల జారీ ప్రక్రియ త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల రాజస్వ మండల అధికారి కార్యాలయంలో జాతీయ రహదారి విస్తరణలో ఆర్బిట్రేషన్ సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ప్రభావిత గ్రామాలలో అవార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేసి, ఆర్బిట్రేషన్ సంబంధిత రికార్డులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చేగువేరా స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడాలి

విశాలాంధ్ర – వనపర్తి : ప్రపంచ విప్లవ యోధుడు సోషలిస్టు సమాజం కోసం పోరాడి ప్రాణాలర్పించిన చేగువేరా స్ఫూర్తితో సిపిఐ నేతలు కార్యకర్తలు ప్రజలు ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు కోరారు. వనపర్తి సిపిఐ ఆఫీస్‌లో చేగువేరా 58వ వర్ధంతి సిపిఐ పట్టణ కమిటీ కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మాట్లాడుతూ డాక్టర్‌గా మంత్రిగా విప్లవకారుడిగా ఆయన పోరాటం చిరస్మరణీయమన్నారు. ప్రజా పోరాటంలో ఆయన ప్రాణాలు కోల్పోయిన ప్రజల గుండెల్లో చిరస్మరణీయ స్థానం సాధించారని, ఆయన సోషలిస్టు సమాజ ఆశయ సాధన కోసం పనిచేయాలన్నారు. చేగువేరాకు ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఇప్పటికీ ఉన్నారంటే ప్రజల కోసం ఆయన సాగించిన పోరాటం చేసిన త్యాగాలే కారణమన్నారు. ఆ స్ఫూర్తితో అందరం పని చేయాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్ సిపిఐ వనపర్తి పట్టణ కార్యదర్శి రమేష్ సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్న కురుమయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పృథ్వీనాథం, జిల్లా నేతలు జ్యోతి రూప సుప్రియ సిపిఐ నేతలు అంజి కుర్మయ్య పాల్గొన్నారు.

ఘనంగా చేగువేరా వర్ధంతి

విశాలాంధ్ర – నేరేడుచర్ల: ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల ప్రధాన కూడలిలో విప్లవవీరులు చేగువేరా 58వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను మాట్లాడుతూ చేగువేరా అంటే ఒక అలజడి అని అతని పోరాటం ఒక ఆత్మవిశ్వాసం అని సరిహద్దులేని ప్రపంచాన్ని కోరుకున్న మహా మనిషి చేగువేరా అని ఆయన అన్నారు. స్వేచ్ఛ ప్రపంచం కోసం పోరాడి ప్రజా సమస్యల పరిష్కారంగా ప్రజా పోరాటాలే శ్వాసగా జీవించిన విప్లవ వీరుడు చేగువేరా జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కేవలం టీ షర్టు పైన అతని బొమ్మ వేసుకుంటే ఒరిగేది ఏమీ లేదని ఆయన ఆశయ సాధన కోసం ప్రతి యువకుడు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కమిటీ సభ్యుడు అమరారపు పున్నయ్య బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమర్రాజు వెంకట్, ఎస్.కె మదర్ దళిత హక్కుల పోరాట సమితి పట్టణ అధ్యక్షుడు చందమళ్ళ నవీన్ ఇన్సాఫ్ పట్టణ అధ్యక్షుడు పులి సాహెబ్ దళిత నాయకులు జి శ్రీనివాస్ పాల్గొన్నారు.

దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

విశాలాంధ్ర – కారేపల్లి : రైతులు పండించిన పంటలను ప్రైవేటు వ్యాపా రుల మాయ మాటలు చెప్పే వ్యక్తులను నమ్మి మోసపోవద్దని ఇల్లందు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఈ నరేష్ కుమార్ రైతులకు సూచించారు. గురువారం కారేపల్లి మండల పరిధిలోని కారేపల్లి క్రాస్ రోడ్డులో పలువురు రైతులకు సంబంధించిన పత్తి చేను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు మద్దతుగా క్వింటాకు ఎనిమిది వందల 8110 రూపాయలు ధర ప్రకటించిందని తేమ శాతం లేకుండా పత్తిని నాణ్యంగా తయారు చేసి కేంద్రానికి తీసుకొచ్చి కాంటాలు వేసుకొని నేరుగా నగదు చెల్లింపుల కోసం బ్యాంకు ఖాతా తప్పనిసరిగా ఆధార్‌తో లింక్ అయ్యి ఉండాలని కోరారు. రైతులు తీసుకొచ్చే పత్తి తేమశాతం12% ఉండాలని అన్నారు. నేరుగా పండిన పత్తిని మొత్తాన్ని సీసీఐ కేంద్రానికి మాత్రమే తీసుకొచ్చి అమ్మకం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఎన్ శ్రీనివాసరావు సిబ్బంది రంజిత్, మున్నేరు మధు, రవి పలువురు రైతులు పాల్గొన్నారు.

ఎర్రోళ్ల విజ్జయ్య మృతికి మాజీ ఎంపీ నామ సంతాపం

విశాలాంధ్ర – ఖమ్మం : తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తండ్రి ఎర్రోళ్ల విజ్జయ్య మృతి పట్ల బిఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని కోరుకుంటూ, విజ్జయ్య ఆత్మకు శాంతి చేకూరాలని నామ ప్రార్థించారు.

ఊపందుకున్న వలసలు...

నేడు డిప్యూటీ సీఎం భట్టి సమక్షంలో భారీ చేరికలు

విశాలాంధ్ర బ్యూరో – ఖమ్మం : స్థానిక సంస్థల ఎన్నికలకు హైకోర్టు బ్రేక్ వేసినప్పటికీ ఎన్నికల కోలాహలం ఇప్పటికే పల్లెల్లో ఏర్పడడంతో టిఆర్ఎస్ పార్టీ నుంచి అధికార కాంగ్రెసులోకి వలసల పర్వం ప్రారంభమైంది. ఇదివరకే బట్టి విక్రమార్క సొంత నియోజకవర్గం మధిరలో టిఆర్ఎస్ సీనియర్ నాయకులు మాజీ శాసనసభ్యులు కొండబాల కోటేశ్వరరావు నేతృత్వంలో అనేకమంది కీలకమైన నాయకులు గులాబీ కండువా తీసేసి డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క సమక్షంలో కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. భట్టి విక్రమార్క సొంత గ్రామమైన వైరా నియోజకవర్గ కేంద్రంలో టిఆర్ఎస్‌కు చెందిన కీలకమైన నాయకులు వైరా మున్సిపల్ వైస్ చైర్మన్‌తో సహా అనేకమంది బట్టి విక్రమార్క సమక్షంలో కాంగ్రెస్లో చేరనున్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క నేడు వైరారానున్నారు ఆయన సమక్షంలో భారీ చేరికలు జరగనున్నాయి. టిఆర్ఎస్కు వెన్ను తన్నుగా ఉన్న మున్సిపల్ వైస్ చైర్మన్ ముల్లపాటి సీతారాములతో సహా పలువురు వైద్యులు లయన్స్ క్లబ్ గవర్నర్ ప్రముఖ వైద్యులు కాపా మురళీకృష్ణతో పాటుగా అనేకమంది పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లో చేరనున్నారు. ఈ చేరికల పరంపర జిల్లాలోని దాదాపు అనేక మండలాల్లో కొనసాగనుంది గత రెండు రోజుల క్రితం రఘునాథపాలెం మండలంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంప్ ఆఫీసులో భారీ చేరికలు జరిగాయి. మొత్తం మీద ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో వలసల పర్వం ప్రారంభమైంది.

సమాచార హక్కు చట్టం ప్రజలకు వజ్రాయుధం

విశాలాంధ్ర – తొర్రూరు: సమాచార హక్కు చట్టం ప్రజలకు వజ్రాయుధం వంటిదని తహసిల్దార్ గడీల శ్రీనివాస్ తెలిపారు.డివిజన్ కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెవిన్యూ సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. తహసిల్దార్ మాట్లాడుతూ ప్రజలకు పారదర్శక పాలన అందించడమే సమాచార హక్కు చట్టం ఉద్దేశం అని తెలిపారు. ప్రజలు కోరిన సమాచారాన్ని పౌరులకు అందించాల్సిన బాధ్యత ప్రతి శాఖ పై ఉందన్నారు. ఆర్టిఐ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేలా ప్రజలు సహకరించాలన్నారు. డిటి నరసయ్య, ఆర్ఐ నజీముద్దీన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య

విశాలాంధ్ర బ్యూరో – ఖమ్మం : డబ్బులు కోసం ఒక వ్యక్తిని ముక్కలుగా నరికి దుప్పటిలో మూటగట్టి చెత్తలో పారేసిన దారుణమైన ఘటన ఖమ్మం రూరల్ పరిధిలో జరిగింది. క్రమ రూరల్ ఏసిపి తిరుపతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం చిట్యాల కు చెందిన అశోక్(36) మరో ఇద్దరితో కలిసి అతి దారుణంగా మొండెం నుంచి తలను వేరుచేసి మిగతా శరీర భాగాలను ముక్కలు ముక్కలుగా నరికి ఒక కవర్లో వేసి దుప్పట్లో చుట్టి కరుణగిరి ప్రాంతంలోని ఒక చెత్తలో ఆ శరీర భాగాలను విసిరి, వేసినట్లు పోలీసు దర్యాప్తులో తేలిందని రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి మీడియాకు తెలిపారు. ఎన్టీఆర్ కృష్ణాజిల్లా వత్సవాయి మండలం చిట్యాలకు చెందిన పరిమి అశోక్ (36) అనే వ్యక్తి కి కామేపల్లి మండలం కెప్టెన్ బంజర గ్రామానికి చెందిన వెంకట్ (40) అనే వ్యక్తికి పరిచయం ఏర్పడి వారి ఇద్దరి మధ్య స్వలింగ సంపర్కం సంబంధం ఏర్పడినట్లు ఆయన తెలిపారు. నిందితుడు అశోక్ అనే వ్యక్తికి బాల పేటకు చెందిన కృష్ణ రామ స్వామితో పరిచయం ఏర్పడి అశోక్ రూమ్ కి అతను కూడా తరచూ వచ్చేవాడు. తిరుమల పాలానికి చెందిన నగ్మా అనే మహిళతో అశోక్ శారీరక సంబంధం ఉందని ఈ ముగ్గురు కలిసి పథకం ప్రకారం వెంకట్ రూమ్‌కి వచ్చి పడుకున్న సందర్భంలో నగ్మా ఇంటి ముందు ఎవరు రాకుండా చూస్తుండగా కృష్ణ రామస్వామి అశోకు వెంకట్ ను హత్య చేశారని తమ దర్యాప్తులో తేలినట్టు ఏసిపి తెలిపారు. వెంకట్ వద్ద ఉన్న బంగారు వస్తువులతో పాటు నగదును తీసుకొని అతనిని హత్య చేసినట్లు తెలిపారు. ఒక వ్యక్తిని మొక్కల ముక్కలుగా నరకడం ఎలా అని అశోకు మొబైల్ లో యూట్యూబ్ లో సెర్చ్ చేసి తెలుసుకున్నారని అందుకు అవసరమైన కత్తులను కూడా అందులోనే సెర్చ్ చేసి తెలుసుకొని వాటిని కొని తెచ్చి హత్య చేశారని పోలీసు దర్యాప్తులో తేలినట్టు ఆయన వివరించారు. సెప్టెంబర్ 16న హత్య జరగగా, విషయం బయటికి తెలియకపోవడంతో వెంకట్ కనిపించకుండా పోయాడంటూ అతని సోదరుడు సెప్టెంబర్ 22వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాంతో పోలీసులు దర్యాప్తు జరిపి హత్యగా నిర్ధారించి నిందితులను అరెస్టు చేసినట్లు ఏసిపి తెలిపారు. మిస్టరీగా మారిన ఈ హత్యను చేదించడంలో కృషిచేసిన పోలీస్ అధికారులను ఎసిపి, సిపి సునీల్ దత్ ప్రత్యేకంగా అభినందించారు.

లక్ష్యం ముందు ఎంత కష్టమైనా చిన్నదే,,,

విశాలాంధ్ర– చర్ల : మనకు స్పష్టమైన లక్ష్యమనేది ఉంటే ఎంత కష్టమైనా సాధించవచ్చు ప్రభుత్వ కాలేజీలో ఎంబిబిఎస్ సీటు సాధించిన ప్రణీత్‌ని చూసి నేర్చుకోవచ్చుని ప్రధానోపాధ్యాయులు జి.వి. ప్రసాద్ అన్నారు. గురువారం గురుదేవ్ విద్యాలయంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులైన పానుగంటి రామ్మోహన్, సామ్రాజ్యం కుమారుడు ప్రణీత్ ప్రతిభ నేపథ్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. అతనికి సిద్దిపేట ప్రభుత్వ కళాశాలలో సీటు వచ్చింది. ఈ సభలో ప్రణీత్ చేత అతని తల్లిదండ్రులకు పాదపూజ, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్రణీత్ సక్సెస్ కోసం పట్టుదలగ, ఎన్నో వ్యయ, ప్రయాసాలను ఎదుర్కొని సాధించడన్నారు. ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి కష్టపడి చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కో–ఆర్డినేటర్స్ ఎంవీ. సుబ్రహ్మణ్యం, జి.శ్రీనివాస్, పానుగంటి రామ్మోహన్, బాల్య మిత్రులు, బంధువులు, ఉపాధ్యాయ బృందం ప్రణీత్‌ను అభినందించారు.

చేగువేరాను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర – కొత్తగూడె : బాధిత వర్గాల కోసం జీవితాన్ని యావత్తు అంకితం చేసిన గెరిల్లా పోరాట యోధుడు చేగువేరాను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని దేశ భవిష్యత్తు కోసం పాటుపడాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ పిలుపునిచ్చారు. కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం చేగువీర 58 వ వర్ధంతి నేపథ్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులార్పించారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ సామ్రాజ్యవాదం పెట్టుబడి దారి వర్గ దోపిడీ నుంచి ప్రజలను విముక్తి చేయాలని గెరిల్లా సయుధ పోరాటం చేసిన విప్లవ ధ్రువ తార అని కొనియాడారు. బాధ్యత వర్గాల సమస్యల సాధన జీవిత కాలం పరితపించిన త్యాగమూర్తి అన్నారు. క్యూబా, రష్యా, కొరియా, ఉక్రెయిన్, రొమేనియా, బల్గేరియా, చైనా వంటి దేశాల కమ్యూనిస్టు యోధులకు చేగువేరా పోరాటం ఆదర్శమై ఆదేశాల దశా దిశా మార్చిందన్నారు. కొన్ని అనివార్య క్లిష్ట సమస్యలకు పరిష్కారం గెరిల్లా సాయుధ పోరాటమే అని నమ్మిన ఆయన ప్రపంచ శ్రామిక వర్గాలకు దిశా నిర్దేశం చేసిన మహాయోధుడుని అజిత్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ గుండాల సుజన్, రాజ్, కమల్, కళ్యాణి, వనిత, పూజిత, సింధు, మహేష్,నవీన్, తదితరులు పాల్గొన్నారు.

స.హ. చట్టం అమలులో రెండో స్థానంలో మెదక్

విశాలాంధ్ర బ్యూరో – మెదక్: సమాచార హక్కు చట్టం దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించడంలో మెదక్ జిల్లాకు అవార్డు దక్కింది. సమాచార హక్కు చట్టం సమస్యలు పరిష్కరించడంలో మెదక్ జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచింది. సమాచార హక్కు చట్టం వారోత్సవాలు గురువారం హైదరాబాదులోని రవీంద్రభారతిలో నిర్వహించగా గవర్నర్ జిష్ణు దేవ వర్మ చేతులమీదుగా కలెక్టర్ రాహుల్ రాజ్ అవార్డు అందుకున్నారు.

ఎస్‌జిఎఫ్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో క్రీడాకారుల ప్రతిభ

విశాలాంధ్ర – కొత్తగూడెం అర్బన్ : కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో రెండు రోజులుగా 69వ పాఠశాలల ఎస్ జి ఎఫ్ జిల్లా స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో ప్రతిభ చాటిన జిల్లా విజేతల టీం లను గురువారం అధికారులు ప్రకటించారు. బుధ, గురువారాల్లో జరిగిన ఈ క్రీడల్లో అండర్ 17 బాలుర విభాగం కబడ్డీలో మొదటి, ద్వితీయ తృతీయ బహుమతులు ఇల్లందు, అశ్వారావుపేట, కొత్తగూడెం జోన్లు దక్కించుకున్నాయి. ఖోఖో క్రీడలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అశ్వారావుపేట, కొత్తగూడెం, పాల్వంచ జోన్లు దక్కించుకున్నాయి. వాలీబాల్ క్రీడలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వరుసగా పాల్వంచ, ఇల్లందు, కొత్తగూడెం జట్లు నిలిచాయి. అండర్ 17 బాలికల విభాగం కబడ్డీ క్రీడలో ప్రథమ,ద్వితీయ, తృతీయ బహుమతులు ఇల్లందు, అశ్వారావుపేట, భద్రాచలం జట్లు దక్కించుకున్నాయి. ఖో ఖో క్రీడలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో భద్రాచలం, అశ్వారావుపేట, ఇల్లందు జట్లు నిలిచాయి. అలాగే వాలీబాల్ క్రీడలో ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాలను అశ్వారావుపేట, ఇల్లందు, భద్రాచలం దక్కించుకున్నాయి. అండర్ 14 బాలుర కబడ్డీ క్రీడలో మొదటి ద్వితీయ ద్వితీయ స్థానాల్లో పాల్వంచ, అశ్వారావుపేట, పినపాక జట్లు నిలవగా ఖోఖో లో ప్రథమ ద్వితీయ స్థానాలను అశ్వారావుపేట, పాల్వంచ దక్కించుకున్నాయి. అండర్ 14 బాలికల వాలీబాల్, కబడ్డీ, ఖో ఖో పోటీల్లో ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లను ప్రకటించారు. ఈ కార్యక్రమానికి డిఇఓ నాగలక్ష్మి, డివై ఎస్ ఓ పరంధామ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు సీత, సుజాత, బుగ్గ వెంకటేశ్వర్లు, భావ్ సింగ్, లక్ష్మణ్, శేఖర్, అనిల్ పాల్గొన్నారు.

చిట్టి డబ్బులు మోసం చేసిన వ్యక్తికి జైలు శిక్ష

విశాలాంధ్ర – కొత్తగూడెం క్రైమ్ : చిట్టీలు నడుపుతు వ్యక్తి బాధితులకు డబ్బులు చెల్లించకపోవడంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ అతనికి జైలు శిక్ష విధించారు. ప్రైవేటు చిట్టీలు నడిపి మోసం చేసిన సదరు వ్యక్తికి ఏకంగా ఐదు సంవత్సరాల కారాగార శిక్ష విధిస్తూ తీర్పు గురువారం వెలువడింది. కేసు వివరాల ప్రకారం కొత్తగూడెంకు చెందిన ఎండి. నిజాముద్దీన్ ఇంట్లో కొన్నేళ్లుగా గంగాభిషన్న చెందిన జక్కుల వెంకన్న నివాసం ఉన్నందున బాగా పరిచయాలు ఏర్పడ్డాయి. నిజాముద్దీన్ పరిచయాలు ఆసరాగా వెంకన్న చిట్టీలు వేయడం మొదలుపెట్టాడు. రూ.ఒక లక్ష, రూ. ఒకటిన్నర లక్ష విలువగల రెండు చిట్టీలు నిర్వహించాడు. మొత్తం 20 మంది కలిసి వెంకన్న వద్ద చిట్టీలు వేసారు. మొత్తం రూ.16 లక్షల 41 వేలు చెల్లించకుండా మోసం చేసి వెంకన్న పారిపోయాడు. బాధితులు కొత్తగూడెం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పటి ఎస్ ఐ. జి.తిరుపతికి ఫిర్యాదు చేసారు. అప్పటి సిఐ కే. కుమారస్వామి దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జి షీట్ దాఖలు చేశారు. కోర్టులో 22 మంది సాక్షుల విచారణ అనంతరం జక్కుల వెంకన్న పై నేరం ఋజువు కాగా సెక్షన్ 420 ఐ.పి.సి. ప్రకారం ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష తోపాటు రూ.3,000 జరిమానా, సెక్షన్ 5 యాక్ట్,1999 ప్రకారం మరో కేసులో ఐదేళ్ల కఠిన కారగార శిక్ష, రూ. 3000 జరిమానా మొత్తం 6000 జరిమానా చెల్లించాల్సిందిగా తీర్పు చెప్పారు. రెండు శిక్షలు ఏకకాలంలో అనుభవించ వలెనని తీర్పులో జిల్లా జడ్జి పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ ను ఏపీపి పివిడి లక్ష్మి నిర్వహించారు. ఈ కేసులో కోర్టు నోడల్ ఆఫీసర్ ఎస్ఐ ఆర్. ప్రభాకర్, కోర్టు లైజాన్ ఆఫీసర్ నేరేడు వీరబాబు, పిసి కె.వీరన్న లు సహకరించారు.

యోగ, ధ్యానంతో మానసిక ఆరోగం

విశాలాంధ్ర బ్యూరో – పెద్దపల్లి : మానసిక ఆరోగ్యం శ్రేయస్సు అవగాహన వారోత్సవాలలో భాగంగా, లయన్స్ క్లబ్ అఫ్ పెద్దపల్లి ఆధ్వర్యంలో యోగా విత్ వాకర్స్, ధ్యానం కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రేకులపల్లి విజయ పీఎంజేఫ్ మార్గదర్శకత్వంలో జరిగింది. పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ విజయ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉదయం వాకర్లతో కలిసి నడక, యోగా, ధ్యానం కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. లయన్స్ క్లబ్ అఫ్ పెద్దపల్లి అధ్యక్షులు బొడకుంట రాంకిషన్ మాట్లాడుతూ అంతర్జాతీయంగా లయన్స్ క్లబ్స్ అధ్వర్యంలో మానసిక ఆరోగ్యంపై వారం రోజులు యోగ, మెడిటేషన్, కార్యక్రమాలు నిర్వహించారు. డిస్ట్రిక్ట్ మైక్రో కాబినెట్ మెంబర్ బెల్లంకొండ జయపాల్ రెడ్డి, రీజియన్ చైర్ పర్సన్ రేకులపల్లి శశాంక, సెక్రటరీ మీసాల సత్యనారాయణ, ట్రెజరర్ కళాశికం మహేందర్‌రావు, ఇమిడియేట్ పాస్ట్ ప్రెసిడెంట్ వేల్పుల రమేష్, వైస్ ప్రెసిడెంట్ జక్కుల సాయిలు, సీనియర్ సభ్యులు రాజకుమార్ అగర్వాల్, మట్ట రాంరెడ్డి, నాళ్ల రాజేందర్ పాల్గొన్నారు.

చేగువేరా ఆశయ సాధనకు ఉద్యమించాలి

విశాలాంధ్ర – ఖమ్మం : సుప్రసిద్ధ విప్లవకారుడు చేగువేరా ఆశయ సాధనకు విద్యార్థులు ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటుకల రామకృష్ణ పిలుపునిచ్చారు. సామ్రాజ్యవాద వ్యతిరేక తిరుగుబాటు విప్లవానికి దిక్సూచి చేగువేరా అని కొనియాడారు. ఖమ్మం గిరి ప్రసాద్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఘనంగా చేగువేరా 58వ వర్ధంతి సందర్భంగా చేగువేరా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయా దేశాల్లో అణచివేతపై గెరిల్లా పోరాటాలు నడిపి ప్రపంచ విప్లవ వీరుడు గా చేగువేరా చరిత్రకి ఎక్కారన్నారు.

సంపాదకీయం

ఔదార్యం చట్టానికి ప్రత్యామ్నాయం కాదు!

సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి మీద బూటు విసరడం అత్యంత ఘాతుకమైన చర్య. తన మీద చెప్పు విసిరిన వ్యక్తి మీద చట్ట ప్రకారం చర్య తీసుకోకూడదని ప్రధాన న్యాయమూర్తి విజ్ఞప్తి చేసి ఉండవచ్చు. ఇది ఆయన ఔదర్యానికి, పెద్ద మనసుకు తార్కాణం. కానీ దిల్లీ పోలీసులు కనీసం ఎఫ్ఐఆర్. దాఖలు చేయకపోవడం బాధ్యతా రాహిత్యమే. విధి నిర్వహణను విస్మరించడమే. గవాయ్ ఔదర్యాన్ని ఆసరాగా చేసుకుని అత్యంత హేయమైన దాడిని ఉపేక్షించడం దారుణం. కానీ ఒక న్యాయవాది, మరి కొందరు రాకేశ్ కిశోర్ మీద చట్ట ప్రకారం చర్య తీసుకోవడానికి అత్యున్నత న్యాయాధికారి వెంకటా రమణి అనుమతి కోరారు. మరో వేపు పంజాబ్‌లో రాకేశ్‌కు వ్యతిరేకంగా ఎఫ్ఐఆర్‌లు దాఖలవుతున్నాయి. రాకేశ్ కిశోర్ అనే న్యాయవాది నిండు కొలువులో ప్రధాన న్యాయమూర్తి మీద బూటు విసరడం ఉన్మాద చర్యగా కొట్టి పారేయడానికి వీలు లేదు. అతని మానసిక స్థితి సవ్యంగానే ఉందని ఆయనను పోలీసులు విచారించినప్పుడు వెల్లడించిన సమాచారం వల్లే అర్థం అవుతోంది. ఆయన ప్రధాన న్యాయమూర్తి మీద దాడి చేసిన తరవాత భద్రతా దళాల వారు ఈడ్చుకెళ్తున్నప్పుడు రాకేశ్ కిశోర్ "సనాతన ధర్మాన్ని విమర్శిస్తే ఈ దేశం సహించదు" అనే నినాదాలు చేస్తూ వెళ్లారు. ఇది ఆయన ఏ భావజాలానికి చెందినవాడో తెలియజేస్తోంది. రాకేశ్ కిశోర్ మీద చర్య తీసుకోకూడదని అని కోరడం బీఆర్ గవాయ్ వ్యక్తిగత అభిప్రాయమే అవుతుంది. కానీ రాజ్య వ్యవస్థ ఇలాంటి హేయమైన పని చేసిన వారి మీద చర్య తీసుకోకుండా ఉండడం బాధ్యతారహితమే అవుతుంది. ప్రధాన న్యాయమూర్తి మీద దాడి సోమవారం జరిగితే గురువారం సాయంత్రం దాకా ప్రభుత్వం చర్య తీసుకుంటున్న దాఖలాలే లేవు. దిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ దాఖలు చేయకపోవడం దారుణం. బీఆర్ గవాయ్ మీద బూటు విసరడం కేవలం ఆయన మీద చేసిన వ్యక్తిగతమైన దాడి కాదు. ఆయన ఈ దేశంలోని అత్యున్నత న్యాయవ్యవస్థకు ప్రతినిధి. అంటే మన న్యాయవ్యవస్థ మీద దాడి. రాజ్యాంగాన్ని పరిరక్షించవలసిన బాధ్యత సుప్రీంకోర్టు మీద ఉంది. అంటే గవాయ్ మీద దాడి రాజ్యాంగంపై కూడా దాడే. ప్రధాన న్యాయమూర్తి దళితుడు. విద్వేషమే ఉఛ్వాస, నిశ్వాసగా బతికే వారిలో మత విద్వేషమే కాదు నిమ్న కులాలను ఈసడించే తత్వం కూడా పీకల దాకా ఉంటుంది. షెడ్యూల్డ్ కులాల మీద, షెడ్యూల్డ్ తరగతుల మీద దాడులను నిరోధించడానికి ప్రత్యేక చట్టమే ఉంది. ఈ చట్టం ప్రకారమైనా ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం చర్య తీసుకుని ఉండవలసింది. ఆ పనీ మొదలే కాదు. బహుశా మోదీ ప్రభుత్వం నాలుగు రోజులైతే ఈ గొడవ సద్దుమణుగుతుంది లెమ్మని భావించి ప్రకృతి చికిత్సా విధానాలు పాటిస్తోందేమో. ప్రధాన న్యాయమూర్తి మీద దాడి జరిగితే ప్రధానమంత్రి తీవ్రంగా స్పందించవలసిన అంశం. ఎవరో దారినబోయే దానయ్య అంతకు ముందు రాహుల్, తేజస్వీ పాల్గొని వెళ్లిపోయిన తరవాత మోదీ తల్లి గురించి అభ్యంతరకరమైన వ్యాఖలు చేశారట. నిజానికి దీనికి రాహుల్‌కు, తేజస్వీకి ఏ సంబంధమూ లేదు. కానీ మోదీ "మా తల్లిని దూషించారు" అని దేశ మంతటా తిరిగి యాగీ చేశారు. అలాంటిది ప్రధాన న్యాయమూర్తి మీదకు బూటు విసరడం మోదీకి ఘాతుకంగా ఎందుకు కనిపించలేదో. రాకేశ్ కుమార్ చేసిన నినాదాలు మోదీ నాయకత్వంలోని బీజేపీ నడుపుతున్న విద్వేష రాజకీయాలకు ప్రతిరూపమే. ఈ కారణంగానే మోదీ మౌనంగా ఉన్నారనుకోవాల్సి వస్తుంది. కానీ మోదీ సైతం రాజ్యాంగం మీద ప్రమాణం చేశారు. ప్రధాన న్యాయమూర్తి మీద దాడి చేసిన వారి మీద చట్ట ప్రకారం చర్య తీసుకోకపోవడం అంటే ప్రధానమంత్రి సైతం తన రాజ్యాంగ బాధ్యతను విస్మరించినట్టే.

కానీ ఈ దేశం ఇంకా గొడ్డుపోలేదు అనడానికి ఈ నాలుగు రోజులుగా అనేక పరిణామాలు జరిగాయి. సుప్రీంకోర్టు బార్ కౌన్సిల్ రాకేశ్ కిశోర్‌ను సస్పెండ్ చేసింది. సంజాయిషీ నోటీసు జారీ చేసింది. ఆయన ఏ కోర్టులోనూ వాదించడానికి వీలు లేకుండా చేసింది. సుప్రీంకోర్టు న్యాయవాది చంద్రన్ దాడి చేసిన రాకేశ్ కిశోర్ మీద చట్ట ప్రకారం చర్య తీసుకోవడానికి అనుమతించాలని అడ్వొకేట్ జనరల్ వెంకటారమణి అనుమతి కోరారు. రాకేశ్ సుప్రీంకోర్టు గౌరవాన్ని మంట గలిపారని ఆ న్యాయవాది భావించారు. పైగా రాకేశ్ ఈ దుశ్చర్యకు పాల్పడిన తరవాత కూడా ఏ మాత్రం పశ్చాత్తాపం కనబరచలేదు. అంటే తన ఘాతుక వైఖరిని కొనసాగించడమే. రాకేశ్ దాడి న్యాయ విధులకు అంతరాయం కలిగించడమేనని, రాజ్యాంగాన్ని వమ్ము చేయడమేనని న్యాయవాది చంద్రన్ అడ్వొకేట్ జనరల్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. రాకేశ్ నడవడిక, ఆయన వ్యక్తం చేస్తున్న భావాలు కోర్టు ధిక్కారం కిందే లెక్క. కోర్టులో ఇంత దారుణమైన పని చేసినందుకు ఆయన మీద నేరం మోపి కేసు నమోదు చేయవచ్చు. అలాగే కోర్టు ధిక్కారం కేసూ మోపవచ్చు. కోర్టు ధిక్కార కేసు విచారణ సందర్భంగా రాకేశ్ క్షమాపణ చెప్తే అక్కడితో కథ ముగిసి పోతుంది. కానీ దాడి కేసులో ఆయనను విచారించి శిక్షించే అవకాశం ఉంది. ఆ శిక్ష ఎంత తక్కువైనా చట్టం పని చేసినట్టు లెక్క. మత ప్రసంగాలు చేసే అనిరుద్ధాచార్య (అనిరుధ్ రాం తివారీ), యూట్యూబ్‌లో కార్యక్రమాలు తయారు చేసే అజీత్ భారతి ప్రధాన న్యాయమూర్తి మీద వ్యతిరేకత రెచ్చగొట్టినందువల్లే రాకేశ్ ఈ దాడికి పాల్పడ్డారని అందువల్ల ఆయన మీద చర్య తీసుకోవడానికి అనుమతించాలని మిషన్ అంబేద్కర్ వ్యవస్థాపకుడు కోరారు. తన మీద దాడి జరిగిన నాలగవ రోజున ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ గురువారం కోర్టులోనే పెదవి విప్పారు. ఈ దాడిని చూసి విచలితుడిని అయ్యాను అన్నారు. కానీ "మరిచిపోయిన అధ్యాయం" అని కూడా అన్నారు. గవాయ్ మళ్లీ హుందాగానే ప్రవర్తించారు. అయితే ఆయన పక్కనే కూర్చున్న సుప్రీంకోర్టు మరో న్యాయమూర్తి ఉజ్వల్ భూయాన్ మాత్రం ప్రధాన న్యాయమూర్తి మీద చెప్పు విసరడం మామూలు విషయం కాదన్నారు. ప్రధాన న్యాయమూర్తి మీద సామాజిక మాధ్యమాలలో అభ్యంతరకరమైన, నీచమైన వ్యాఖ్యలు చేసినందుకు అనేక ఎఫ్ఐఆర్‌లు దాఖలైనాయి. వందకన్నా ఎక్కువ సామాజిక మాధ్యమాలలో ప్రధాన న్యాయమూర్తి కులాన్నీ దూషించారు. విద్వేషమూ వెళ్లగక్కారు. సామాజిక మాధ్యమాలలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు కూడా చేశారు. ప్రధాన న్యాయమూర్తి మీద బూటు విసరడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాల్సింది. వెంటనే కేసు నమోదు చేయాల్సింది. మోదీ ట్విట్టర్‌లో వ్యాఖ్య మాత్రం చేశారు. ఆ తరవాత ప్రధాన న్యాయమూర్తికి ఫోన్ చేసినట్టున్నారు. ఈ అనునయింపుల ద్వారా న్యాయమార్గ పాలనకు ఒరిగేది ఏమీ ఉండదు.

గుడులు కట్టమనడం తగదు?

ఇటువంటి ప్రభుత్వాన్ని నేనింత వరకు చూడలేదు. నా ఎనభైఅయిదేళ్ల వయసులో ఇంత దౌర్భాగ్య నీచమైన ప్రభుత్వాన్ని చూడలేదు. ఏంటి బావా ప్రభుత్వాన్ని పట్టుకుని నీచమైంది అంటున్నావు. ఇప్పుడేమయిందయ్యా నీకు. ఏంటి ఏమయిందయ్యా అని నిదానంగా సాగ లాగుతావు. నీకు తెలియదా అసలు మనం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునేది మన అవసరాలు తీర్చి, మన పిల్లల భవిత బాగుండాలనేగదా. మనకు ముఖ్యంగా ప్రతి మనిషికి అవసరమైనవి విద్య, వైద్యం ప్రభుత్వం అందజేయాలి. నిజమేనయ్యా దురదృష్టవశాత్తు పేదలకు అందుబాటులో ఉన్న మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం చేయడం పేదలకు గొడ్డలి వేటు లాంటిది. అలాగే రెండవది విద్య. ఈ మధ్య సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన ఒకరు ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లీషు మీడియం తీసేయమని ప్రభుత్వానికి ఒక ఉచిత సలహా విసిరేశారు. కాని ప్రైవేటు స్కూళ్లలో మాత్రం ఉండవచ్చునట. మరి ఈ న్యాయాన్ని ఎలా చూడాలి. అసలు మనిషికి అత్యవసరమైన విద్య, వైద్యం అందించలేని ప్రభుత్వం ఉన్నా లేకపోయినా ఒకటే. ఈ రెండూ చేయలేని ప్రభుత్వం మనకు ఇంకేం చేస్తుంది. బ్రిటీషు వారిపై పోరాడి ప్రాణాలర్పించి మన కోసం మనల్ని మనమే పరిపాలించుకోవడం అంటే ప్రజా ప్రభుత్వంగా పిలిపించుకుంటూ ప్రజల అవసరాలు తీర్చమనేగాని ప్రైవేటు వారిని ప్రోత్సహించడాని కాదుకదా. విద్య, వైద్యం ప్రభుత్వం ఇవ్వలేదుగాని వేల సంఖ్యలో గుడులు కట్టి పూజలు చేయండి మా బదులు ఆ దేవుడు మీ సమస్యలు తీర్చుతాడని చేతులు దులుపుకునే ప్రభుత్వాన్ని ప్రజాప్రభుత్వంగా భావించాలా? మతం, భక్తి ముసుగులో ప్రజల్ని ముంచి అన్నీ ఆ దేవుడే చూస్తాడనటం ప్రభుత్వానికి న్యాయమా. శాసనసభ్యులు, మంత్రులు ప్రజల సొమ్ము నుంచి జీతాలు తీసుకుంటూ ముక్కు పిండి పన్నులు వసూలు చేస్తూ అన్ని ప్రైవేటు పరం చేయడమేనా ప్రభుత్వం పని అని ప్రజలు ముక్కున వేలేసుకుని ప్రశ్నిస్తున్నారు. మనిషికి బడి అవసరమా, గుడి అవసరమో తెలియని నేతలను ఎన్నుకున్నందుకు ప్రజలు తమ

చెంపలు తామే వాయించుకోవలసిన పరిస్థితి ఏర్పడింది.

ప్రస్తుతం ఉన్న గుడిశెకు కనీస వసతులు లేక అంటు వ్యాధులతో బతుకీడుస్తూ ఉన్న పేదలకు కావలసింది కనీస సదుపాయాలు. అలాగే నాలుగయిదు కిలోమీటర్లు నడవలేని పిల్లలను స్కూలుకు పంపలేక పనుల్లో పెడుతున్న పేదలకు తమ పిల్లలకు అక్షరం నేర్పే బడుల సంగతి వదిలేసి గుడులు కట్టడం ఎందుకో పాలకులు వివరించాలి. అవిద్యతో అల్లాడుతున్న పేద ప్రజల్ని ఇంకా చాతుర్ వర్ణం, సనాతన ధర్మం అంటూ గుడుల చుట్టూ తిప్పి అక్షరాస్యత లేకుండా చేసేందుకే. చదువులేక ఆలోచించలేక జీవితం గడపమనే పాలకుల ఆలోచనగా కనబడుతోంది. ప్రతి మనిషి తన చుట్టూ ఉన్న పరిసరాల గురించి, తాను ఏర్పాటు చేసుకున్న సమాజం గురించి, తన జీవన గమనాన్ని తెలుసుకోవాలంటే కావలసింది చదువు. అందుకు కావలసింది బడేకాని గుడి కాదు. గుడిలో ప్రార్థన చేసినంత మాత్రాన తన బతుకు మారదు. విద్య వలనే మనిషి సమాజంలో ఎదుగుతాడు.

ఈనాడు 99 శాతం ప్రజలు దైవాన్ని నమ్మినవారే. అప్పుచేసి కూడా ఏడుకొండలు ఎక్కేవారే. అటువంటి భక్తులు నివసించే ఇల్లుగాని, తినే తిండి గాని పిల్లల భవిత, వారి ఆరోగ్యం గురించి ఆలోచించివలసిన బాధ్యత తిరుమల దేవస్థానం బోర్డుకు ఉండి తీరాలి. స్వామివారిని నమ్ముకున్న ప్రజల కూడు, గుడ్డ పిల్లల చదువు గురించి ఆలోచించాలి. విద్య, వైద్యం ముఖ్యం కనుక వారికి కావలసింది వారి పిల్లల చదువు కోసం బడులే కాని గుడులు కాదు. అయినా ప్రతి గ్రామంలో చిన్నదో, పెద్దదో ఒక గుడి ఉంటుంది. అయినా తిరుమల మెట్లు ఎక్కడం కోసం తపించిపోతారు. అందుకే వారి నివాస గ్రామాల్లో కావలసింది బడులు, ఆసుపత్రులేగాని గుడులు కాదు. ఇప్పటికైనా దేవస్థానం బోర్డు, ప్రభుత్వం ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. భక్తి భావం ఉన్న ప్రతి మనిషి ఇంట్లో పూజ చేసుకుంటూనే ఉంటాడు. దాంతో పాటు గతంలో బయటకు అడుగుపెట్టని స్త్రీల కోసం గుడులు ఏర్పాటయ్యాయి. ప్రస్తుతం బడిలేని గ్రామాలున్నాయి కాని గుడిలేని గ్రామాలు లేవు. అందుకే గజ్జెల మల్లారెడ్డి భక్తి పెరిగి ప్రతిచోట డ్రైనేజీలో పొంగి పొర్లుతోంది అంటాడు. ప్రస్తుత ప్రభుత్వం హాజరు తక్కువ ఉన్న స్కూళ్లను మూసి వేయమంటోంది. 20 మంది విద్యార్థుల కోసం ఒక టీచరును ప్రభుత్వం భరించలేదట. నాయకుల ఇళ్లలో డబ్బు కట్టలు పెరిగిపోతున్నా, వారిపై ఎటువంటి చర్యలు ప్రభుత్వం తీసుకోదుగాని విద్య నేర్పే గురువులకు జీతాలకు డబ్బులుండవు. రాష్ట్రంలో అవినీతి వరదలా పొంగి పొర్లుతుంటే అవి ప్రభుత్వానికి కనబడవు, వినబడవు. అసలు ప్రతి మనిషికి కావలసిన విద్య, వైద్యం అందించవలసిన నైతిక బాధ్యత ప్రభుత్వానిది. అయినా ప్రభుత్వం బడులు మూయించి గుడులు కట్టమనడం ప్రభుత్వానికి తగని పని.

- సెల్: 9885569394

విద్యా ప్రమాణాలు-విస్తరణ-వ్యాపారీకరణ

టి. లక్ష్మీనారాయణ

ప్రభుత్వ - ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో నూతన వైద్య కళాశాలలను అభివృద్ధి చేయాలన్న కూటమి ప్రభుత్వ విధాన నిర్ణయం తీవ్ర చర్చనీయాంశమైంది. వైద్య విద్య విస్తరణ అవసరమే. విద్య నాణ్యతా ప్రమాణాలు పతనమైతే నాసిరకం వైద్యులు తయారై, ఆరోగ్య రంగం సంక్షోభంలోకి నెట్టే ప్రమాదమున్నది. వైద్య కళాశాలల ఏర్పాటు - విద్యా ప్రమాణాల పరిరక్షణను వేరువేరుగా పరిగణించకూడదు. సమాజానికి మెరుగైన ఆరోగ్య సేవలను అందించగల నైపుణ్యం ఉన్న వైద్య పట్టభద్రులను అందించే కళాశాలలను నెలకొల్పాలి. లోపభూయిష్టమైన ప్రభుత్వ విధానాలు, నిర్వహణలో అసమర్థత -అవినీతి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందిలో పని సంస్కృతి బలహీనపడటం, వైద్య విద్యా రంగాన్ని భ్రష్టుపట్టించాయి. వ్యాపారీకరణతో వైద్య విద్యను ఖరీదైన అంగడి సరకుగా మార్చారు. ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు, నైపుణ్య అధ్యాపకుల కొరత, తదితర సమస్యలు వెంటాడుతున్నాయి. తరగతులకు హాజరుకావాలన్న ఆసక్తి విద్యార్థుల్లో కొరవడుతున్నదన్న అంశం ఆందోళనకరమైనది. విద్యా ప్రమాణాల పరిరక్షణ పట్ల ప్రభుత్వాల్లో సంకల్పం లేదు. వైద్య విద్య వ్యాపారీకరణ - వైద్యం కార్పొరేటీకరణ సమాజానికి ఆత్మహత్యాసదృశ్యమే.

వైద్యకళాశాలలు - ఆరోగ్య వ్యవస్థ: వైద్య కళాశాలలు, బోధనా ఆసుపత్రుల ద్వారా ఎంబీబీఎస్, ఎంఎస్/ఎండి, సూపర్ స్పెషాలిటీ పోస్ట్ గ్రాడ్యుయేట్స్‌కు నాణ్యమైన విద్య, శిక్షణ అందించడం ప్రభుత్వ బాధ్యత. రాష్ట్రంలో 1145 గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 559 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 174 కమ్యునిటీ ఆరోగ్య కేంద్రాలు, 54 ఉప జిల్లా కేంద్రాలు, 9 జిల్లా ఆసుపత్రులు, 21 బోధన, అనుబంధ ఆసుపత్రులు ఉన్నాయి. ఈ ఆసుపత్రుల వ్యవస్థను పటిష్టపరచి, విస్తరించి, సమర్థవంతంగా నిర్వహించాలి. రోగులకు నాణ్యమైన చికిత్స అందించడానికి, పౌరుల ఆరోగ్యాన్ని కాపాడటానికి నైపుణ్యం ఉన్న వైద్యులు అవసరం. ప్రస్తుతం 18 ప్రభుత్వ వైద్య కళాశాలలు (3,290 సీట్లు), 20 ప్రైవేటు కళాశాలలు (3,550 సీట్లు) ఉన్నాయి. కేపిటేషన్ ఫీజు, పెద్ద మొత్తంలో ట్యూషన్ ఫీజులు చెల్లించి, వైద్య పట్టభద్రులైన వారు ప్రభుత్వ దాక్టర్లుగా ఉద్యోగాల్లో చేరరు. మంగళగిరిలో ఆల్ ఇండియా ఇనిస్టూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్, 125 సీట్లు) ఉన్నది. 17 కళాశాలల

ఏర్పాటుకు ఒకేసారి అనుమతి!: ప్రతి జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల ఆలోచనతో ఏలూరు కళాశాల ఏర్పాటుకు నాటి టీడీపీ ప్రభుత్వం 2019 ఫిబ్రవరి 7న జీవో నం.17 జారీ చేసింది. తర్వాత వైసీపీ ప్రభుత్వం ప్రతి పార్లమెంటు నియోజకవర్గం ప్రాతిపదికగా ఏలూరుతో పాటు 17 వైద్య కళాశాలలను "సెల్ఫ్ ఫైనాన్స్" విధానంలో ఏర్పాటుకు రు.8,480 కోట్ల వ్యయ అంచనతో నాడు -నేడు పథకం కింద అనుమతిస్తూ 2020, 2021 లో జీవోలు జారీ చేసింది. వాటిలో పాడేరు, మచిలీపట్నం, పిడుగురాళ్ల (నిర్మాణంలో ఉన్నది) కళాశాలలకు కేంద్ర ప్రాయోజిత పథకం కింద నిధులు మంజూరైనాయి. అప్పులు చేయడంలో రికార్డులు బద్దలుకొట్టే నైజం మన పాలకులది. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన "మూలధన పెట్టుబడి కోసం రాష్ట్రాలకు ప్రత్యేక సహాయ పథకం" కింద రాజమహేంద్రవరం, ఏలూరు, నంద్యాల కళాశాలలకు, మిగిలిన 11 కళాశాలల నిర్మాణానికి నాబార్డు అనుబంధ సంస్థ అయిన "గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ" నుంచి రుణాన్ని మంజూరు చేయించుకున్నారు. విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల కళాశాలలను 2023-24 విద్యా సంవత్సరంలోనూ, పాడేరు కళాశాలను 2024-25 లోను ప్రారంభించారు. ఫలితంగా మెడికల్ సీట్లు 800 పెరిగాయి. మార్కాపురం, పులివెందుల, ఆదోని, మదనపల్లి కాలేజీలకు కొంత మంది అధ్యాపకులను, అధ్యాపకేతర సిబ్బందిని పాత కళాశాలల నుంచి హడావుడిగా బదిలీ చేశారు. మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో కల్పించలేదని నేషనల్ మెడికల్ కమిషన్ అనుమతి ఇవ్వలేదు. మిగతా ఏడు కళాశాలల నిర్మాణాలు ప్రాథమిక దశల్లోనే ఉన్నాయి. ప్రభుత్వ (పాత)కళాశాలల అభివృద్ధికి రు.3850 కోట్లు 2021 మార్చి 22న మంజూరు చేసి, చేపట్టిన నిర్మాణ పనులను మధ్యలోనే ఆపేశారు.

పీపీపీ ముచ్చట: 2024 లో ప్రభుత్వం మారింది. మార్కాపురం, పులివెందుల, ఆదోని, మదనపల్లి, నర్సీపట్నం, అమలాపురం, పాలకొల్లు, బాపట్ల, పెనుగొండ, పార్వతీపురం కొత్త కళాశాలల నిర్మాణ పనులను ప్రస్తుత ప్రభుత్వం నిలిపేసింది. ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ నిర్మాణ సంస్థలతో ఉన్న ఒప్పందాల రద్దు ప్రతిపాదన చేసింది. 2025 జనవరి 23 న కాంట్రాక్టులను రద్దు చేసి, పీపీపీ కింద ఈ పది కళాశాలలను నెలకొల్పే నిర్ణయాన్ని అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం జీవో ఆర్టీ నం.27 ను జారీ చేసింది. మార్కాపూరం, మదనపల్లి, పులివెందుల, ఆదోని కళాశాలలను వార్షిక రుసుం రాయితీ నమూనా కింద పనులకు టెండర్ పిలువమని కన్సల్టెంట్ సంస్థ సూచించిందని ప్రభుత్వమే వెల్లడించింది. ప్రభుత్వ నిర్ణయంపై విమర్శలు వెల్లువెత్తాయి. పీపీపీ అంటే ప్రైవేటీకరణ కాదంటూ ప్రభుత్వం బుకాయించడం అర్థరహితం.

సమాజానికి నైపుణ్యం ఉన్న వైద్యులు కావాలి. విద్యార్థులకు నాణ్యమైన వైద్య విద్యను అందించాలి. బోధనాసుపత్రుల్లో మెరుగైన శిక్షణ ఇవ్వాలి. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మౌలిక సదుపాయాలు నాసిరకంగా ఉన్నాయి. ప్రైవేటు కళాశాలల్లో పరిస్థితులు మరింత అధ్వాన్నంగా ఉన్నాయి. 2016 లో యూజీసీ వేతన సవరణ జరిగింది. వాటిని అమలు చేయడానికి మార్గదర్శకాలను సూచించమని 2019 ఫిబ్రవరిలో ప్రభుత్వం జీవో ఇచ్చింది. అటుపై వచ్చిన జగన్ ప్రభుత్వం, 2016 నుంచి పెరిగిన వేతనాల బకాయిలను ఎగ్గొట్టడానికి "ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ రివైజ్డ్ పే స్కేల్స్-2020" అంటూ 2021 మార్చిలో ప్రత్యేక జీవో ఇచ్చింది. తద్వారా అధ్యాపకులు తీవ్రంగా నష్టపోయారు. అధ్యాపకులకు బోధనేతర పనుల భారం పెంచారు. అక్రమ జీవోలతో పదోన్నతులు, బదిలీలు, అవినీతి, తప్పుడు విధానాల పర్యవసానంగా అధ్యాపకులను నాటి ప్రభుత్వం తీవ్ర అసంతృప్తికి గురిచేసింది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర గడచినా వారికి వేతన బకాయిలు చెల్లించలేదు. ప్రభుత్వ కళాశాలల్లో ప్రొఫెసర్స్, అసోసియేట్ ప్రొఫెసర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ కొరత తీవ్రంగా ఉన్నది. అనేకసార్లు నియామక ప్రక్రియ చేపట్టినా ఆ సమస్య పరిష్కారం కాలేదు. కొత్త కళాశాలల్లో అధ్యాపకులను నియమించడానికి ప్రత్యేక వేతన ప్యాకేజీని ప్రభుత్వం ప్రకటించింది. నేడు దేశంలో ఉన్న 780 వైద్య కళాశాలల్లో 1,18,148 సీట్లు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ కళాశాలలు 427 (59,782 సీట్లు), ప్రైవేట్ కళాశాలలు 352 (58,316 సీట్లు) ఉన్నాయి. ప్రైవేటు రంగంలో ఉన్న కళాశాలలను ప్రైవేటు సంస్థలు/ట్రస్టులు /సొసైటీలు నిర్వహిస్తున్నాయి. వైద్య విద్యను విస్తరించడానికి నీతి ఆయోగ్ 2016-2017 ఆర్థిక సంవత్సరంలో, జిల్లా ఆసుపత్రికి అనుబంధంగా ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)లేదా సెల్ఫ్ ఫైనాన్సింగ్ మోడల్ కింద కళాశాలలను ఏర్పాటుచేసే ప్రతిపాదన చేసింది. ప్రభుత్వ - సొసైటీ యాజమాన్యం కింద 2019-24 మధ్య కాలంలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం రెండు కళాశాలలు నెలకొల్పినట్లు ఎన్ఎంసీ వెబ్‌సైట్ సమాచారం తెలియజేస్తున్నది. పీపీపీ నమూనాలో ఒక్క వైద్య కళాశాల నిర్వహిస్తున్న దాఖలాలు లేవు. వైద్య కళాశాలల ఏర్పాటులో ప్రాంతీయ అసమానతలను తొలగించడానికి, పట్టణ/గ్రామీణ అంతరాన్ని తగ్గించడానికి, అందరికీ ఆరోగ్య సంరక్షణ లక్ష్యంతో, ప్రభుత్వ లేదా ప్రైవేట్ రంగంలో ఒక్క వైద్య కళాశాల కూడా లేని పార్లమెంటరీ నియోజకవర్గాలు/ జిల్లాలలో ఇప్పటికే ఉన్న జిల్లా/ రిఫరల్ ప్రభుత్వ ఆసుపత్రులను జతచేసి, 157 కొత్త వైద్య కళాశాలలను కేంద్ర ప్రాయోజిత పథకం కింద ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఒక పథకాన్ని అమలు చేస్తున్నది. కేంద్ర ప్రాయోజిత పథకం క్రింద కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుకు ప్రత్యేక తరగతి హోదా పేరుతో 90% నిధులను మంజూరు చేసింది. కేంద్ర ప్రాయోజిత పథకం క్రింద కేవలం పాడేరు, మచిలీపట్నం, పిడుగురాళ్ల వైద్య కళాశాలలకు రు.325 కోట్ల చొప్పున 2020 ఫిబ్రవరి 19న మంజూరు చేసింది. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ పద్దు క్రిందైనా ఎక్కువ వైద్య కళాశాలలను మంజూరు చేయమని నాటి జగన్ ప్రభుత్వం అడిగినట్లులేదు. నేటి కూటమి ప్రభుత్వానికి ఆ ఆలోచనే కొరవడినట్లుంది. నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలలను పూర్తిచేసి, నిర్వహించడానికి కేంద్ర ప్రాయోజిత పథకం క్రింద నిధులను మంజూరు చేయించుకోవడానికి అంకితభావంతో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేసి, సాధించాలి.

వీధి విక్రయదారుల వెతలు తీరేదెలా?

డాక్టర్ సి.ఎస్ క్షేత్రపాల్‌రెడ్డి

భారతదేశ శ్రామిక శక్తిలో దాదాపు 82 శాతానికి పైగా అసంఘటిత రంగంలో బతుకీడుస్తున్నారు. ఇందులో వీధి వ్యాపారాలు చేసుకుని జీవించే వారి సంఖ్య గణనీయమైంది. ఒకే చోట కూర్చొని వ్యాపారం చేసుకునేవారు ఎక్కువ మంది ఉంటుండగా, ఊరూరా తిరుగుతూ వ్యాపారం చేసుకునేవారు, ప్రధాన కూడళ్లలో తిరుగుతూ వ్యాపారం చేసుకునే వారిగా వీధి వ్యాపారులు కనిపిస్తారు. నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ దశాబ్దాల కింద పేర్కొన్న గణాంకాల ప్రకారం మన దేశంలోని వీధి విక్రయదారుల సంఖ్య 3.5 కోట్లుగా అంచనా వేశారు. జనాభా పెరుగుదల, మృగ్యమవుతున్న ఉపాధి, పేదరికం, నైపుణ్య లేమి, అవిద్య, ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో సన్నగిల్లిన వ్యవసాయం కారణంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వలసల కారణంగా జరుగుతున్న పట్టణీకరణ తదితరాల కారణంగా ఇప్పుడు ఈ రంగంలో సుమారు 10 కోట్లకు పైగానే ఉపాధి పొందుతున్నట్టు అంచనాలున్నాయి. టాటా ఇన్స్టూట్ ఆఫ్ సోషల్ సైన్స్ సంస్థ చేసిన సర్వేలోనూ నగరాల్లో వీధి వ్యాపారాలు గణనీయంగా పెరిగాయని తెలిపింది. వీధి వ్యాపారం ఆధునిక సమాజంలో కొత్తగా పుట్టుకుని వచ్చింది కాదు. చరిత్ర పరిణామ క్రమంలో వీరికి ప్రత్యేక స్థానం కనిపిస్తుంది. పురాతన, మధ్య యుగాల్లోనూ వీధి వ్యాపారాల ప్రస్తావనలున్నాయి. సంచార వ్యాపారులుగా విదేశాల్లోనూ వ్యాపారాలు చేసిన దాఖలాలు కనిపిస్తాయి.

దేశ స్వాతంత్ర్యానంతరం అనేక దశాబ్దాలు ఈ రంగంపై పెద్దగా చర్చ జరగలేదు. అయితే 2004 లో పట్టణాల్లో ఉంటున్న వీధి విక్రేతలకు సంబంధించి ఒక జాతీయ విధానం రూపొందింది. శాశ్వతమైన నిర్మాణాలు లేకుండా ప్రజలకు అవసరమైన అమ్మకాలను, వస్తు సేవలను అందించే వ్యక్తులను వీధి విక్రేతలుగా తేల్చింది. అయితే వారు సాగించే వ్యాపారాలకు చట్టపరమైన రక్షణ విషయంలో స్పష్టత లభించలేదు. ఈ నేపథ్యంలో పట్టణ వీధి వ్యాపారులకు చట్టపరమైన హక్కులను కాపాడటానికి, వారి వ్యాపార పద్ధతులను నియంత్రించడానికి వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి 2004 నాటి జాతీయ విధానాన్ని 2009 లో "పట్టణ వీధి విక్రేతల జాతీయ విధానం"గా సవరించారు. వీధి వ్యాపారుల సేవల్ని పరిగణనలోకి తీసుకుని కొన్ని హక్కులను కల్పించారు. ప్రజల హక్కులకు భంగం కలిగించకుండా జీవనోపాధిని పొందే వృత్తి, వ్యాపారం చేసుకునే హక్కు లభించింది. ఇందుకోసం ముందుగా పట్టణాల్లో వెండింగ్ కమిటీల ఏర్పాటు, నో వెండింగ్ జోన్ల గుర్తింపు, విక్రేతలపై సర్వేలు చేయడం, విక్రయ ధృవీకరణ పత్రాలు జారీ, ప్రతి ఐదేళ్లకొకసారి రీసర్వే, తరలింపు తప్పనిసరి అయితే నెల రోజుల ముందస్తు నోటీసు, పునరావాసం ఏర్పాటు తదితర నిబంధనలు పొందుపర్చారు. అయినా ఇవేవీ అమలుకు నోచుకోకపోవడంతో వీధివ్యాపారుల సమస్యలు ఇంతింతై వటుడింతై అన్న చందాన తయారయ్యాయి.

సమస్య జటిలమవుతున్న దశలో 'వీధి వ్యాపారుల జాతీయ విధానం అమలు చట్టపరమైన రక్షణ' అనే అంశంపై 2011 లో దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వమే కీలకమైన నగరాల్లో చర్చలు నిర్వహించింది. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, పట్టణ స్థానిక సంస్థలు, పౌర సమాజం, అంతర్జాతీయ సంస్థలు, నిపుణులు, వీధి వ్యాపారుల సంఘాల సభ్యులు ఇందులో భాగస్వామ్యమయ్యారు. ఆ సమావేశాల్లో వచ్చిన సూచనలు, సలహాల మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు వర్తించే విధంగా ఒక చట్టాన్ని తీసుకురావాలని గృహనిర్మాణ పట్టణ పేదరిక నిర్మూలన మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుంది. 2012 లో వీధి విక్రేతల (జీవనోపాధి రక్షణ, వీధి అమ్మకాల నియంత్రణ) బిల్లును పార్లమెంటులో పెట్టింది. ఈ బిల్లును ప్రవేశపెడుతూ నాటి కేంద్ర మంత్రి డాక్టర్ గిరిజా వ్యాస్ 'వీధి వ్యాపారులు పట్టణ ఆర్థిక వ్యవస్థలో అంతర్భాగం. నగరాలు, పట్టణాల్లోని పేదలకు వీధి వ్యాపారాలు స్వయం ఉపాధి మార్గమే కాకుండా ఎక్కువ మంది ప్రజానీకానికి సరసమైన, సౌకర్యవంతమైన సేవలను అందించడానికి కూడా ఒక మార్గం' అని పేర్కొన్నారు. కోట్ల మంది జీవనోపాధి సమస్యలను పరిష్కరించుకోవడానికి ఈ బిల్లు మార్గం సుగమం చేస్తుందని, వేధింపుల భయం లేకుండా తమ వ్యాపారాన్ని న్యాయంగా, పారదర్శకంగా చేసుకునే వెసులుబాటు ఈ బిల్లు ద్వారా లభిస్తుందని తెలిపారు.

ఈ బిల్లులోని నిబంధనల మేరకు ప్రతి స్థానిక సంస్థలో వెండింగ్ అథారిటీ ఏర్పాటు అవుతుంది. వీధి విక్రేతల్లో వికలాంగులకు, మహిళలు, మైనారిటీలకు అవకాశం వంటి నిబంధనలు, అధికారుల ఏకపక్ష నిర్ణయాలను నివారించే చర్యలు పేర్కొన్నారు. 50 సంవత్సరాలకు పైగా వీధి విక్రేతలు చేసుకుంటున్న వ్యాపారాలను వారసత్వ మార్కెట్లుగా ప్రకటించడం, అటువంటి మార్కెట్లను తరలించకుండా పటిష్టమైన నిబంధనలు చేర్చారు. అధికారుల దాడుల తరుణంలో జప్తు చేసే వస్తువులను అప్పగించే విషయంలోనూ నిబంధనలు ఉన్నాయి. వీధి వ్యాపారులకు బీమా, రుణాలు, సామాజిక భద్రతకు సంబంధించిన సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలూ పేర్కొన్నారు. పని ప్రదేశాల్లోని కార్మికుల సంక్షేమం, ప్రావిడెంట్ ఫండ్, యజమానుల బాధ్యత, ఇబ్బందికర పరిస్థితుల్లో పరిహారం వంటి అంశాలకు చోటు లభించింది. బిల్లులోని సెక్షన్ 29 పోలీసులు, ఇతర విభాగాల అధికారుల వేధింపుల నుంచి రక్షణ కల్పిస్తుంది. ప్రధానంగా వీధి వ్యాపారులపై అందే ఫిర్యాదులపై విశ్రాంత న్యాయమూర్తుల అధ్యక్షతన స్వతంత్ర వివాద పరిష్కార యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలనే నిబంధనా ఇందులో ఉన్నది. 2012 ఆగస్టు 17 న మంత్రివర్గం ఆమోదించిన ఈ చట్టం సెప్టెంబర్ 6, 2012 న లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అదే నెల 10 వ తేదీన పార్లమెంటు స్టాండింగ్ కమిటీకి చేరింది. ఆ కమిటీ చేసిన 26 సిఫార్సుల్లో 17 సిఫార్సుల అమోదం అనంతరం 2014 లో ఉభయసభల ఆమోదంతో చట్టం రూపం పొందింది.

పార్లమెంటులో అడపాదడపా అణగారిన, పేద వర్గాల శ్రేయస్సు కోసం ఇటువంటి చట్టాలు రూపొందించినా వాటి అమలు గురించి పాలకులకు పట్టడం లేదు. అటువంటి చట్టాల్లో వీధి విక్రేతలు (జీవనోపాధి రక్షణ, వీధి అమ్మకాల నియంత్రణ) చట్టం-2014 ఒకటిగా మిగిలింది. వీధి వ్యాపారులు తమ మనుగడకోసం పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కాదు. కేంద్రం రుణాల ఇవ్వడం కోసం కొన్ని పథకాలు ప్రకటించినా బ్యాంకర్లతో సమస్యలు ఎదురవుతుండడంతో వీధి వ్యాపారులు తమ చిన్నపాటి వ్యాపారాలకు అవసరమైన డబ్బును వడ్డీ వ్యాపారుల వద్దనే తీసుకుంటున్నారు. చెల్లించాల్సిన వడ్డీ రేట్లు అసాధారణ రీతిలోనే ఉంటున్నాయి. తీసుకున్న అప్పును ఏ రోజుకారోజు తీర్చవలసిన స్థితి ఉంటున్నది. దీనికి అదనంగా అధికారుల వేధింపులు, పోలీసులే లంచాలు అడగడం, ఇవ్వకపోతే దాడులు, వేధింపులకు గురిచేయడం వంటి ఘటనల్ని చూస్తూనే ఉన్నాం. కోవిడ్-19 మహమ్మారి అనంతరం వారి పరిస్థితి మరింత గడ్డుగా మారింది. చట్ట ప్రకారం వీధి వ్యాపారులకు నిర్దిష్ట స్థలాల ఎంపికలు జరగడం లేదు. దీని ఫలితంగా బతకడం కోసం కాలిబాటలు, రోడ్ల పక్కన వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఇది పాదచారులకు ఇబ్బంది కలిగిస్తున్నది. ట్రాఫిక్‌కు అంతరాయం అవుతున్నదనే కారణాలతో పోలీసులు, మునిసిపల్ కార్పొరేషన్లు, ప్రజా సంక్షేమ శాఖల అధికారులు వీధి వ్యాపారులపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. పార్లమెంటు చేసిన చట్టంపై సమగ్రమైన అవగాహన లేకపోవడమే ఇందుకు కారణం. వీధి విక్రయదారులపై వేధింపులు మానవ హక్కుల ఉల్లంఘనల కిందే పరిగణిస్తారు. ఏ రోజుకారోజు పొట్టపోసు కుని జీవించే వారిపై వారి భవిష్యత్తుకు ఈ చర్యలు గొడ్డలిపెట్టు వంటివే. ఇది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్-21 కి విఘాతం. ఐక్యరాజ్య సమితి 1948 లో 'యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్' పేరుతో చేసిన సార్వత్రిక ప్రకటనపై భారతదేశం కూడా సంతకం చేసింది. ఆ ప్రకటన కూడా జీవించే హక్కు, పని చేసుకునే హక్కుకు రక్షణ ఉండాలనే అంటోంది. విశాఖలో గత వారం వేల మంది వీధి వ్యాపారులు తమ జీవనోపాధిని దూరం చేయకండని నినదిస్తూ రోడ్డుపైకి వచ్చారు. ఈ నేపథ్యంలో వీధి విక్రయదారుల చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. ఇందుకోసం చట్టపరిధిలో చిత్తశుద్ధితో పనిచేయడం ఒక్కటే మార్గమని అధికార యంత్రాంగం గుర్తించాలని కోరుకుందాం.

- 9059837847

శాశ్వత శాంతికి మార్గం: మోదీ

న్యూఢిల్లీ: గజాలో యుద్ధం ముగించేందుకు ఇజ్రాయిల్, హమాస్ మొదటి దశ శాంతి ఒప్పందానికి అంగీకరించాయని, ఒప్పందంపై రెండుపక్షాలు సంతకం చేశాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. దీనిపై తాజాగా ప్రధాని నరేంద్రమోదీ స్పందించారు. ట్రంప్ శాంతి ప్రణాళికకు సంబంధించి మొదటి దశ ఒప్పందాన్ని స్వాగతించారు. ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు బలమైన నాయకత్వానికి ఇది అద్దంపడుతోందన్నారు. బందీలను విడుదల చేయడం, గజా ప్రజలకు మెరుగైన మానవతా సాయం అందేలా చూడటం వల్ల శాశ్వత శాంతికి బాటలు పడతాయని మోదీ ఆశాభావం వ్యక్తంచేశారు. సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఇజ్రాయిల్-హమాస్ మధ్య యుద్ధం ముగించేందుకు ట్రంప్ 21 సూత్రాల శాంతి ఫార్ములా సూచించిన సంగతి తెలిసిందే. దానిని భారత్, రష్యా, చైనా సహా అనేక దేశాలు ఆహ్వానించాయి.

ఏఐ దుర్వినియోగం వద్దు: ఈసీ

న్యూఢిల్లీ: బీహార్ శాసనసభ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో కేంద్ర ఎన్నికల సంఘం రాజకీయ పార్టీలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నేపథ్యంలో డీప్‌ఫేక్‌లు సృష్టించడానికి, తప్పుడు సమాచారం వ్యాప్తి చేసేందుకు కృత్రిమ మేధ(ఏఐ)ను దుర్వినియోగం చేయొద్దని హెచ్చరించింది. ఈ మేరకు గురువారం ఈసీ ఓ ప్రకటన జారీ చేసింది. పార్టీలు ఎన్నికల ప్రచారంలో భాగంగా తమ సోషల్ మీడియా వేదికలలో పంచుకునే విషయాలు ఏఐ జనరేటెడ్ లేదా కల్పితమైనవి అయితే ఆ విషయాన్ని కచ్చితంగా స్పష్టం చేయాలని పేర్కొంది. పార్టీలు, స్టార్ క్యాంపెయినర్లు, అభ్యర్థులు ఈ విషయాన్ని గుర్తించాలని తెలిపింది. ఎన్నికల ప్రక్రియపై ప్రభావం పడకుండా ఉండేందుకు సామాజిక మాధ్యమాల్లోని పోస్టులపై నిఘా ఉంటుందని హెచ్చరించింది. ఎన్నికల ప్రక్రియ సమగ్రతను నిలబెట్టుకోవాల్సిన అవసరం అన్ని పార్టీలకు ఉందని నొక్కి చెప్పింది. గత లోక్‌సభ ఎన్నికల సమయంలోనూ ఈసీ ఇలాంటి ఆదేశాలే జారీ చేసింది. బీహార్‌లో నవంబరు 6, 11 తేదీల్లో రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. 14న ఓట్ల లెక్కింపు ఉంటుంది.

దగ్గు మందు వివాదంపై పిల్

విచారణకు సుప్రీం అంగీకారం

న్యూఢిల్లీ: దగ్గు మందు తాగిన చిన్నారులు మృతి చెందిన ఘటన దేశవ్యాప్తంగా దిగ్భ్రాంతికి గురిచేసింది. 'కోల్డ్‌రిఫ్' దగ్గుమందు కారణంగా మధ్యప్రదేశ్‌లో పలువురు పిల్లలు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి సీబీఐ విచారణ కోరుతూ సుప్రీం కోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. దాన్ని విచారించేందుకు తాజాగా న్యాయస్థానం అంగీకరించింది. ఈ పిల్‌పై తక్షణమే విచారణ జరపాల్సి ఉందని పిటిషనర్, న్యాయవాది విశాల్ తివేరి విన్నవించారు. దీంతో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఉజ్జయ్ భూయాన్, జస్టిస్ కె.వినోద్‌చంద్రన్‌తో కూడిన ధర్మాసనం న్యాయవాది అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుంది. దీనిపై శుక్రవారం విచారణ జరిపేందుకు అంగీకరించింది.

కోల్డ్‌రిఫ్ యజమాని అరెస్టు

కోల్డ్‌రిఫ్ దగ్గు మందు వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కోల్డ్‌రిఫ్ సిరప్ తయారీ సంస్థ శ్రేసన్ ఫార్మా యూనిట్ యజమానిని పోలీసులు అరెస్టు చేశారు. ఫార్మా యజమాని రంగనాథన్‌ను బుధవారం అర్ధరాత్రి చెన్నైలో అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. అనంతరం కాంచీపురంలోని అతని ఫ్యాక్టరీకి తీసుకెళ్లి విచారించారు. ఈ కేసుకు సంబంధించి మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. కోల్డ్‌రిఫ్ దగ్గు సిరప్‌లు మధ్యప్రదేశ్‌తో పాటు ఒడిశా, పుదుచ్చేరిలకు కూడా సరఫరా చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

విజయ్ ఇంటికి బాంబు బెదిరింపు

చెన్నై: తమిళ అగ్రనటుడు, టీవీకే అధినేత విజయ్ ఇంటికి గురువారం బాంబు బెదిరింపు వచ్చింది. దీంతో నీలగిరిలోని ఆయన నివాసం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. ఫోన్ చేసిన అగంతకుడిని గుర్తించే పనిలో ఉన్నారు. 'భవిష్యత్తులో విజయ్ పబ్లిక్ ర్యాలీలు నిర్వహిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయి, ఇంటిని బాంబుతో పేల్చేస్తానని' చెన్నై పోలీసులకు వచ్చిన కాల్ కోయంబత్తూరు నుంచి వచ్చినట్లు నిర్ధారించుకున్న పోలీసులు అతడిని పట్టుకునే ప్రయత్నంలో ఉన్నారు. కాగా, గత నెల 27న కరూర్‌లో నిర్వహించిన టీవీకే ర్యాలీలో తొక్కిసలాట జరిగి 41 మంది మరణించారు. ఘటన తర్వాత విజయ్ బాధితులను పరామర్శించకుండా అక్కడి నుంచి వెళ్లిపోవడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది.

ఐదు లక్షలకు పైగా నకిలీ ఓటర్లు

బీహార్ తుది ఓటర్ల జాబితాపై కాంగ్రెస్ అనుమానం

న్యూఢిల్లీ: బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) చెల్లుబాటును కాంగ్రెస్ మరోసారి ప్రశ్నించింది. ఎస్ఐఆర్ తర్వాత విడుదలైన తుది ఓటర్ల జాబితాలో వ్యత్యాసాలుండటంపై కేంద్ర ఎన్నికల సంఘాన్ని నిలదీసింది. బీహార్‌లో 2024 లోక్‌సభ ఎన్నికలు -రాబోయే అసెంబ్లీ ఎన్నికల (2025) మధ్య నమోదైన ఓటర్ల సంఖ్యలో తేడాలుండటంపై ఈసీకి ప్రశ్నలు సంధించింది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం ఈసీ ప్రచురించిన తుది ఓటర్ల జాబితాలో ఐదు లక్షలకు పైగా నకిలీ ఓటర్లు ఉన్నారని కాంగ్రెస్ పేర్కొంది. ఈ మేరకు కాంగ్రెస్ ఎన్నికల పర్యవేక్షణ విభాగం, ఎంపవర్డ్ యాక్షన్ గ్రూప్ ఆఫ్ లీడర్స్ అండ్ ఎక్స్‌పర్ట్స్ (ఈఏజీఎల్ఈ)తో పాటు మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పి.చిదంబరం సందేహాలు లేవనెత్తారు. "భారత ప్రభుత్వం ప్రకారం బీహార్ వయోజన జనాభా అంచనా ఎంత? బీహార్ ఓటర్ల జాబితాలో వయోజన జనాభా ఎంత నిష్పత్తిలో చేర్చబడింది? అది 90.7% అవునా? మిగిలిన 9.3% వయోజన జనాభా సంగతేంటి? వారిని ఓటర్ల జాబితాలో ఎందుకు చేర్చలేదు?" అని చిదంబరం ప్రశ్నించారు.

పార్టీ విడుదల చేసిన ఒక ప్రకటనలో "బీహార్‌లో లోక్‌సభ (2024) ఎన్నికలకు 7.72 కోట్ల మంది నమోదిత ఓటర్లు ఉన్నారు. అంటే నికరంగా లోక్‌సభ ఎన్నికలకు ఓటర్లుగా నమోదు చేసుకున్న బీహార్‌లోని 30 లక్షల మంది ప్రజలు ఇకపై శాసనసభ ఎన్నికలకు ఓటర్లు కారు. ఈ 30 లక్షల మంది ఎవరు? లోక్‌సభ ఎన్నికలకు వీరిలో ఎంత మంది ఓటు వేశారు?" అని ఈఏజీఎల్ఈ ప్రశ్నించింది. కొత్త ఓటర్లను నమోదు చేయడానికి 16.93 లక్షల ఫారమ్-6 దరఖాస్తులు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, 21.53 లక్షల ఓటర్లను చేర్చామనే ఈసీ వాదనకు ఇది భిన్నంగా ఉందని తెలిపింది. తుది జాబితాలో దాదాపు 5 లక్షల పేర్లు నకిలీవని కాంగ్రెస్ ఆరోపించింది.

"ఓటర్ల జాబితాలో ఎన్ని పేర్లు అర్థరహితంగా ఉన్నాయి? ఆ సంఖ్య దాదాపు 24వేలేనా? ఎన్ని ఇంటి నంబర్లు ఖాళీగా ఉన్నాయి లేదా స్పష్టంగా లేవు? ఆ సంఖ్య 2లక్షల కంటే ఎక్కువగా ఉందా? జాబితాలో ఎన్ని పేర్లు చేర్చబడ్డాయి? ఆ సంఖ్య దాదాపు 5.20 లక్షలేనా?" అని చిదంబరం ఈసీని ప్రశ్నించారు.

51మందితో జనసురాజ్ పార్టీ తొలి జాబితా

పట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన్‌సురాజ్ పార్టీ 51 మంది అభ్యర్థులతో తొలి జాబితా విడుదల చేసింది. పాఠ్యపుస్తకాలు రాసిన గణిత శాస్త్రజ్ఞుడు, రిటైర్డ్ పోలీసు అధికారి, వైద్యుడు, మాజీ అధికారులు ఈ జాబితాలో ఉన్నారు. అవినీతిపై గళమెత్తిన ప్రశాంత్ కిశోర్... ఎటువంటి మచ్చ లేని అభ్యర్థుల ఎంపికపై దృష్టిసారించారు. తొలి జాబితాలో ఉన్న అభ్యర్థుల్లో 17 శాతం బీసీలు, 16 శాతం ముస్లిం అభ్యర్థులుండగా... ప్రముఖ గణిత శాస్త్రజ్ఞుడు కేసీ సిన్హా కుమ్రార్ స్థానం నుంచి జన్ సురాజ్ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. గతంలో పట్నా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్‌గా పనిచేసిన ఆయన రాసిన పాఠ్యపుస్తకాలు బీహార్‌తోపాటు వివిధ రాష్ట్రాల్లో ప్రాచుర్యం పొందాయి. పట్నా హైకోర్టులో సీనియర్ న్యాయవాది వైబీ గిరి, బీహార్ అదనపు అడ్వకేట్ జనరల్‌గాను, పట్నా హైకోర్టులో కేంద్ర ప్రభుత్వ కేసులకు అదనపు సొలిసిటర్ జనరల్‌గా కూడా పనిచేశారు. మాంఝీ స్థానం నుంచి ఆయన పోటీ చేస్తున్నారు. పట్నా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ పూర్వ విద్యార్థి, గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య సౌకర్యాలకు కృషి చేసిన డాక్టర్ అమిత్ కుమార్ దాస్, ముజఫర్‌పూర్ స్థానం నుంచి ఎన్నికల బరిలో నిలిచారు. మరోవైపు రాజకీయ వ్యూహకర్త నుంచి రాజకీయ నేతగా మారిన ప్రశాంత్ కిశోర్ పేరు తొలి జాబితాలో లేదు. అయితే తాను ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు ఆయన ఇప్పటికే ప్రకటించారు. ఆర్జేడీ బలమైన స్థానం, తేజస్వీ యాదవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న రాఘోపూర్ నుంచి ఆయన పోటీ చేయవచ్చని సమాచారం.

ప్రతి ఇంటికీ ప్రభుత్వ ఉద్యోగం

తేజస్వీయాదవ్ సంచలన ప్రకటన

పట్నా: మరికొన్ని రోజుల్లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటంతో ఇప్పటికే అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రచారంలో మునిగిపోయాయి. ఓటర్లను ఆకర్షించేందుకు వరాల జల్లులు కురిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఇండియా ఐక్యసంఘటనలో భాగమైన రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) నేత తేజస్వీ యాదవ్ సంచలన ప్రకటన చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి ఇంటికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇది కేవలం ప్రకటన మాత్రమే కాదని ప్రతిజ్ఞ అని చెప్పారు. " రాష్ట్రంలో నిరుద్యోగం ప్రధాన సమస్యగా ఉందని శిథిలావస్థలో ఉన్న అధికారంలో ఉన్న ప్రభుత్వానికి తెలియదు. మేము అధికారంలో వస్తే ప్రభుత్వ ఉద్యోగం లేని ప్రతి కుటుంబానికి ఉద్యోగం కల్పించేలా చట్టం తీసుకొస్తాం. ప్రభుత్వం వచ్చిన 20 రోజుల్లోపే ఈ చట్టాన్ని అమలు చేస్తాం. ఇక 20 నెలల్లో బీహార్‌లో ప్రభుత్వ ఉద్యోగం లేని కుటుంబం ఉండదు. దీనిపై మేము ఇప్పటికే డేటా సేకరించి సర్వే కూడా నిర్వహించాం. 20 ఏళ్ల పాటు అధికారంలో ఉన్న ప్రభుత్వం ప్రతి ఇంటినీ భయభ్రాంతులకు గురిచేసింది. మేము మాత్రం ప్రతి ఇంటికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తాం" అని తేజస్వీయాదవ్ పేర్కొన్నారు. బీహార్‌లో 243 అసెంబ్లీ స్థానాలుండగా నవంబర్ 6, 11న రెండు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు జగనున్న సంగతి తెలిసిందే. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు ఉంటుంది. 7.42 కోట్ల మంది తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఈ మొత్తం ఓటర్లలో 3.92 కోట్ల మంది పురుషులు, 3.5 కోట్ల మంది మహిళలు ఉన్నారు.

కర్నాటక కేబినెట్ విస్తరణకు వేళాయే!

బెంగళూరు: కర్నాటక కేబినెట్ పునర్వ్యవస్థీకరణ జరగనుందా అనే ప్రచారం ఊపందుకుంది. తన సహచర మంత్రులకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విందు ఏర్పాటు చేయడం ఇందుకు బలం చేకూరుతోంది. రెండున్నరేళ్ల పదవీకాలం ముగియడంతో 50 శాతం మంత్రులను తొలగించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. 13న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కేబినెట్ మంత్రులకు డిన్నర్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ అధిష్ఠానంతో చర్చించిన సమయంలో సీఎం తన భవిష్యత్తు ప్రణాళికలు వెల్లడించినట్లు తెలుస్తోంది. నవంబర్‌లో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని భావిస్తున్నట్లు చెప్పారని మీడియా కథనాలు తెలిపాయి. దానిలోభాగంగా ప్రస్తుతం రెండున్నరేళ్లు పూర్తి చేసుకున్న 50 శాతం మంది మంత్రులను తొలగించి... కొత్తవారికి అవకాశం ఇస్తారని సమాచారం. కొత్తవారిని కేబినెట్‌లోకి తీసుకుంటే... ఆ వెంటనే సీఎం మార్పుపై అధిష్ఠానం నిర్ణయం తీసుకోవడం కష్టతరమవుతుందని పార్టీ అంతర్గత వర్గాలు భావిస్తున్నాయి. పార్టీలో ముఖ్యమంత్రి తన స్థానాన్ని సుస్థిరం చేసుకునేందుకు వీలు కలగనుందని చెబుతున్నాయి. కర్నాటక రాజకీయాల్లో సీఎం మార్పుపై రోజుకో చర్చ నడుస్తోంది. తనకు సీఎం పదవి చేపట్టాలని ఉందని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ పలుమార్లు ప్రకటించిన సంగతి తెలిసిందే.

బిగ్‌బాస్ హౌస్‌కు తాళాలపై పంచాయితీ

కన్నడ బిగ్‌బాస్ హౌస్‌కు తాళాలు వేసిన వ్యవహారంపై కర్నాటకలో మంత్రి, ఎమ్మెల్యేల మధ్య విభేదాలు తలెత్తాయి. వారి పంచాయితీ సీఎం సిద్ధరామయ్య వద్దకు చేరింది. బిగ్‌బాస్ హౌస్‌ను మంగళవారం కాలుష్య నియంత్రణ మండలి మూసివేసింది. ఈ కార్యక్రమం జరుగుతున్న బిడదిలోని అమ్యూజ్‌మెంట్ పార్కు 'జాలీవుడ్' స్టూడియో నుంచి నిత్యం 2.5 లక్షల లీటర్ల శుద్ధిచేయని నీరు బయటకు వస్తోందని ఆరోపణలు రావడంతో కాలుష్య నియంత్రణ మండలి నోటీసులు జారీ చేసింది. వీటిని షో నిర్వాహకులు పట్టించుకోకపోవడంతో హౌస్‌కు తహసీల్దారు తేజస్విని అధికారులతో కలిసి బయట నుంచి తాళాలు వేశారు. ఈ విషయంలో కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్, ఎమ్మెల్యే నరేంద్రస్వామి ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. పర్యావరణ శాఖ బాధ్యతలు చూస్తోన్న మంత్రి ఈశ్వర్ ఖండ్రేకు ఎమ్మెల్యే ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. నరేంద్ర స్వతంత్రంగా వ్యవహరించడం మంత్రిని దిగ్భ్రాంతికి గురిచేసిందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇది ఇద్దరి మధ్య విభేదాలకు దారితీసిందని వెల్లడించాయి. ప్రస్తుతం ఈ వ్యవహారం సిద్ధరామయ్య చెంతకు చేరింది. ఆయన ఆ ఇద్దరు నేతలతో మాట్లాడనున్నారని తెలుస్తోంది. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ జోక్యంతో బిగ్‌బాస్ హౌస్ తలుపులు తెరుచుకున్న సంగతి తెలిసిందే.

ప్రైవేట్ విమానానికి తప్పిన ప్రమాదం

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని ఫరూఖాబాద్ జిల్లాలో టేకాఫ్ అవుతున్న ప్రైవేట్ విమానం రన్ వే నుంచి జారి పక్కన ఉన్న గడ్డిలోకి దూసుకెళ్లింది. ఆ విమానంలో ఉన్న ప్రముఖులకు ప్రమాదం తప్పింది. జెట్ సర్వ్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన వీటీ డే జెట్ విమానం గురువారం ఉదయం 10.30 గంటల సమయంలో మొహమ్మదాబాద్ ఎయిర్‌స్ట్రిప్ నుంచి భోపాల్‌కు బయలుదేరింది. అయితే టేకాఫ్ అయిన వెంటనే ఆ విమానం అదుపుతప్పింది. రన్ వే నుంచి సుమారు 400 మీటర్లు జారింది. పక్కనే ఉన్న గడ్డి ప్రాంతంలోకి దూసుకెళ్లి ఆగింది. కాగా, ఫుడ్‌పెకర్ గ్రీనాగ్రి న్యూట్రియంట్స్ కంపెనీకి చెందిన డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ అజయ్ అరోరా, ఎస్‌బీఐ హెడ్ సుమిత్ శర్మ, బీపీవో రాకేష్ వంటి ప్రముఖులు ఈ ప్రైవేట్ జెట్ విమానంలో ఉన్నారు. ప్రమాదం తప్పడంతో వారంతా సురక్షితంగా బయటపడ్డారు. మరోవైపు కెప్టెన్ నసీబ్ బమల్, కెప్టెన్ ప్రతీక్ ఫెర్నాండెజ్ నిర్లక్ష్యం వల్ల ఈ సంఘటన జరిగినట్లు ఆ ఫుడ్ కంపెనీ అధికారి ఆరోపించారు. విమానం టైర్లలో తక్కువ గాలి పీడనం ఉన్నట్లు పైలట్లకు తెలిసినప్పటికీ పట్టించుకోలేదని విమర్శించారు. కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు, అధికారులు ఆ ప్రైవేట్ విమానం వద్దకు చేరుకున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఉన్నతాధికారుల వల్లే నా భర్త ఆత్మహత్య

ఐపీఎస్ అధికారి భార్య ఆరోపణలు

చండీగఢ్: హర్యానాలో సీనియర్ ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ రివాల్వర్‌తో కాల్చుకొని బలవన్మరణానికి పాల్పడిన ఘటన కలకలం సృష్టిస్తోంది. ఆయన సతీమణి సీఎంకు రాసిన లేఖలో సంచలన ఆరోపణలు చేశారు. 8 పేజీల్లో సూసైడ్ నోట్ లభించినా, ఫిర్యాదు చేసినా... ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని తెలిపారు. ఆయన సూసైడ్ నోట్‌లో ఉన్నతాధికారుల వేధింపులు, అవమానాల గురించి పేర్కొన్నప్పటికీ వాటిని చండీగఢ్ పోలీసులు విస్మరించారని ఆరోపించారు. 'హర్యానా పోలీస్ విభాగానికి చెందిన ఉన్నతాధికారులు, ఇతర అధికారులు ఈ కేసులో నిందితులుగా ఉండటం, వారు చండీగఢ్ పోలీసులను ప్రభావితం చేయడమే ఎలాంటి చర్యలు తీసుకోకపోవడానికి కారణం' అని ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. మంగళవారం చండీగఢ్‌లో తన నివాసంలో పూరన్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆయన మృతదేహాన్ని బేస్‌మెంట్‌లో కనుగొన్నారు. ఆయన భార్య అమ్నీత్ పి.కుమార్ ఐఏఎస్ అధికారి. ఆ సమయంలో ఆమె విదేశీ పర్యటనలో ఉన్నారు. సీఎంతో కలిసి అధికార పర్యటనలో భాగంగా జపాన్ వెళ్లారు. 2001 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన 52 ఏళ్ల పూరన్ కుమార్... ఇటీవల అధికారుల హక్కుల గురించి మాట్లాడారు. దీంతో ఆయనను ఇటీవలే పోలీస్ ట్రైనింగ్ కళాశాల ఐజీగా బదిలీ చేశారు.

జైషే మహిళా బ్రిగేడ్ ఆవిర్భావం?

అజార్ సరికొత్త కుట్రలు

న్యూఢిల్లీ: పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ జరిపిన 'ఆపరేషన్ సిందూర్'తో జైషే మహ్మద్ ఉగ్రముఠా కకావికలమైంది. ఊహించని దెబ్బ నుంచి కోలుకునేందుకు ప్రయత్నిస్తోన్న మసూద్ అజార్ ముఠా కొత్త పన్నాగాలు పన్నుతున్నట్లు తెలుస్తోంది. తమ నెట్‌వర్క్‌ను విస్తరించుకునేందుకు తొలిసారి ప్రత్యేకంగా జైషే మహిళా బ్రిగేడ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు నిఘా వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. 'జమాత్ ఉల్ మూమినాత్' పేరుతో ఓ ప్రత్యేక బ్రిగేడ్‌ను జైషే ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఇందుకోసం ఇప్పటికే బహవల్‌పూర్‌లోని జైషే కేంద్రంలో నియామకాలు ప్రారంభించినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. ఈ కొత్త యూనిట్‌కు మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ నేతృత్వం వహిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో బహవల్‌పూర్‌లోని జైషే ప్రధాన కేంద్రంపై భారత్ బాంబుల వర్షం కురిపించింది. ఆ దాడుల్లో జైషే కేంద్రం దారుణంగా ధ్వంసమవడమే కాకుండా మసూద్ అజార్ కుటుంబానికి చెందిన 10 మంది మృతి చెందారు. ఈ విషయాన్ని ఇటీవల జైషే కమాండర్ కూడా ధ్రువీకరించాడు. మృతుల్లో మసూద్ బావ, సాదియా భర్త యూసఫ్ అజార్ కూడా ఉన్నాడు. మహిళ బ్రిగేడ్‌లో జైషే కమాండర్ల భార్యలను సభ్యులుగా తీసుకుంటున్నట్లు సమాచారం. వీరితో పాటు బహవల్‌పూర్, కరాచీ, ముజఫరాబాద్, కోట్లీ, హరీపూర్ వంటి ప్రాంతాల్లో ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన మహిళలను నియమించుకోనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఐసిస్, బోకో హరామ్, హమాస్ వంటి ఉగ్ర ముఠాలు మహిళలను నియమించుకొని... వారిని ఆత్మాహుతి దాడులకు ఉపయోగించుకున్న ఘటనలు ఉన్నాయి. తాజాగా జైషే కూడా ఆ పంథానే అనుసరించేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఈ కొత్త మహిళా బ్రిగేడ్ భారత్‌లో తన నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. సోషల్ మీడియా, ఆన్‌లైన్ నెట్‌వర్క్‌తో జమ్మూకశ్మీర్, యూపీ వంటి ప్రాంతాల్లో మహిళలను ఈ బ్రిగేడ్‌లో చేరేలా ఆకర్షించే ప్రమాదం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. దీంతో భారత అధికారులు అప్రమత్తమైనట్లు సమాచారం.

ఏడేళ్ల అనుభవం ఉంటే జిల్లా జడ్జీలుగా అర్హులే: సుప్రీం

న్యూఢిల్లీ: బార్‌లో ఏడు సంవత్సరాల అనుభవం ఉండి, సర్వీస్‌లో ఉన్న న్యాయాధికారులను జిల్లా జడ్జీలుగా నియమించేందుకు అర్హులని ఐదుగురు జడ్జీల ధర్మాసనం తీర్పు ఇచ్చింది. బార్ కౌన్సిల్, జ్యుడీషియల్ సర్వీస్‌లో కలిపి ఏడు సంవత్సరాల అనుభవం ఉన్న న్యాయ అధికారులు కూడా అర్హులని తీర్పు వెల్లడించింది. మూడు నెలల్లోపు సంబంధిత హైకోర్టులతో సంప్రదించి రాష్ట్రాలు తమ సర్వీస్ నియమాలను పునరుద్ధరించాలని ధర్మాసనం ఆదేశించింది. సర్వీస్‌లో ఉన్న న్యాయ అధికారులను జిల్లా జడ్జీలుగా పరిగణించడానికి కనీస వయస్సు 35 సంవత్సరాలు. ఈ చర్య సీనియర్ న్యాయవ్యవస్థలోకి యువ, కొత్త ప్రతిభకు అవకాశం ఏర్పడుతుందని ధర్మాసనం తెలిపింది. న్యాయవ్యవస్థలో ప్రారంభ సమయంలో చేరే న్యాయాధికారుల సేవా పరిస్థితులు, వేతన నిర్మాణాలు, పదోన్నతి అవకాశాలకు సంబంధించిన ప్రశ్నలను సుప్రీంకోర్టు ఐదుగురు జడ్జీల రాజ్యాంగ ధర్మాసనానికి సూచించింది. ఈ పిటిషన్‌ను ఆల్ ఇండియా జడ్జిస్ అసోసియేషన్ దాఖలు చేసింది. గత కొన్నేళ్లుగా న్యాయవ్యవస్థ పరిశీలనలో ఉన్న ఈ అంశం, కింది స్థాయి న్యాయవ్యవస్థలోని అధికారుల్లో పురోగతిలో స్తబ్దత ... జీతం, పదోన్నతి అవకాశాల్లో అసమానతలపై ఆందోళనలను లేవనెత్తుతోంది.

మహిళా ఉద్యోగులకు నెలసరి సెలవు

బెంగళూరు: మహిళా ఉద్యోగుల విషయంలో కర్నాటక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నెలకు ఒక రోజు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని రాష్ట్ర కేబినెట్ సమావేశంలో నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగినులతో పాటు వస్త్రపరిశ్రమ, బహుళజాతి సంస్థలు, ఐటీ కంపెనీలు, ఇతర ప్రైవేటు పరిశ్రమల్లో పనిచేసే వారికి ఈ సెలవు వర్తించనుందని ప్రభుత్వం వెల్లడించింది. 'శ్రామిక మహిళల ఆరోగ్యం, శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నాం. నెలసరి ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు మహిళలకు మానసిక, శారీరక సౌకర్యం అందించాలన్నదే మా ఉద్దేశం. ఈ నిర్ణయం ఉద్యోగినులకు ఎంతగానో ఉపకరించనుంది. ఈ విధానాన్ని ఇతర రాష్ట్రాలు విజయవంతంగా అమలు చేస్తున్నాయి. అందుకే ఇక్కడా ఆ సెలవు ఇవ్వాలనుకున్నాం' అని కేబినెట్ సమావేశం అనంతరం న్యాయశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని మహిళా హక్కుల కార్యకర్త బృందా అడిగె స్వాగతించారు.

అఫ్గాన్ జెండాపై భారత్ తర్జనభర్జన

న్యూఢిల్లీ: తాలిబన్ ఆక్రమణలో ఉన్న అఫ్గానిస్థాన్ నుంచి విదేశాంగమంత్రి ఆమిర్ ఖాన్ ముత్తాఖీ తొలిసారి భారత్‌లో అడుగుపెట్టారు. వారం రోజులపాటు పలు భేటీల్లో పాల్గొననున్నారు. ఇక్కడే భారత్‌కు చిక్కొచ్చిపడింది. భారత్‌కు వచ్చిన అఫ్గాన్ మంత్రి భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, ఎన్ఎస్ఏ అజిత్ దోవల్‌తో చర్చలు జరపనున్నారు. దౌత్యపరమైన ప్రొటోకాల్ ప్రకారం మన త్రివర్ణ పతాకంతో పాటు సందర్శనకు వచ్చిన నేత దేశానికి చెందిన జెండాను వారి వెనక లేక టేబుల్‌పై ఉంచాలి. ఇక్కడే అధికారులు డైలమాలో పడ్డారు. ఆ ప్రభుత్వాన్ని, జెండాను భారత్ గుర్తించలేదు. దిల్లీలోని అఫ్గాన్ రాయబార కార్యాలయంపై తమ జెండా ఎగురవేయడానికి మన ప్రభుత్వం అనుమతించలేదు. ఇప్పటికీ ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ అఫ్గానిస్థాన్ జెండానే అక్కడ ఎగురుతోంది. ఇటీవల ముత్తాఖీ, భారత అధికారుల మధ్య కాబుల్‌లో సమావేశం జరిగింది. అప్పుడు వెనకవైపు తాలిబన్ జెండా ఉపయోగించారు. మరోసారి దుబాయ్‌లో విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్త్రీ, ముత్తాఖీ భేటీ అయ్యారు. అప్పుడు ఎవరి జెండా పెట్టకుండా చర్చలు జరిపారు. కానీ ఈసారి వేదిక భారత్ కావడంతో ఇది అధికారులకు దౌత్యపరమైన సవాల్‌గా మారింది. ఇప్పుడు అఫ్గాన్‌కు చెందిన పాత, కొత్త జెండాలలో దేనినైనా ఉపయోగిస్తారా?లేక అసలు జెండాలు లేకుండానే సమావేశాలు నిర్వహిస్తారా? అన్నది తెలియాల్సి ఉంది. ఇదిలా ఉంటే.. భారత్-అఫ్గానిస్థాన్ మధ్య సుదీర్ఘకాల స్నేహబంధం ఉంది. 2021లో తాలిబన్ల ఆక్రమణ తర్వాత కాబుల్‌లో భారత్ తన ఎంబసీని మూసివేసింది. వైద్య, మానవతాసహాయం, వాణిజ్యం కోసం ఏడాది తర్వాత ఒక చిన్నపాటి దౌత్యమిషన్‌ను తెరిచింది. అక్కడి ప్రభుత్వాన్ని గుర్తించకపోయినా... అఫ్గాన్‌లో అధికారంలో ఉన్నవారితో దౌత్య సంబంధాల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటోంది. అఫ్గాన్ గడ్డను ఎలాంటి ఉగ్రవాద కార్యకలాపాలకు వినియోగించుకుండా చూడాలని ఐరాస వేదికగా పిలుపునిచ్చింది. ఇటీవల జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని తాలిబన్ ప్రభుత్వం ఖండించింది.

పొత్తులకు అవకాశమే లేదు: మాయావతి

లక్నో: ఎన్నికల సందర్భంగా వివిధ పార్టీలు పొత్తులు కుదుర్చుకోవడంపై బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి కీలక వ్యాఖ్యలు చేశారు. 2027లో జరిగే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ ఎలాంటి పొత్తులు పెట్టుకోదని స్పష్టం చేశారు. లక్నోలో బీఎస్పీ సిద్ధాంతకర్త కాన్షీరామ్ వర్ధంతి సందర్భంగా జరిగిన సభలో మాయావతి మాట్లాడారు. ఉత్తరప్రదేశ్‌లో లేదా దేశంలోని ఇతర ప్రాంతాలలోని పార్టీలతో పొత్తు కుదుర్చుకుని, ఎన్నికల్లో పోటీ చేయడం వలన పార్టీకి ఎటువంటి ప్రయోజనం చేకూరదని ఆమె వ్యాఖ్యానించారు. 'మా పార్టీ ఓట్లు బదిలీ అవుతాయి. కానీ ఇతర పార్టీల ఓట్లు మాకు పడవు. ఇది మా ఓట్ల వాటాను తగ్గిస్తుంది. పొత్తులతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటికీ... అవి ఎక్కువ కాలం ఉండవు' అని మాయావతి పేర్కొన్నారు. గత ఎన్నికలను గుర్తుచేసుకుంటూ తాము గతంలో కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీతో పొత్తు పెట్టుకుని అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు... తమ పార్టీ 67 సీట్లను మాత్రమే గెలుచుకోగలిగిందన్నారు. అయితే 2007లో తాము ఒంటరిగా పోటీచేసి, మెజారిటీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగామన్నారు. సమాజ్‌వాదీ నేత ఆజం ఖాన్ బీఎస్పీలో చేరుతున్నారనే వార్తలను ప్రస్తావించిన మాయావతి... గత నెలలో ఇతర పార్టీల నాయకులు బీఎస్పీలో చేరుతున్నారని, వారు తనను దిల్లీ, లక్నోలో కలుసుకున్నారనే వార్తలు వచ్చాయని, అయితే తాను ఎవరినీ కలవలేదని స్పష్టం చేశారు. ఉత్తరప్రదేశ్‌లో తిరిగి తన బలాన్ని నిరూపించుకునేందుకు మాయావతి సిద్ధమయ్యారు. 2027లో జరిగే ఎన్నికలకు తన పునరాగమనాన్ని ఘనంగా చాటేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పార్టీ బూత్ కమిటీలు ఏర్పాటు చేశారు. దళిత, ముస్లిం, బ్రాహ్మణ వర్గాల్లో తనకున్న పాత ఇమేజ్‌ను తిరిగి పొందడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు పార్టీ వర్గాలంటున్నాయి.

విశాలాంధ్ర హైదరాబాద్

ఏటిసిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : కందుకూరు మండలంలోని పంజాగూడలోని ఏటిసిని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం పంజాగూడలో నూతనంగా నిర్మాణం చేయబడిన ఏటిసి బిల్డింగ్‌ను భవనంలోని గదులను, మిషనరీ ఏర్పాటు చేసే హాల్‌లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడున్న ఇంచార్జ్ ప్రిన్సిపల్ వి.లక్ష్మణ్‌ను వివరాలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థులకు ఏటిసి అందుబాటులో ఉండే విధంగా మిషనరీ, ఇతర పనులు పూర్తి చేసేటట్లు చూడాలని కలెక్టర్ ప్రిన్సిపల్‌కు సూచించారు. ఏటిసి బిల్డింగ్ పనులు 95 శాతం పూర్తయినా యని ఇంకా మిషనరీ రావాల్సి ఉందని ప్రిన్సిపల్ కలెక్టర్‌కు వివరించారు. జిల్లా కలెక్టర్ వెంట కందుకూర్ ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, ఎమ్మార్వో గోపాల్, ఏటిసి సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కందుకూర్ మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయంలో మండల/ జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుల నామినేషన్ కేంద్రాన్ని కలెక్టర్ సి.నారాయణరెడ్డి పరిశీలించి అక్కడ ఉన్న రిటర్నింగ్ అధికారులకు, సహాయ సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.

స్టామ్ వాటర్ డ్రైన్ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : నియోజకవర్గంలోని వినాయక్ నగర్ డివిజన్‌లో సంతోషి మాత దేవాలయం నుండి నాగదేవత దేవాలయం వరకు, దీన్ దయాల్ నగర్ మెయిన్ రోడ్డుపై నిర్మాణంలో ఉన్న 1000 మిల్లీమీటర్ల డైమీటర్ ఆర్.సిసి స్టామ్ వాటర్ డ్రైన్ పైప్‌లైన్ పనులు వేగంగా పురోగతిలో ఉన్నాయి. ఈ ప్రాజెక్టు రూ. 85 లక్షల వ్యయంతో చేపట్టబడుతున్నారు. నిర్మాణ పనుల నాణ్యత పట్ల శ్రద్ధ తీసుకోవాలని, లెవెల్ తేడాలు లేకుండా పనులు కొనసాగాలని కోరుతూ, స్థానికులు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని కలిశారు. వారి విజ్ఞప్తిని గమనించిన ఎమ్మెల్యే వెంటనే స్పందించి జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ శాఖ అధికారులతో మాట్లాడి, పనుల ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిహెచ్‌ఎంసి మల్కాజిగిరి సర్కిల్ డిప్యూటీ ఇంజినీర్ లౌక్యకి తగిన సూచనలు ఇస్తూ, నిర్మాణ నాణ్యత ప్రమాణాలు పాటించాలని, పనులు త్వరితగతిన, సమర్థంగా పూర్తి కావాలనే దృష్టితో సంబంధిత అధికారులను ఆదేశించారు. అదే విధంగా దీన్ దయాల్ కాలనీలో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలు, మట్టి కుప్పల తొలగింపు తదితర అంశాలను కూడా ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకెళ్లి, తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు బద్దం పరుశురాం రెడ్డి, జేఏసీ వెంకన్న, తులసి సురేష్, హేమంత్ పటేల్, సర్వేశ్ యాదవ్, బాలకృష్ణ, పేపర్ శ్రీను, చందు, సంపత్ యాదవ్, ఉమేష్, శ్రీకాంత్, వినీత్ పాల్గొన్నారు.

పెట్టుబడులపై పెరుగుతున్న అవగాహన

విశాలాంధ్ర - నిజామాబాద్ : తెలంగాణలో ప్రపంచ పెట్టుబడి వారోత్సవం (డబ్ల్యూఐడబ్ల్యూ) 2025 విజయవం తంగా సాగుతోంది. అక్టోబర్ 6 నుండి 12 వరకు ఈ ప్రచారం కార్యక్రమం జరగనుంది. ఇందులో భాగంగా నేషనల్ కమోడిటీ అండ్ డెరివేటివ్స్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌సీడీఈఎక్స్) తన ఇన్వెస్టర్ ప్రొటెక్షన్ ఫండ్ ట్రస్ట్ (ఐపీఎఫ్‌టి) కార్యక్రమాల కింద నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి, సిరికొండ, ఆర్మూర్ ప్రాంతాల్లో ఈ నెల 6న పెట్టుబడులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. మోసాలు, కుంభకోణాల బారిన పడకుండా సురక్షితంగా పెట్టుబడులు పెట్టడంపై సామాన్యులకు సైతం అవగాహన కల్పించింది. ధరల్లో హెచ్చుతగ్గుల్ని నిర్వహించేందుకు మార్కెట్ ఆధారిత సాధనాలను ఉపయోగించడం పై వివరించింది. తెలంగాణలోని నవపేటలో జరిగిన పెట్టుబడి అవగాహన కార్యక్రమంలో సుమారు 70 మంది మహిళా రైతులు పాల్గొనడం విశేషం. వారు కమోడిటీ డెరివేటివ్స్ ప్రాథమిక అంశాలు, ధర అన్వేషణ పద్ధతులు, అవకాశాలు, భవిష్యత్తు ఒప్పందాలు అలాగే ఇచ్చి పుచ్చుకోవడం ద్వారా జరిగే భౌతిక సెటిల్‌మెంట్ వ్యవస్థ గురించి తెలుసుకున్నారు. ఇక 'కృషి రథ్' పేరుతో నిర్వహిస్తున్న మొబైల్ అవగాహన కార్యక్రమం కూడా ముమ్మరం సాగుతోంది. నిజామాబాద్ జిల్లాలోని డిచ్‌పల్లి, సిరికొండ, ఆర్మూర్ ప్రాంతాల మీదుగా ప్రయాణించి, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పీఓలు), రైతులతో సహా 120 మందికి పైగా వ్యక్తులకు పెట్టుబడులపై అవగాహన కల్పించింది. ప్రపంచ పెట్టుబడి వారోత్సవం అనేది అంతర్జాతీయ సెక్యూరిటీస్ కమిషన్ల సంస్థ (ఐఓఎస్‌సీఓ) అధ్వర్యంలో నిర్వహించే గ్లోబల్ కార్యక్రమం. దీని లక్ష్యం పెట్టుబడిదారుల్లో అవగాహన, రక్షణను మెరుగుపరచడం. భారత్‌లో సెబీ (భారతీయ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు) డబ్ల్యూఐడబ్ల్యూ-2025కు జాతీయ సమన్వయకర్తగా వ్యవహరిస్తోంది. ఈ సంవత్సర థీమ్... టెక్నాలజీ డిజిటల్ ఫైనాన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మోసాలు, స్కామ్‌ల నివారణపై దృష్టి పెట్టింది. ఇది ఆర్థిక అక్షరాస్యత, పెట్టుబడిదారుల భద్రతపై పెరుగుతున్న అవగాహనను ప్రతిబింబిస్తుంది.

సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేకి వినతి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపన్ పల్లి విలేజ్ వాసులు పలు సమస్యలు, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీని వివేకానందనగర్‌లోని వారి కార్యాలయంలో కార్పొరేటర్ గంగాధర్ రెడ్డితో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనిపై ఆరెకపూడి గాంధీ సానుకూలంగా స్పందించారు. గోపన్‌పల్లి విలేజ్ వాసులు మాట్లాడుతూ కాలనీలో మౌలిక వసతులు కలిపించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం అని, అదేవిధంగా గోపన్‌పల్లి విలేజ్‌లో అంపూర్తిగా మిగిలిపోయిన రోడ్లను పూర్తి చేయాలని కోరారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ త్వరలోనే గోపన్‌పల్లి విలేజ్‌లో త్వరలోనే పర్యటిస్తానని, త్వరలోనే రోడ్డు పనులను ప్రారంభిస్తామని, కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్లను, త్వరితగతిన పరిష్కరిస్తామని, యూజీడీ పైప్‌లైన్‌లు ఏర్పాటు చేస్తామని, డ్రైనేజి వ్యవస్థను మెరుగు పరుస్తామని, కాలనీలో అన్ని రకాల మౌలిక వసతులు కలిపించామని, అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల పనులను అతి త్వరలో చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌతమ్ గౌడ్, దాత్రి నాథ్ గౌడ్, యాదగిరి గౌడ్, అనిల్, నర్సింహ, శ్రీరామ్ రెడ్డి, నర్సింగరావు, సత్యనారాయణ, జితేందర్, రాజేందర్ పాల్గొన్నారు.

నిండు ప్రాణానికి రెండు చుక్కలు

పోలియో రహిత సమాజమే మన ముందున్న లక్ష్యం

జిల్లాలోని 12 నుండి 15 వరకు పల్స్ పోలియో కార్యక్రమం

జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి

విశాలాంధ్ర - హైదరాబాద్ : నిండు ప్రాణానికి రెండు చుక్కలు అని పోలియో రహిత సమాజమే మన ముందున్న లక్ష్యమని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్ నుండి ఈ నెల 12 నుండి 15 వరకు నిర్వహించే పల్స్ పోలియో నిర్వహణ కార్యక్రమంపై జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పల్స్ పోలియో కార్యక్రమం భారతదేశంలో, పోలియో రహిత సమాజాన్ని నిర్మాణించడానికి 1995లో ప్రారంభించడం జరిగిందని ఆమె అన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ భారతదేశాన్ని పోలియో రహిత దేశంగా గుర్తించడం జరిగిందని ఈ సందర్భంగా అన్నారు. అయినప్పటికీ పొరుగు దేశాలైన పాకిస్తాన్, అఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్‌లలో ఇంకా పోలియో కేసులు నమోదు అవుతున్నందున భారతదేశంలో పోలియో కేసులు నమోదు కాకుండా పోలియో కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నదని అన్నారు. అందులో భాగంగా మన హైదరాబాద్ జిల్లాలో ఈనెల 12 నుండి 15 వరకు పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, అందులో భాగంగా 12న హైదరాబాద్ లోని 2843 కేంద్రాల్లో పోలియో 0-5 పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని తెలిపారు. 0-5 సంవత్సరాల పిల్లలకు పోలియో వ్యాధి నివారణకు రెండు పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని పేర్కొన్నారు. జిల్లాలో ఈ కార్యక్రమంలో 5,17,238 మంది పిల్లలకు పోలియో చుక్కలు అందించనున్నామని స్పష్టం చేశారు. నగరంలో 9,36,016 ఇండ్లల్లో ఉన్న 0-5 సంవత్సరాల గల పిల్లలకు కవర్ చేయడం జరుగుతుందని అన్నారు. పోలియో కేంద్రాలు ఉదయం 7.00 గంటల నుండి సాయంత్రం 6.00 గంటల వరకు తెరచి ఉంటాయని అలాగే తేదీ 13, 14, 15 లలో 11,200 మంది వైద్య సిబ్బంది ఇంటింటికి వచ్చి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్ లో 164 హై రిస్క్ ఏరియాలను గుర్తించడం జరిగిందని తెలిపారు. పల్స్ పోలియో కార్యక్రమంలో ప్రభుత్వ శాఖల సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, ఆశా వర్కర్లు, అంగన్వాడి టీచర్లు, వాలంటీర్స్, పారా మెడికల్, నర్సింగ్ విద్యార్థులు పాల్గొనడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని పిల్లల తల్లిదండ్రులు ఉపయోగించుకుని తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటి, డిఎంఒ డాక్టర్ రాములు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ హబ్‌గా మహబూబ్‌నగర్ అభివృద్ధి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహబూబ్ నగర్ నగరంలోని రాజేంద్రనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సాయికిరణ్ ఎండోక్రైయిన్, గ్యాస్ట్రో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ను గౌరవ మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహబూబ్ నగర్ మెడికల్ హబ్‌గా అభివృద్ధి కావడం సంతోషంగా ఉందన్నారు. మహబూబ్‌నగర్‌లో అన్ని రకాల అధునాతన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఇప్పుడు మహబూబ్ నగర్ ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని ఆయన చెప్పారు. వైద్యుడు అంటే దేవుడితో సమానమని, ఎలాంటి పరిస్థితుల్లో రోగి ఆసుపత్రికి వచ్చినా నాణ్యమైన వైద్యం అందించి బ్రతికించే ప్రయత్నమే చేస్తారని అన్నారు. డాక్టర్ అంటే ప్రాణాలు నిలబెట్టే వారిగా చూడాలి తప్ప శత్రువుగా చూడరాదని, ఎవరైనా డాక్టర్ల పైన దాడి చేసి వారి మనోధైర్యాన్ని దెబ్బతీస్తే సహించేది లేదని, అట్టి వారిపైన చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మహబూబ్‌నగర్‌ను మున్సిపల్ కార్పొరేషన్‌గా అభివృద్ధి చేసుకున్నామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అత్యధిక సంఖ్యలో నిధులు తెచ్చి మహబూబ్‌నగర్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. మహబూబ్‌నగర్‌లో అటు జడ్చర్లలో మరో బైపాస్ ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించామని ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ యాజమాన్యం ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించారు. మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, డిసిసి ఉపాధ్యక్షులు సత్తూరు చంద్రకుమార్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు అజ్మత్ అలి, ఐఎంఎ అధ్యక్షులు జె రాంమోహన్, సామ్యేల్, ప్రవీణ్ కుమార్, చైతన్య రెడ్డి, బి.సాయికిరణ్, డా.జె.తేజస్విని పాల్గొన్నారు.

పోరాట యోధుడు, ధైర్యశాలి చేగువేరా

విశాలాంధ్ర - హైదరాబాద్ : గెరిల్లా పోరాట యోధుడు, ధైర్యశాలి, మూర్తీభవించిన మానవత్వం వంటి విలువలు కలిగిన మహనీయుడు ఎర్నెస్టో చేగువేరా అని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర అన్నారు. చేగువేరా 58వ వర్ధంతిని ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లోని సత్య నారాయణరెడ్డి భవన్‌లో చేగువేరా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి ఆర్. బాలకృష్ణ, నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ క్యూబాలో జన్మించిన చేగువేరా కేవలం తన దేశానికే కాక అనేక దేశాలలో పర్యటించి పెట్టుబడిదారీ వ్యవస్థపై అలుపెరుగని పోరాటాలు నిర్వహించిన గొప్ప యోధుడు అని వారు ఉద్ఘాటించారు. వంద పండ్లను ఒక్కడే దాచుకోవడం క్యాపిటలిజం ఉన్నదాంట్లో అందరూ పంచుకోవడం కమ్యూనిజం అని చెప్పిన చేగువేరా మాటలు ప్రజా ఆకాంక్షలకు అద్దం పడుతుందని వారు అన్నారు. చేగువేరా అమెరికన్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహించాడని వారు అన్నారు. విప్లవం అనేది పక్వానికొచ్చినప్పుడు కిందపడే ఆపిల్ పండుకాదని మనమే దాన్ని పోరాడి సాధించుకోవాలి అన్న చేగువేరా మాటలు నేటి ప్రపంచానికి పోరాట పటిమను చూపుతుందని వారు ఉద్ఘాటించారు. విప్లవం అనేది పక్వానికొచ్చినప్పుడు కిందపడే ఆపిల్ పండుకాదని, మనమే దాన్ని పోరాడి సాధించుకోవాలన్నారు. రైతాంగం, కార్మిక వర్గం అనే రెండు పట్టాల మీద విప్లవమనే రైలు ప్రయాణం చేయాల్సి ఉంటుందని, తడిమట్టి ముద్ద, మార్క్సిజం మౌళిక భావనలు రెండూ ఒక్కటే అన్నారు. కుమ్మరి కళాకారుని చేతుల్లో ఆ చక్రం మీద మనిషి అవసరం కోసం వివిధ ఆకృతుల్ని రూపొందించిన ట్లుగా ఆయా సమాజాల భౌతిక పరిస్థితుల్ని బట్టి మార్క్సిజాన్ని అన్వయించుకోవ చ్చన్నారు. ఎన్ని రాజకీయ అభిప్రాయాలున్నా, సైద్ధాంతిక విభేదాలున్నా అంతిమంగా ప్రజల విముక్తే విప్లవకారుడి ధ్యేయం కావాలన్నారు. చేగువేరా తాను జీవితాంతం ఏ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా పోరాడాడో అదే అతన్ని ఫ్యాషన్ ఐకాన్ గా మార్చేసి, ఆయన పేరు మీద నేటికీ వందల కోట్ల వ్యాపారం చేయడం విషాదకరమన్నారు. ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు కాంపల్లి కళ్యాణ్,అరుణ్, సుశాంత్, ప్రతిమ, రమ్య, శాంతి, ఫాతిమా, ప్రదీప్,నదీమ్, ప్రభాకర్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఈవీఎంల తొలి రాండమైజేషన్ పూర్తి

విశాలాంధ్ర - హైదరాబాద్ : జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో వినియోగించబోయే ఏలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ల (ఈవిఎంలు) కు సంబంధించిన మొదటి రాండమైజేషన్ ప్రక్రియ గురువారం చాదర ఘాట్ విక్టోరియా ప్లే గ్రౌండ్ (విపిజి) కేంద్రంలో చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఆధ్వర్యంలో నోడల్ అధికారులు అపూర్వ చౌహాన్, హేమంత్ కేశవ్ పాటిల్, రిటర్నింగ్ అధికారి పి.సాయిరాంలు పర్యవేక్షించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కంప్యూటరైజ్డ్ విధానంలో ఈ రాండమైజేషన్ పారదర్శకంగా నిర్వహించబడింది. ఈ ప్రక్రియలో ఫస్ట్ లెవెల్ చెకప్ (ఎఫ్‌ఎల్‌సీ) ఒకే అయిన యూనిట్లను రాబోయే ఉప ఎన్నికలో వినియోగం కోసం నిష్పక్షపాతంగా కేటాయించడం జరిగింది. జిల్లా ఎన్నికల అధికారి కర్ణన్ మాట్లాడుతూ, జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక ప్రక్రియలో ప్రతి దశ ఎన్నికల కేంద్ర సంఘం మార్గదర్శకాలు ప్రకారం పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరుగుతుందని తెలిపారు.

హైదరాబాద్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు రాజధాని : కేటీఆర్

విశాలాంధ్ర-హైదరాబాద్ : హైదరాబాద్ నగరం గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు రాజధా నిగా మారిందని బీఆరెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రస్తుతం రెండవ స్థానంలో ఉన్న హైదరాబాద్ నగరం త్వరలోనే మొదటి స్థానానికి వస్తుందని ఆశాభా వం వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాదులోని నోవాటెల్‌లో జరిగిన జీసీసీ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని కేటీఆర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నగరం బెంగళూరును దాటి మరింత ప్రగతి సాధించాలని కోరుకున్నారు. నేడు హైదరాబాద్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు రాజధానిగా మారడం వెనక గత ప్రభుత్వం కృషి ఎంతగానో ఉందన్నారు. పది సంవత్సరాల పాటు అన్ని రంగాల్లో, అన్ని కోణాల్లో హైదరాబాద్ నగరాన్ని సమగ్రంగా తీర్చిదిద్దడం వల్లనే ఇది సాధ్యమవుతుందని వివరించారు. అధికారంలో ఉన్నప్పుడు వ్యక్తుల ఆధారంగా కాకుండా శాశ్వతంగా మంచి ఫలితాలు వచ్చేలా వ్యవస్థలను, చట్టాలను, సంస్కరణలను తీసుకురావడం వలన తెలంగాణ వ్యాపార, వాణిజ్య, పెట్టుబడి రంగాల్లో అగ్రస్థానంలో నిలిచిందన్నారు. బ్యాంకింగ్, ఫార్మా, హెల్త్ కేర్, ఐటీ ఇవన్నీ రంగాల్లో భారీగా పెట్టుబడులను, అంతర్జాతీయ కంపెనీలను ఆకర్షించగలిగిందని తెలిపారు. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు రావాలని ఎల్లప్పుడూ కోరుకుంటామని తెలిపిన కేటీఆర్, ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. నేడు హైదరాబాద్‌లో జరిగిన ఇన్స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ సమ్మిట్‌కి తనను ఆహ్వానించినందుకు నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు.

పూణే ఈ-స్టాక్ బ్రోకింగ్ లిమిటెడ్‌కు సెబీ గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్: ప్రముఖ కార్పొరేట్ బ్రోకింగ్ హౌస్ అయిన పూణే ఈ-స్టాక్ బ్రోకింగ్ లిమిటెడ్ (పీఈఎస్‌బీ), కంపెనీ మర్చంట్ బ్యాంకర్‌గా వ్యవహరించడానికి సెబీ ఆమోదం పొందిందని ప్రకటించింది. ఈ కంపెనీ ఇప్పుడు సెబీ రిజిస్టర్డ్ మర్చంట్ బ్యాంకర్, ఇది రిజిస్ట్రేషన్ నంబర్ ఐఎన్ఎం 000013323 కలిగి ఉంది. ఇటీవల, కంపెనీ బోర్డు వివిధ ప్రమోటర్, నాన్ ప్రమోటర్ గ్రూప్ సంస్థలకు ప్రిఫరెన్షియల్ ప్రాతిపదికన 20,00,000 కన్వర్టిబుల్ వారెంట్ల కేటాయింపును ఆమోదించినట్లు ప్రకటించింది. ఆర్థిక సంవత్సరం 25 (కాన్స్)తో ముగిసిన పూర్తి సంవత్సరానికి, కంపెనీ మొత్తం ఆదాయం రూ.7664.38 లక్షలుగా నివేదించింది. కంపెనీ పీబీటీ 49.17% పెరిగి రూ.1671.10 లక్షలు (ఎఫ్‌వై24) నుండి రూ.2492.92 లక్షలకు (ఎఫ్‌వై24) చేరుకుంది. ప్యాట్ 51.58% పెరిగి రూ.1265.60 లక్షలు (ఎఫ్‌వై24) నుండి రూ.1918.50 లక్షలకు (ఎఫ్‌వై25) చేరుకుంది. 2007లో స్థాపించబడిన పూణే ఈ-స్టాక్ బ్రోకింగ్ లిమిటెడ్ అనేది క్లయింట్లు వారి పెట్టుబడి లక్ష్యాలను సాధించడంలో సహాయపడటానికి అంకితమైన కార్పొరేట్ బ్రోకింగ్ హౌస్. అత్యాధునిక సాంకేతికత, సమగ్ర మార్కెట్ పరిశోధన, అత్యాధునిక విశ్లేషణాత్మక వ్యవస్థలను ఉపయోగించి, కంపెనీ తన క్లయింట్ల విభిన్న అవసరాలు, ఆకాంక్షలను తీర్చడానికి తగిన పరిష్కారాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డికు అభినందన

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఇటీవలే చండీగఢ్‌లో జరిగిన సిపిఐ 25వ జాతీయ మహాసభలలో తెలంగాణ రాష్ట్రం నుండి సిపిఐ జాతీయ కార్యదర్శిగా ఎన్నికైన పల్లా వెంకట్ రెడ్డికు పుష్పగుచ్ఛం అందించి సిపిఐ వికారాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయలక్ష్మి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలో సిపిఐ బలోపేతానికి కృషి చేయాలనీ, ప్రజా సమస్యలపై విస్తృతంగా పోరాటాలు నిర్వహించాలని అలాగే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బలమున్న చోట్ల సిపిఐ అభ్యర్థులు పోటీచేసి సత్తా చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్ర చారీ, తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్. అంజయ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఏటీసీ అందుబాటులో ఉండే విధంగా చూడాలి

విశాలాంధ్ర - రంగారెడ్డి జిల్లా ప్రతినిధి : కందుకూరు మండలంలోని పంజాగూడలోని ఏ.టీ.సీ ని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం పంజాగూడలో నూతనంగా నిర్మాణం చేయబడిన ఏ.టీ.సీ బిల్డింగ్‌ను భవనంలోని గదులను, మిషనరీ ఏర్పాటు చేసే హాల్‌లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడున్న ఇంచార్జ్ ప్రిన్సిపల్ వి.లక్ష్మణ్‌ను వివరాలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థులకు ఏ.టీ.సీ అందుబాటులో ఉండే విధంగా మిషనరీ, ఇతర పనులు పూర్తి చేసేటట్లు చూడాలని కలెక్టర్ ప్రిన్సిపల్ కు సూచించారు. ఏ.టీ.సీ బిల్డింగ్ పనులు 95 శాతం పూర్తయినా యని ఇంకా మిషనరీ రావాల్సి ఉందని ప్రిన్సిపల్ కలెక్టర్‌కు వివరించారు. జిల్లా కలెక్టర్ వెంట కందుకూర్ ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, ఎమ్మార్వో గోపాల్, ఏ.టి.సి సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కందుకూర్ మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయంలో మండల, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుల నామినేషన్ కేంద్రాన్ని కలెక్టర్ సి.నారాయణరెడ్డి పరిశీలించి అక్కడ ఉన్న రిటర్నింగ్ అధికారులకు, సహాయ సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.

ఎన్నికలపై హైకోర్టు స్టే విధించడానికి బిజెపినే కారణం :ఎమ్మెల్సీ నెల్లికంటి

విశాలాంధ్ర - హైదరాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన నోటిఫికేషన్‌పై స్టే రావడం, బిసిలకు పెంచిన రిజర్వేషన్ అమలు జరపకుండా జాప్యం కావడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రధాన కారణం అని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం విమర్శించారు. బీసీలకు బిజెపి ద్రోహం చేసిందని అన్నారు. ఇప్పటికే శాసనసభలో బిసి రిజర్వేషన్ 42 శాతానికి పెంచే బిల్లులనే అన్ని పార్టీల మద్దతుతో ఏకగ్రీవంగా ఆమోదించిందని, అలాగే రిజర్వేషన్ పెంచుతూ జారీ చేసిన ఆర్డినెన్స్ కూడా ఉందన్నారు. కేంద్రం వద్ద శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించిన బిసిలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు నెలలు తరబడి పెండింగ్ ఉన్నందునే నేడు స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు స్టే విధించడానికి కారణమైందని సత్యం విమర్శించారు. దీనికి పూర్తి బాధ్యత కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానిదే అని అన్నారు.

గ్రూప్-1 విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రూప్-1 విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు చాలా కార్యక్రమాలు చేయనున్నామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. 15 తారీఖున డివిజన్ బెంచ్ తీర్పుపై విద్యార్థుల భవిష్యత్ ఆధారపడి ఉందని, అందుకే 15 వరకు కార్యక్రమాలు తీసుకుందామని నిర్ణయించామని పేర్కొన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గ్రూప్-1 నియామకాల్లో అవకతవకలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బుధవారం విద్యార్థి అమరవీరులకు నివాళులు అర్పించి వారి సాక్షిగా పోరాటం ప్రారంభించామని చెప్పారు. ప్రభుత్వం చేసిన తప్పులను ఎత్తిచూపేందుకే రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశామని, గ్రూప్-1 విషయంలో నోటిఫికేషన్ నాటి నుంచి రిజల్ట్స్ వరకు అడుగడుగునా తప్పులు జరిగాయన్నారు. ఆ తప్పులను నేను మండలిలో కూడా ఎత్తి చూపానని, అయినప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఈ తప్పులను ఎండగట్టాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఇప్పుడు ఇచ్చినటువంటి ఉద్యోగాలు రద్దు చేసి... మళ్లీ రీ ఎగ్జామ్ పెడుతుందని భావిస్తున్నానని పేర్కొన్నారు. రౌండ్ టేబుల్ సమావేశం చేసిన తీర్మానాన్ని గవర్నర్‌కు, సీఎంకు పంపిద్దామని అన్నారు. తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని, విద్యార్థులకు జాగృతి భరోసా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కురపాటి శ్రీనివాస్, డా.నాగేంద్రం, ప్రత్యూష, అశోక్, మంజుల, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ నాయకుల హౌస్ అరెస్ట్

విశాలాంధ్ర - కొత్తూరు: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పెంచిన ఆర్టీసీ బస్సు చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ గురువారం బీఆర్ఎస్ అదిష్టానం పిలుపుమేరకు చలో బస్ భవన్ కార్యక్రమానికి సిద్ధమౌతున్న నందిగామ మండల బిఆర్ఎస్ నాయకులను ముందస్తుగా ఎస్‌హెచ్‌వో ప్రసాద్ సమక్షంలో హౌస్ అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నోముల పద్మా రెడ్డి, నందిగామ మాజీ సర్పంచ్ జిల్లెల్ల వెంకట్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ రాంబాబు, ప్రశాంత్ రెడ్డి తదితరులను పోలీసులు అరెస్ట్ చేశారు.

జలమండలికి ఉత్తమ హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ అవార్డు

విశాలాంధ్ర - హైదరాబాద్ : జలమండలికి అవార్డుల పరంపర కొనసాగుతోంది. ఇప్పటికే వరల్డ్ వాటర్ అవార్డు, ఉత్తమ ఎస్టీపీ, ఉత్తమ యాజమాన్య అవార్డ్ లాంటి వాటిని గెలుచుకోగా తాజాగా మరొక అవార్డును తన ఖాతాలో వేసుకుంది. తమ సంస్థలో ఆర్‌టిఐ కేసుల్లో ఉత్తమంగా పనిచేసిన గానూ తెలంగాణ సమాచార కమిషన్ ఉత్తమ హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ పురస్కారాన్ని ప్రకటించింది. ఈ అవార్డును జలమండలి ఎండీ అశోక్ రెడ్డి రవీంద్ర భారతిలో గౌరవ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా గురువారం అందుకున్నారు. ఈ అవార్డు ప్రదాన కార్యక్రమంలో పర్సనల్ డైరెక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, ఉన్నతాధికారులు, ఉగ్యోగులు పాల్గొన్నారు.

క్రాంప్టన్‌కు రూ.52 కోట్ల సోలార్ రూఫ్‌టాప్ ఆర్డర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : క్రాంప్టన్ గ్రీవ్స్ కన్స్యూమర్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (క్రాంప్టన్), భారతదేశంలోని ప్రముఖ కన్స్యూమర్ ఎలక్ట్రికల్ కంపెనీల్లో ఒకటి, ఈ రోజు తెలంగాణ మార్కెట్లో తన మొదటి ప్రధాన సోలార్ రూఫ్‌టాప్ ఆర్డర్‌ను రూ.52 కోట్లతో సాధించడం ద్వారా ఒక ముఖ్యమైన మైలురాయిని చేరుకుంది. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ ప్రామీత్ ఘోష్, పునరుత్పాదక ఇంధన రంగం, ముఖ్యంగా సోలార్ రూఫ్‌టాప్‌లు, భారతదేశ ఇంధన విభాగానికి ప్రగతిశీలమైన పరివర్తన అవకాశాలను అందిస్తున్నాయన్నారు. ఈ విభాగంలో క్రాంప్టన్ ప్రవేశం, సుస్థిరత పట్ల మా నిబద్ధతను ప్రతిబింబిస్తుందని తెలిపారు. మా దృష్టి కేవలం అధిక-పనితీరు, వినూత్న ఉత్పత్తులను అందించడం మాత్రమే కాదు, భారతదేశ గ్రీన్ ఎనర్జీ పరివర్తనలో ప్రధాన భాగస్వామిగా మారడం ద్వారా క్రాంప్టన్‌కు వేగవంతమైన వృద్ధిని సాధించడం, అలాగే దేశానికి స్థిరమైన భవిష్యత్తును నిర్మించడం జరుగుతుందన్నారు. మా మొదటి ప్రధాన సోలార్ రూఫ్‌టాప్ ఆర్డర్‌ను పొందడం, ఈ విభాగానికి ఒక కీలకమైన మైలురాయిగా నిలుస్తుందని చెప్పారు.

ఘనంగా కాన్షీరాం వర్ధంతి

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : ఎవరి జనాభా ఎంతో వారి వాటా అంత అని బహుజన్ సమాజ్ పార్టీ తుర్కయాంజాల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పట్నం రమేష్ కురుమ అన్నారు. బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు మాన్యవర్ కాన్షీరాం 19 వ వర్ధంతి సందర్భంగా తుర్కయాంజాల్ మున్సిపాలిటీ కార్యదర్శి అడ్వకేట్ నెమలి సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధ్యక్షుడు పట్నం రమేష్ కురుమ హాజరై దాదా సాహెబ్ కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడు తూ ఎవరి జనాభా ఎంతో వారి వాటా అంత అనే నినాదంతో ప్రజల వద్దకు వెళ్ళి ఓటు చైతన్యం చేసి బహుజనుల ను అధికారం వైపు తిప్పిన మహనీయుడు, ఓటు మాది అధికారం మీదా అని ప్రశ్నించి భారత రాజకీయాలలో సమూల మార్పుకు కారణమైన బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు దాదా సాహెబ్ కాన్షీరాం అని అన్నారు. మాజీ అధ్యక్షులు వద్దిగళ్ళ బాబు, ప్రధాన కార్యదర్శి మల్లెల రఘు, సీనియర్ నాయకులు యడవల్లి శ్యామ్, భూతం రమణ, జంతుక సైదులు, కోహెడ సెక్టార్ అధ్యక్షులు శీలం అంగద్ కుమార్, ఏర్పుల రవి కుమార్ పాల్గొన్నారు.

స్నేహాభావంతో స్థానిక ఎన్నికలు జరుపుకోవాలి

విశాలాంధ్ర -కొత్తూరు: త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను గ్రామాలలో ప్రజలు, నాయకులందరూ స్నేహాభావంతో శాంతియుత వాతా వరణంలో జరుపుకోవాలని సిఐ జి నర్సయ్య అన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికలు గ్రామాలను అభివృద్ధి చేసుకోవడానికి నిర్వహిస్తారు. దీంతో ఎన్నికల సమయంలో అభ్యర్థులు ఎన్ని కల నిబంధనల ప్రకారం పోటీల్లో కొనసాగాలని, ఎన్నికల తర్వాత అంద రూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడకుండ కలిసిమెలిసి అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండ, శాంతిభద్ర లతకు విఘాతం కలిగించకుండ పోలీసులకు సహకరించాలని ఆయన సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఎవరైనా సరే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ప్రభుత్వ లోపభూయిష్ట విధానాలతోనే హైకోర్ట్ స్టే విధించింది

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల విషయంలో జీ.వో.నెం.9 ను శాస్త్రీయ పద్ధతిలో కాకుండా తమకు ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరించడం వల్లే హైకోర్టు స్టే ఇవ్వాల్సి వచ్చిందని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ లా పెంపు విషయంలో ప్రభుత్వ విధానం శాస్త్రీయంగా, సరిగ్గా లేదని బిఆర్ఎస్ పార్టీ తరఫున అసెంబ్లీ వేదికగా నాయకులు, వారు ఎన్నోసార్లు ప్రభుత్వానికి హితవు పలికామని, రేవంత్ సర్కార్ మాత్రం మా సలహాలను, సూచనలను పెడచెవిన పెట్టడం వల్లే నేడు హైకోర్టులో స్టే విధించాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం కామారెడ్డి వేదికగా బిసి డిక్లరేషన్ అమలు విషయంలో అఖిలపక్షం సభ్యుల సూచనలను, సలహాలను పెడచెవిన పెట్టకుండా శాస్త్రీయబద్ధంగా రూపొందించాలి. లేకపోతే వెనుకబడిన వర్గాల తరఫున పోరాడేందుకు బిఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది.

కేసరి పద్మ సంజీవరెడ్డితోనే గ్రామాభివృద్ధి

విశాలాంధ్ర - మొయినాబాద్ : గ్రామస్తులపై మమకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసే సత్తా కేవలం కేసరి పద్మ సంజీవరెడ్డితోనే సాధ్యమని గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో మండలంలో వైస్ ఎంపీపీగా ఎన్నో సేవలు అందించి పలు గ్రామాభివృద్ధి కార్యక్రమంలో సేవలందించి తన గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో దూసుకెళ్లేందుకు తను ఎంతగానో ఉత్సాహం కనబరుస్తూ గ్రామాభివృద్ధిలో గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయడం కేవలం పద్మ సంజీవరెడ్డి సాధ్యమని పలువురు గ్రామస్తులు అభిప్రాయాలు వ్యక్త పరుస్తున్నారు. ఏ అధికారం నీ ఆశించకుండా గ్రామాభివృద్ధిలో తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ ఎన్నో అభివృద్ధి పథకాలను గ్రామస్తులకు అందిస్తూ గ్రామస్తులను తన కుటుంబ సభ్యులుగా భావిస్తూ వారి కష్టనష్టాలలో పద్మ సంజీవరెడ్డి పాత్ర వర్ణనాతీతం. రానున్న స్థానిక ఎన్నికల్లో పద్మ సంజీవరెడ్డికి అవకాశం కల్పిస్తే గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్తారని గ్రామస్తులు పూర్తి నమ్మకాన్ని వ్యక్తపరుస్తున్నారు.

ఎన్నికల బృందాలు అప్రమత్తంగా ఉండాలి

జిహెచ్ఎంసి కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వి కర్ణన్

విశాలాంధ్ర - హైదరాబాద్ : జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక ముగిసే వరకూ ఎన్నికల బృందాలు అప్రమత్తంగా ఉండాలని జిహెచ్ఎంసి కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి ఆర్ వి కర్ణన్ చెప్పారు. గురువారం జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్‌లో ఎక్స్‌పెన్‌డిచర్ మానిటరింగ్ టీం, ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి, విఎస్‌టి, వివిటి, ఎంసిసి టీంలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నిక్కచ్చిగా విధులు నిర్వర్తించాలని జిహెచ్ఎంసి కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వి కర్ణన్ ఆదేశించారు. శిక్షణ కార్యక్రమంలో హేమంత్ కేశవ్ పాటిల్, ఎంసిసి నోడల్ అధికారి నరసింహ రెడ్డి, చీఫ్ హార్టికల్చర్ ఆఫీసర్ సునంద తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్ వ్యాప్తంగా కాలనీల్లో ప్రత్యేక సానిటేషన్ డ్రైవ్ పూర్తి

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో లెగసీ వ్యస్ట్ తొలగింపు కోసం ప్రత్యేక శుభ్రత డ్రైవ్ కొనసాగుతోంది.శానిటేషన్ డ్రైవ్ చేపట్టి నేటితో నాలుగు రోజులు పూర్తిగా ఈ డ్రైవ్‌లో భాగంగా ఇప్పటి వరకూ 150 డివిజన్ ల పరిధిలోని 979 కాలనీలలో 1524.5 మెట్రిక్ టన్నుల మున్సిపల్ వ్యర్థాలు, 515.5 మెట్రిక్ టన్నుల భవన నిర్మాణ వ్యర్థాలు తొలగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 335 వాహనాలు మున్సిపల్ వ్యర్థాల తొలగించేందుకు, 67 వాహనాలు భవన నిర్మాణ వ్యర్థాల తొలగింపుకు ఉపయోగించడం జరిగింది. ప్రజల సహకారం తో ఈ ప్రత్యేక కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. జీహెచ్ఎంసీ పరిధిలోని ఎల్.బి.నగర్, చార్మినార్, ఖైరతాబాద్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, సికింద్రాబాద్ జోన్లలో వ్యర్థాల సేకరణ సజావుగా జరుగుతోంది. అన్ని సర్కిల్స్‌లో వాహనాల మోహరింపు, వ్యర్థాల సేకరణ, డంపింగ్ ప్రాసెస్‌పై అధికారులు పర్యవేక్షణ నిర్వహిస్తున్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వి కర్ణన్ మాట్లాడుతూ, నగరంలోని పాత వ్యర్థాల తొలగింపుతో పాటు శుభ్ర మైన, ఆరోగ్యవంతమైన హైదరాబాద్ నిర్మాణంకు జీహెచ్ఎంసీ యంత్రాంగం, సిబ్బంది కృషి చేస్తుందన్నారు. డ్రైవ్ కు ప్రజలు కూడా తమ వంతు సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గోవుల అక్రమ రవాణాను నిరోధించాలి

విశాలాంధ్ర - బషీర్ బాగ్ : గోవధను పూర్తిగా నిషేదించి గోవులను పరిరక్షించాలని వైదిక్ గ్లోబల్ ఫౌండేషన్ అధ్యక్షులు నరేందర్ కుమార్ చతుర్వేది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అక్రమ రవాణాను నిరోదించడంతో పాటు రహదారులపై చెక్ పోస్టులను ఏర్పాటు చేసి గోవులను వధించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రశాంత్ దాస్ స్వామీజీతో కలిసి నరేందర్ కుమార్ చతుర్వేది మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో 'రామ గోశాలలను' స్థాపించాలని సూచించారు. తెలంగాణలోని 17 లోకసభ నియోజకవర్గాలకు అనుగుణంగా 17 గో పార్లమెంట్ సభ్యులు (గో ఎంపీలు) నియమించబడ్డారని, ప్రతి గో ఎంపీ తన పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల కోసం గో ఎమ్మెల్యేలను నియమిస్తారని, ప్రతి గో ఎమ్మెల్యే తమ పరిధిలో ఒక 'రామ గోశాలను' స్థాపించాలని సూచించారు. ఈ విధంగా గ్రామ పంచాయతీ స్థాయిల్లో నియామకాలు కొనసాగేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. తద్వారా 'గోమాత రాష్ట్ర మాత' సందేశం ప్రతి పౌరుడికి చేరుతుందన్నారు. గోవును జాతీయ ప్రాణిగా వెంటనే ప్రకటించాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మహంత్ యోగి దాస్ జీ హైదరాబాద్, చెంగల సూర్యప్రకాష్ రాజ్ మల్కాజ్ గిరి, ఎ.లక్ష్మణ్ రెడ్డి వరంగల్, జ్యోతి వైష్ణవిదేవి సికింద్రాబాద్ గో ఎంపీలుగా నియమించబడ్డారని వారు పేర్కొన్నారు.

బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

విశాలాంధ్ర - కొత్తూరు: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన బస్సు చార్జీలకు నిరసనగా గురువారం బిఆర్ఎస్ పార్టీ అదిష్టానం పిలుపుమేరకు చేపట్టిన చలో బస్ భవన్ కార్యక్రమానికి వెళ్లకుండ సీఐ నర్సయ్య ఆధ్వర్యంలో పోలీసులు మండలంలోని ఆ పార్టీ ముఖ్య నాయకు లను ముందస్తుగానే అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భం గా పలువురు నాయకులు మాట్లాడుతూ అరెస్టులతో అడిగే గొంతులను నొక్కాలని ప్రయత్నించడం సిగ్గుచేటని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన బస్సు చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమ, అరాచకాలపై నిలదీస్తామని హెచ్చరించారు. అరెస్టు ఐన వారిలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మెండె కృష్ణ యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మెన్ డోలి రవీందర్, కౌన్సిలర్లు కోస్గి శ్రీనివాస్, సోమ్లు నాయక్, మాదారం నర్సింలు గౌడ్, సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, దేవేందర్ యాదవ్, యాదగిరి, కృష్ణయ్య, వి శ్రీనివాస్ ముదిరాజ్, శ్రీరాంలు, గోపాల్ నాయక్, నర్సింహా రెడ్డి, గోపాల్ గౌడ్, జె శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు.

స్థానిక ఎన్నికలను నిలుపుదల చేస్తూ హై కోర్టు స్టే పై

సీఎం నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలి

విశాలాంధ్ర - బషీర్ బాగ్ : బీసీల రిజర్వేషన్ జీఓ 9 స్థానిక ఎన్నికలను నిలుపుదల చేస్తూ హై కోర్టు స్టే ఇవ్వటానికి నైతిక బాధ్యత వహించి సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే తమ పదవికి రాజీనామా చేసి బీసీ సమాజానికి కాంగ్రెస్ పార్టీ మొత్తం బహిరంగం గాను క్షమాపణలు చెప్పాలని దళిత బహుజన పార్టీ అధ్యక్షులు, జాతీయ ప్రజా స్వామికి లౌకిక కూటమి చైర్మన్ వడ్లమూరి కృష్ణ స్వరూప్ డిమాండ్ చేశారు. గురువారం పార్టీ కేంద్ర కార్యాల యంలో ఎన్డిఎస్ఎఫ్ నేతలతో కలిసి మాట్లా డారు. 42 శాతం బీసీ రిజర్వేష న్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 9కు రాజ్యాంగ బద్దత లేదని కోర్టు ఇచ్చిన స్టే ద్వారా తేలిపోయిందన్నారు. బీసీల ఓట్లుతో స్థానిక ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధిపొందుతామని మాత్రమే ఆడహుడిగా జీవో తెచ్చి ఎన్నికల ను తీసుకొచ్చారని కృష్ణ స్వరూప్ ఆరోపణలు చేసారు. పార్లమెంట్‌లో బిల్లు పెట్టి 9వ షెడ్యూల్‌లో బీసీ రిజర్వేషన్‌ల చట్టంను చేర్పితేనే బీసీలకు రక్షణ ఉంటుందన్నారు. రేపు జరుప తలపెట్టిన బీసీల రాష్ట్ర బంద్‌కు మద్దతిస్తున్నా మని తెలిపారు. ఎస్.అశోక్, పి.వెంకటర రాజేశ్వరరావు, ఎమ్.వీరన్న నాయుడు, జె.ఎస్.రావు, గోత్రాల శ్రీనివాస్, మద్దెల రాయప్ప, పి.సుచంద్ర పాల్గొన్నారు.

మద్యం బకాయిలు వెంటనే చెల్లించాలి

విశాలాంధ్ర - జూబిలీహిల్స్ : తెలంగాణలో మద్యం సరఫరాదారులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని ఇంటర్నేషనల్ స్పిరిట్స్ అండ్ వైన్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐఎస్‌డబ్ల్యుఏఐ), బ్రూవర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ), కన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఆల్కహాలిక్ బెవరేజ్ కంపెనీస్ (సీఐఏబీసీ) ప్రతినిధులు డిమాండ్ చేశారు. రూ.3,151 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే రిటైల్ లైసెన్స్ వేలం ద్వారా వచ్చే ఆదాయాన్ని ఈ బకాయిలు చెల్లించేందుకు వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. గత ఏడాది నుంచి రూ.2,300 కోట్లకు పైగా బకాయిలు చెల్లించకపోవ దంతో అనేక కంపెనీలు ఆర్థిక ఒత్తిడిలో ఉన్నాయన్నారు. ఈ ప్రభావం సరఫరా వ్యవస్థపై పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. బకాయిలు చెల్లించకపోతే మద్యం సరఫరా కొనసాగించడం కష్టమవుతుందన్నారు. ఇది రాష్ట్ర ఆదాయాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. ఈ నెల చివర్లో జరగనున్న రిటైల్ లైసెన్స్ పునరుద్ధ రణ టెండర్ ప్రక్రియ ద్వారా రాష్ట్రానికి సుమారు రూ.3,000 కోట్లకు పైగా ఆదా యం లభించనుందన్నారు. ఆ మొత్తాన్ని బకాయిలు తీర్చేందుకు వినియోగించాలని కోరారు. తెలంగాణ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీఎస్బీసీఎల్) చెల్లింపుల్లో ఆలస్యం చేస్తుందన్నారు. ప్రస్తుతం బకాయిల మొత్తం రూ.3,151 కోట్లు దాటిందన్నారు. అందులో రూ.2,300 కోట్లకు పైగా ఏడాది నుంచి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఉన్న అడ్వాన్స్ ఎక్సైజ్ డ్యూటీని 30 నుంచి ఒక్క శాతానికి తగ్గించాలని కోరారు. ఇది తాత్కాలిక చర్యగా పరిశ్రమకు వర్కింగ్ క్యాపిటల్ లభ్యతను మెరుగుపరచడంలో సహాయపడుతుందని వివరించారు.

అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: ఇజ్జత్ నగర్ కాలనీ అంగన్వాడి కేంద్రంలో గురువారం గర్భిణీలకు పోషక ఆహారం అందించడం జరిగింది. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడి కేంద్రంలో గుడ్డు పాలు అన్నం పోషక పదార్థాలు అందించారు. కంటిన్యూగా ఇప్పటినుండి డెలివరీ అయిన ఆరు నెలల వరకు అందిస్తారు. నారాయణమ్మ టీచర్ ఆధ్వర్యంలో వెల్ఫేరు టి.లక్ష్మి. కోమలి మేడం జరిగింది. ఈ కార్యక్రమంలో బస్తీ నుండి అంగన్వాడి కేంద్రానికి గర్భిణీలు పిల్లలు పాల్గొన్నారు. ఈరోజు నుంచి ప్రతి రోజు మూడు సంవత్సరాల వరకు పోషక పదార్థాలు అందిస్తామని అన్నారు.

ఘనంగా చేగువేరా వర్ధంతి

విశాలాంధ్ర - కాప్రా : గెరిల్లా పోరాట యోధుడు, ధైర్యశాలి, మూర్తీభవించిన మానవత్వం వంటి విలువలు కలిగిన మహనీయుడు ఎర్నెస్టో చేగువేరా అని ఏఐఎస్ఎఫ్ ఉప్పల్ నియోజకవర్గం అధ్యక్ష కార్యదర్శులు ఆజీమ్ పాషా, మహేష్ చేగువేరా 58వ వర్ధంతిని ఏఐఎస్ఎఫ్ - ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్‌లో చేగువేరా చిత్రపటా నికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ఉప్పల్ నియోజకవర్గం అధ్యక్ష కార్యదర్శులు ఆజీమ్ పాషా, మహేష్ ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్య ప్రసాద్, మాట్లాడుతూ క్యూబాలో జన్మించిన చేగువేరా కేవలం తన దేశానికే కాక అనేక దేశాలలో పర్యటించి పెట్టుబడిదారీ వ్యవస్థపై అలుపెరు గని పోరాటాలు నిర్వహించిన గొప్ప యోధుడు అని వారు ఉద్ఘాటిం చారు. వంద పండ్లను ఒక్కడే దాచుకోవడం క్యాపిటలిజం- ఉన్న దాంట్లో అందరూ పంచుకోవడం కమ్యూనిజం అని చెప్పిన చేగువేరా మాటలు ప్రజా ఆకాంక్షలకు అద్దం పడుతుందన్నారు. చేగువేరా అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అనేక పోరా టాలు నిర్వహించాడని వారు అన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు టి.రాజేష్ బాబు, రాజ్ కుమార్, ఏఐఎస్ఎఫ్ ఉప్పల్ నియోజకవర్గం ఆఫీస్ బేరర్స్ షేబాజ్ పాషా, సాయికుమార్, నమీర్ పాల్గొన్నారు.

మిడ్-మార్కెట్ రేట్ ట్రావెల్ కార్డు ప్రారంభం

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : ప్రపంచ వ్యాప్తంగా డబ్బును సులభంగా నిర్వహించే ఉత్తమ మార్గాన్ని సృష్టిస్తున్న గ్లోబల్ టెక్నాలజీ కంపెనీ వైజ్, భారత్‌లో అత్యంత కోరుకోబడిన వైజ్ ట్రావెల్ కార్డ్ కోసం వెయిట్‌లిస్ట్‌ను ప్రారంభించింది. భారతీయ ప్రయాణికులు విదేశీ ప్రయాణాలపై సుమారు 17 బిలియన్ అమెరికన్ డాలర్లు ఖర్చు చేస్తున్నారని భారత రిజర్వ్ బ్యాంక్ డేటా చెబుతోంది. కానీ సంప్రదాయ ఫారెక్స్ కార్డులు, బ్యాంక్ కార్డుల వలన దాగి ఉన్న ఛార్జీలు పెరిగిన మారకపు రేట్ల వల్ల వారు వేల రూపాయలను కోల్పోతున్నారు. ఉదాహ రణకు, లండన్‌లో చదువుకుంటున్న కూతురిని చూడటానికి వెళ్తున్న కుటుంబం, సంప్రదాయ బ్యాంక్ కార్డులు ఉపయోగిస్తే రూ.5 లక్షల ప్రయాణంపై రూ.17,500 కంటే ఎక్కువ ఫీజుల రూపంలో కోల్పో తారు. వైజ్ కార్డ్ ఈ సమస్యను పరిష్కరిస్తుంది. ఇది భారతీయ ప్రయాణికులకు మిడ్-మార్కెట్ ఎక్స్ఛేంజ్ రేట్ అంటే గూగుల్‌లో మీరు చూసే అదే రేట్ అందిస్తుంది. వైజ్ దక్షిణ ఆసియా విస్తరణ లీడ్, టనియా భారద్వాజ్ మాట్లాడుతూ, భారతదేశం వేగంగా ఎదుగుతున్న ట్రావెల్ మార్కెట్, కానీ మనం విదేశాల్లో ఉపయోగించే ఉత్పత్తులు నేటి తెలివైన భారతీయ ప్రయాణికుల అవసరాలకు సరిపోవడం లేదన్నారు.

మున్సిపల్ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - మొయినాబాద్ : ఈ నెల 14, 15 న మున్సిపల్ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అల్లి దేవేందర్ అన్నారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ మొయినాబాద్ మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అల్లి దేవేందర్ హాజరై మాట్లాడుతూ ఈనెల 14,15 తేదీలలో రంగారెడ్డి జిల్లాలోని తుర్కయంజాల్‌లో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సిఐటియు 5వ రాష్ట్ర మహాసభ జరుగుతుందన్నారు. ఈ మహాసభలను కార్మికులందరూ హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ యూనియన్ రాష్ట్ర మహాసభలలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై రెండు రోజులు చర్చించి కార్మికుల సమస్యలపై భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షులు రత్నం, అధ్యక్షులు సుధాకర్, ప్రధాన కార్యదర్శి సురేష్, ఉపాధ్యక్షులు ప్రవీణ్, నరసింహ, అంజయ్య, రామచందర్, శివ, లక్ష్మమ్మ, సాలమ్మ, లతా తదితరులు పాల్గొన్నారు.

గవాయ్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర, బషీర్ బాగ్ : హిందుత్వ ముసుగులో కొన్ని శక్తులు దేశంలో ఆరాచకత్వాన్ని సృష్టిస్తున్నాయని విశ్రాంత ఐపీఎస్ అధికారి, సివిల్ రైట్స్ ఇంటియే టీవ్ ఇంటర్నేషనల్ (సీఆర్ఐఐ) జాతీయ అధ్యక్షుడు డా.కె.బాబురావు అన్నారు. వీటిని ప్రజలంతా ఏకమై తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయిపై మతోన్మాది రాకేష్ కిషోర్ చేసిన దాడి ప్రజాస్వామ్యానికి, న్యాయ వ్యవస్థకు, రాజ్యాంగానికి గొడ్డలిపెట్టని పేర్కొన్నారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ లో గవాయిపై జరిగిన దాడిని నిరసిస్తూ వివిధ సంఘాలతో సీఆర్ ఐఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. దళితుడు కాబట్టే గవాయిపై దాడికి పాల్పడ్డాడని అతనిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళితులు, మైనారిటీలు, క్రిస్టియన్లపై దాడులు విపరీతంగా పెరిగి పోతున్నాయని అన్నారు. దేశం ఐక్యంగా ఉండాలని, మత సామరస్యాన్ని కాపాడుకోవాలని, రాజ్యాంగాన్ని పరిరక్షించు కోవాలని పిలుపునిచ్చారు. నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మన్ వీజేఆర్ నారగోని, సమూహిక సెక్యూలర్ రైటర్స్ ఫోరం ప్రతినిది మేర్సీ మార్గరేట్, కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ చైర్మన్ సుధీర్ మాట్లాడుతూ జస్టిస్ గవాయిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశంలో నేషనల్ క్రిస్టియ కౌన్సిల్ అధ్యక్షుడు బిషప్ సంజయ్ ఆనంద్, ప్రధాన కార్యదర్శి బిషప్ ఎల్లయ్య, ఎం.సూర్య నారాయణ పాల్గొన్నారు.

దూలపల్లి రోడ్డు సమస్యను పరిష్కరించండి

విశాలాంధ్ర-దుండిగల్: మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఊర చెరువు సుందరీకరణ, దూల్లపల్లి ఎన్ టి ఆర్ విగ్రహం నుండి ఇండస్ట్రియల్ ఏరియా వరకు సరైన రోడ్డు మార్గం లేక గుంతలు ఉండటం వల్ల ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్న విషయాన్నీ తెలుసుకొని బిటి రోడ్డు మంజూరు చేయాలని గురువారం తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో డిప్యూటీ ఇఎన్ సి నర్సింహా రెడ్డి, ఎస్ ఇ వెంకటేశ్వర్‌ను కలిసి దూలపల్లి ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న సమస్యలను వారికి విన్నవించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ ఇఎన్ సి నర్సింహా రెడ్డి, ఎస్ ఇ వెంకటేశ్వర్లు సానుకూలంగా స్పందించి తక్షణ మంజూరుకు సహకరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో కొంపల్లి మాజీ సర్పంచ్ జీమ్మి దేవేందర్ పాల్గొన్నారు.

దళిత హక్కుల పోరాట సమితి నూతన కార్యవర్గం ఏర్పాటు

విశాలాంధ్ర - మేడిపల్లి: దళిత హక్కుల పోరాట సమితి మేడ్చల్ జిల్లా కౌన్సిల్ సమావేశం గురువారం ఉదయం 10 గంటలకు బాలాజీ నగర్ దళిత భవనంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా దళిత హక్కుల పోరాట సమితినూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. దీనికి రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్ అధ్యక్షతన నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది మేడ్చల్ జిల్లా అధ్యక్షులు చిలుముల్లా మల్లేశం, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దండు రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఉపాధ్యక్షులు బాబు, నర్సింగ్‌రావు, సహాయ కార్యదర్శి సదానందం, అశోక్, కోశాధికారి స్వామి దాసులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, జి లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు, ఇస్తారి, ఎల్లయ్య, నరసింహ, మల్లికా, శ్రీశైలం, శేషు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కొమిరిశెట్టి సాయిబాబా హౌస్ అరెస్ట్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: కాంగ్రెస్ సర్కార్ పెంచిన ఆర్టీసీ బస్సు ఛార్జీలకు నిరసనగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో "చలో బస్ భవన్" పిలుపు ను అడ్డుకునేందుకు గురువారం శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాని ఖాజాగూడలోని ఆయన నివాసంలో అరెస్ట్ చేసిన పోలీస్ డిపార్ట్మెంట్. అరెస్ట్ చేసి రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌కు తరలించడం జరిగింది. అరెస్టు గురించి తెలిసిన వెంటనే గచ్చిబౌలి డివిజన్ ముఖ్య నాయకులందరూ రాయదుర్గం పోలీస్ స్టేషన్ చేరుకొని సాయిబాబాని విడుదల చేసే వరకు పోలీస్ స్టేషన్ వద్దే ఉండి సాయిబాబాని తీసుకెళ్లడం జరిగింది. చెన్నం రాజు, దారుగుపల్లి నరేష్, రాజు ముదిరాజ్, ఆకుల యాదగిరి, రమేష్ గౌడ్, అనిల్ సింగ్, శామ్లెట్ శ్రీనివాస్, అజయ్ గౌడ్ తదితరులు పోలీస్ స్టేషన్ చేరుకోవడం జరిగింది.

ఘనంగా చేగువేరా వర్ధంతి

విశాలాంధ్ర - మేడిపల్లి: ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం ఉదయం ఉప్పల్ డిపో వద్ద చేగువేరా 58వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండి.అన్వర్ మాట్లాడుతూ.... చేగువేరా పేరు వింటేనే నరనరాల్లో చైతన్యం ప్రవహిస్తుంది. యుద్ధానికి సిద్ధమై వెన్నెముక నిటారుగా చేగువేరా అని హృదయం కలవరిస్తుంది. దేహం నలుమూలల అణువణువు నిప్పు రవ్వై వెలిగిపోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు అరవింద్, సాయి, నర్సింహా, సంతోష్, ప్రవీణ్, అవినాష్, శివ, సందీప్, హరి తదితరులు పాల్గొన్నారు.

'నకిలీ మద్యం'పై సీబీఐ దర్యాప్తు

హెూంమంత్రి అమిత్‌షాకు మిథున్‌రెడ్డి లేఖ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో నకిలీ మద్యం తయారీ వ్యవహారంపై కేంద్రం జోక్యం చేసుకొని సీబీఐతో దర్యాప్తు చేయించాలని వైసీపీ రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి హెూంమంత్రి అమిత్‌షాను కోరారు. ఈ మేరకు అమిత్‌షాకు గురువారం లేఖ రాశారు. నకిలీ మద్యం రాకెట్ వ్యవస్థీకృత అంతర్రాష్ట్ర నేరంగా మారిందని, స్థానిక శాంతిభద్రతల సమస్యగా పరిగణించలేమని ఆయన పేర్కొన్నారు. మిథనాల్ వంటి విషపూరిత రసాయనాలతో తయారు చేసిన నకిలీ మద్యం మానవ ప్రాణాలకు ముప్పు కలిగిస్తోందని లేఖలో హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్‌తోపాటు పొరుగు రాష్ట్రాలలో విషప్రయోగం, మరణాల సంఘటనలు అనేకం నమోదయ్యాయని, పేద వినియోగదారులే అధిక బాధితులని వివరించారు. ప్రఖ్యాత బ్రాండ్ల లేబుళ్ల తో విక్రయించే నకిలీ బాటిళ్ల ద్వారా నకిలీ మద్యం విక్రయించారని తెలిపారు. ఇటీవలి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆపరేషన్లలో తన నియోజకవర్గంలోని అన్నమయ్య జిల్లా ములకలచెరువులో అక్రమ మద్యం తయారీ యూనిట్లు బయటపడ్డాయని మిథున్‌రెడ్డి తెలిపారు. నకిలీ మద్యం సీసాలు, ప్యాకేజింగ్ సామాగ్రి పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్నారన్నారు. ప్రాథమిక దర్యాప్తులో జిల్లాలు, రాష్ట్ర సరిహద్దుల్లో విస్తరించి ఉన్న వ్యవస్థీకృత నెట్‌వర్క్‌తో సంబంధాలు ఉన్నాయని తేలిందన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, రాష్ట్ర పోలీసులు, ఎక్సైజ్, సీబీఐసీ, ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రమేయంతో సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని ఎంపీ కేంద్ర హెూం మంత్రిత్వ శాఖను కోరారు.

యుద్ధాలతో అమెరికా లబ్ధి

మళ్లీ మోదీ వస్తే రాజ్యాంగం కనుమరుగు: నారాయణ

విశాలాంధ్ర - తిరుపతి: ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగం కనుమరుగవుతుందని, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని సీపీఐ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె నారాయణ హెచ్చరించారు. తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండల కేంద్రంలో సీపీఐ జిల్లా సమితి ఐదు రోజుల రాజకీయ శిక్షణ తరగతుల్లో నాల్గవ రోజు గురువారం నారాయణ మాట్లాడారు. దేశ, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలను నారాయణ వివరించారు. ప్రపంచ దేశాల మధ్య యుద్ధ వాతావరణం సృష్టించి... తద్వారా లబ్ధి పొందాలని అమెరికా ప్రయత్నం చేస్తోందని నారాయణ విమర్శించారు. ఆయుధాలు విక్రయించుకోవడానికి అమెరికా యుద్ధాలు ప్రోత్సహిస్తోందన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైఖరిని ప్రపంచ దేశాలు ఖండించాలన్నారు. టారిఫ్‌ల పేరుతో ట్రంప్ బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ట్రంప్‌పై అమెరికాలో తీవ్ర వ్యతిరేకత వస్తోందన్నారు. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ వంటి దేశాలలో నిరుద్యోగం, అవినీతి పెరిగిపోవడంతో నిరాశకు గురైన యువత రోడ్లపైకి వచ్చిందన్నారు. దేశంలోని సహజ వనరులను వినియోగించుకోవడంలో మోదీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. హిందుత్వాన్ని రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారన్నారు. మోదీ హయాంలో దేశంలో ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టు రాలేదన్నారు. బీజేపీయేతర ప్రభుత్వాలకు కేంద్రం నిధులు కేటాయించడం లేదన్నారు. స్వతంత్ర సంస్థలను గుప్పిట్లో పెట్టుకుని రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నారన్నారు. రాజకీయ పార్టీలను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని, ఎదురు తిరిగితే జైల్లో పెడుతున్నారని పేర్కొన్నారు. పోర్టులన్నీ అదానీకి అప్పగించి కోట్ల రూపాయల గంజాయి సరఫరాకు మార్గం సుగమం చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలోనూ తిరుగుబాటు మొదలైందని, లద్దాఖ్ ఘటనలే ఇందుకు నిదర్శనమని, దీని ప్రభావం అనేక రాష్ట్రాలపైనా పడుతుందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో పార్టీని గ్రామీణస్థాయి నుండి బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ కార్యక్రమం, బలమైన పార్టీ నిర్మాణం అవశ్యకత అనే అంశంపై జేవీఎస్ మూర్తి, భారతదేశ చరిత్ర సంస్కృతి, వక్రీకరణ అనే అంశంపై కొప్పర్తి వెంకట రమణమూర్తి బోధించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు పాల్గొనగా శిక్షణ తరగతులకు ప్రిన్సిపాల్‌గా పి.మురళి, కార్యదర్శిగా చిన్నిరాజ్ వ్యవహరించారు.

'శ్రమ్ శక్తి' పాలసీ వెనక్కి

తక్షణమే ఐఎల్‌సీ నిర్వహించాలి: ఏఐటీయూసీ డిమాండ్

న్యూఢిల్లీ: శ్రమ్ శక్తి నీతి 2025 పేరిట బీజేపీ సర్కారు ఏకపక్షంగా తీసుకొచ్చిన ముసాయిదా విధానాన్ని రద్దు చేయాలని గురువారం ఒక ప్రకటనలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ డిమాండ్ చేశారు. త్రైపాక్షిక విధానాన్ని ఉల్లంఘించే ఈ ముసాయిదా విధానం అప్రజాస్వామికమన్నారు. ఇలాంటి వాటిని తీసుకొచ్చి కార్మికులను, కార్మిక సంఘాలను ప్రభుత్వం ఇబ్బంది పెడుతోంది, మోసం చేస్తోందని దుయ్యబట్టారు. తక్షణమే ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై ప్రజాభిప్రాయానికి ముందు కేంద్ర కార్మిక సంఘాలతో చర్చలు జరపాలని సూచించారు. చాలా కాలంగా ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ (ఐఎల్‌సీ) సమావేశం కాలేదని గుర్తుచేశారు. సంక్షేమ పథకాలతో సామాజిక భద్రతకు హామీ లభించదని పేర్కొన్నారు. అసంఘటిత రంగ కార్మికులు సహా దినసరి కూలీలు, గిగ్ వర్కర్లు, ఒప్పంద కార్మికులు, వ్యవసాయ కార్మికులు, ఇంటి పనివారు తదితరులకు కనీస వేతనాలు, సామాజిక భద్రతకు హామీ ఉండేలా చట్టాలు తేవాలన్నారు. అలా కాకుండా ఎలాంటి విధానం తీసుకొచ్చినా ఏఐటీయూసీ వ్యతిరేకి స్తుందని వెల్లడించారు. శ్రమ్ శక్తి నీతి పాలసీని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా ఐఎల్‌సీ పెండింగ్ ఉందని, కార్మిక సంఘాలతో చర్చలకు ముందుకు రావాలని అమర్‌జీత్ కౌర్ పిలుపునిచ్చారు.

చంద్రబాబుకు ప్రైవేటుపై మోజు

వైద్య విద్య పేదలకు దూరం: జగన్ విమర్శ

విశాలాంధ్ర-నర్సీపట్నం రూరల్: ప్రతి పేదవాడికి సూపర్ స్పెషాలిటీ వైద్యంతో పాటు ఉచిత విద్య అందించాలనే లక్ష్యంతో నిర్మాణం చేపడుతున్న మెడికల్ కాలేజీలపై కూటమి ప్రభుత్వం ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతోందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అధ్వర్యంలో అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెం మండలంలో భీమబోయినపాలెం గ్రామం వద్ద నిర్మిస్తున్న మెడికల్ కళాశాలను జగన్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత ప్రజలకు ఆధునిక వైద్య సేవలు అందక ప్రాణాల కోల్పోతున్నారని, అత్యవసర పరిస్థితి వస్తే సుమారు మూడు గంటలు ప్రయాణం చేసి విశాఖపట్నానికి వెళ్లవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. ప్రతి పేదవాడికి వైద్య సేవలతో పాటు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో 650 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులు చేపడుతుంటే... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రైవేటుపరం చేయడమే కాకుండా పేదవాడికి విద్య, వైద్యం దూరం చేస్తున్నదని , ఆధునిక దేవాలయాలను ఎలా ప్రైవేట్‌పరం చేస్తారని ప్రశ్నించారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రిలో పేదవాడికి ఉచిత వైద్యం అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలు గత ప్రభుత్వంలో ప్రారంభించగా... ఏడు కాలేజీలు పూర్తయ్యాయని, ఉత్తరాంధ్రలో నాలుగు కాలేజీలకుగాను పాడేరు, విజయనగరం కళాశాలలు పూర్తయ్యాయన్నారు, ఇవి కాక మరో ఐదు కళాశాలలు ఐటీడీఏ పరిధిలో నిర్మాణంలో ఉన్నాయన్నారు. 2023-24లో విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, నంద్యాల, మచిలీపట్నం మెడికల్ కళాశాలల్లో 800 సీట్లు అందుబాటులోకి వచ్చాయన్నారు, 50 సీట్లతో పాడేరు, పులివెందుల క్లాసులు ప్రారంభమైనట్లు తెలిపారు. మిగిలిన కాలేజీల నిర్మాణానికి రూ.ఐదువేల కోట్లు ఖర్చు చేయలేరా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వానికి అమరావతిపై ఉన్న మోజు ప్రభుత్వ మెడికల్ కాలేజీలపై లేదని విమర్శించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి నర్సీపట్నం నుంచి శ్రీకారం చుడుతున్నామని తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ కార్మికులకు అండగా ఉంటాం

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: నర్సీపట్నం పర్యటనలో భాగంగా విశాఖపట్నం రోడ్డు మార్గంలో వెళుతున్న మాజీ సీఎం, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉక్కు పరిరక్షణ పోరాట సమితి నేతలు గురువారం ఉదయం కలిశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడతామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన టీడీపీ కూటమి... ఆ తర్వాత తమను మోసం చేస్తోందని ఆరోపించారు. ప్లాంట్‌ను ఎలాగైనా కాపాడాలని జగన్‌కు విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్ కార్మికుల విజ్ఞప్తికి జగన్ సానుకూలంగా స్పందించారు. తాము అధికారంలో ఉన్నా... విపక్షంలో ఉన్నా... ఎప్పుడూ తమ వైఖరి ఒక్కటేనని, అది విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడమేనని ఆయన స్పష్టం చేశారు. వైసీపీ స్టీల్‌ప్లాంట్ కార్మికులకు తోడుగా ఉంటుందని, ప్లాంట్ ప్రైవేటీకరణ కాకూడదన్నదే తమ లక్ష్యమని తేల్చిచెప్పారు. అందుకోసం కృషి చేస్తామని జగన్ హామీ ఇచ్చారు. కాగా, విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులు ప్రధానంగా మూడు డిమాండ్లు ప్రభుత్వం ముందు ఉంచుతున్నారు. స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని మార్చుకునేలా ఒత్తిడి తీసుకురావాలనీ, స్టీల్‌ప్లాంట్‌కు ప్రత్యేకంగా గనులు కేటాయించాలనీ, సెయిల్‌లో విలీనం చేయాలనీ, సంస్థలో తొలగించిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్న డిమాండ్లతో కార్మికులు ఆందోళన చేపట్టారు.

పోడు భూములకు పట్టాలివ్వండి: కోటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): తరతరాలుగా ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి పోడు భూములను సాగు చేసుకుంటూ వచ్చే ఫలసాయతో జీవనం సాగిస్తున్న గిరిజన, బడుగు, బలహీన వర్గాలకు పట్టాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక దాసరి భవన్‌లోని సంఘ రాష్ట్ర కార్యాలయంలో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఉప్పె నరసింహారావు అధ్యక్షతన పోడు భూముల సాగుదార్ల సమావేశం గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన కోటేశ్వరరావు మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికీ అడవులలోనే జీవిస్తూ ఆటవీ ఉత్పత్తులపై ఆధారపడి ఆటుపోటులను తట్టుకుని జీవిస్తున్న ఆదివాసీలు, గిరిజనులకు ఆ భూములపై హక్కు కల్పించడానికి తరాలు గడుస్తున్నా పాలకులు పట్టించుకోకపోవడం అన్యాయమని అన్నారు. పేదలకు న్యాయం చేయకపోగా ఈ భూములను కార్పొరేట్లకు కట్టబెట్టే చర్యలకు ప్రభుత్వాలు పూనుకోవడం దుర్మార్గమని అన్నారు. ఇప్పటికైనా పట్టాలు ఇవ్వకుంటే పోరుబాట పడతారని హెచ్చరించారు. సీపీఐ మైలవరం నియోజకవర్గ కార్యదర్శి బుడ్డి రమేష్, గిరిజన సమాఖ్య జిల్లా నాయకులు భూక్యా దేశ్యానాయక్ , అజ్మీర బాలాజీ, బాణావతు శివ, ఇస్లావతు లక్ష్మీ, తుపాకుల రాయప్ప, సవుటూరి జ్యోతి, చిగురుపల్లి తిరుపతిరావు, ముగ్గురాళ్ల నాగేశ్వరరావు, చీకటి సమాదానం, చెవల కోటమ్మ, పెద్ద సంఖ్యలో లంబాడీ, యానాది, ఎరుకల, ఎస్సీ,బీసీ వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

'ఓంక్యాప్'తో లక్ష ఉద్యోగాలే లక్ష్యం

మంత్రి లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఓం క్యాప్ ద్వారా రాబోయే ఐదేళ్లలో లక్ష బ్లూకాలర్ ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యమని మంత్రి నారా లోకేశ్ అన్నారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు కార్యాచరణ రూపొందించి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని ఉండవల్లి నివాసంలో కార్పొరేషన్ అధికారులతో సమీక్షలో సూచించారు. నర్సింగ్, వెల్డర్స్, ట్రక్కర్స్, బిల్డింగ్ వర్కర్లకు యూరప్‌తోపాటు జర్మనీ, ఇటలీ దేశాల్లో మంచి డిమాండ్ ఉందన్నారు. నర్సింగ్, ఐటీఐ, పాలిటెక్నిక్ చదివిన వారికి ఆయా భాషల్లో శిక్షణ ఇచ్చి, విదేశాల్లో ఉద్యోగాలు లభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. నర్సింగ్ ఉద్యోగాలకు కేరళ నమూనాను అధ్యయనం చేయాలని అన్నారు. ఓంక్యాప్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 2,774 మంది నర్సింగ్ అభ్యర్థులు విదేశీ భాషల్లో శిక్షణ పొందుతున్నారని లోకేశ్‌కు అధికారులు తెలిపారు. నైపుణ్యం పోర్టల్‌పై మంత్రి సమీక్షించారు. ఇందులో 23 విభాగాల డాటా బేస్‌ను ఇంటిగ్రేట్ చేసినట్లు చెప్పారు. వచ్చేనెలలో పోర్టల్ ప్రారంభమవుతుందని, ఉద్యోగాల సంపూర్ణ సమాచారం అందుబాటులో ఉండాలని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర మానవవనరుల శాఖ కార్యదర్శి కోన శశిధర్, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో గణేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్ అనురాధ పదవీ విరమణ

ఇంచార్జిగా శశిధర్ నియామకం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) చైర్‌పర్సన్ ఏఆర్ అనురాధ పదవీ కాలం పూర్తయింది. 24 అక్టోబరు 2024న ఆమె బాధ్యతలు స్వీకరించారు. రిటైర్డ్ ఐపీఎస్ అయిన ఆమె గురువారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా అనురాధ సేవలను ఏపీపీఎస్సీ సభ్యులు, అధికారులు కొనియాడారు. అనురాధ తన పదవీ కాలంలో 2,53,519 మందికి ప్రత్యక్ష నియామక పరీక్షలు నిర్వహించారు. 64,609 మంది ప్రభుత్వ ఉద్యోగులకు డిపార్ట్‌మెంటల్ పరీక్షల్ని ఏర్పాటు చేశారు. 59,43 మందికి కంప్యూటర్ ప్రావీణ్య పరీక్ష (సీపీటీ)ను నిర్వహించారు. మరో 327 మందికి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. 179 మంది తుది ఎంపిక ఉత్తర్వులు ఇచ్చారు. వివిధ నియామకాల వివరాలను ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. కాగా ఏపీపీఎస్సీ అదనపు బాధ్యతల (ఎఫ్ఏసీ)ను ప్రొఫెసర్ సి.శశిధర్‌కు అప్పగిస్తూ ప్రభుత్వ జనరల్ విభాగం(జీఏడీ) ముఖ్యకార్యదర్శి కె.విజయానంద్ తాజాగా ఉత్తర్వులు జారీజేశారు.

మద్యం తాగుతూ మృత్యు ఒడిలోకి...

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు: మద్యం అమ్మకాలే ముఖ్యం... ఆదాయ ఆర్జనే ప్రథమ కర్తవ్యం... మద్యం వ్యసనపరుడు మరణిస్తే మాకేంటి... మద్యం విక్రయాలు మాత్రం ఆపేది లేదు అన్నట్టుగా వ్యవహరించారు దుకాణ యజమానులు. రెండున్నర గంటలపాటు విగతజీవితా పడిఉన్నప్పటికీ కనీసం పోలీసులకు సమాచారం ఇవ్వకపోవడం మానవత్వానికే మాయని మచ్చ అంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏలూరులోని విజయ విహార్ సెంటర్లో ఉన్న ఎస్ఆర్ వైన్స్ పర్మిట్ రూంలో ఈ హృదయ విషాదకర సంఘటన చోటు చేసుకుంది. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ... చింతలపూడికి చెందిన మేకా అనిల్ గత కొంతకాలంగా ఏలూరు నగరంలోని తంగెళ్ళమూడిలోని ఒక ప్రైవేట్ లాడ్జిలో నివసిస్తున్నాడు. గురువారం ఉదయం ఆరు గంటల సమయంలో ఎస్ఆర్ వైన్స్ కు వచ్చాడు. అదే సమయంలో పర్మిట్ రూంను శుభ్ర పరిచేందుకు వచ్చిన ఓ మహిళ రూం తాళాలు తీసింది. అనిల్ వైన్ షాపులో మద్యం కొని తాగాడు. పర్మిట్ రూంలో ఓ బెంచ్ పై కూర్చొని మద్యం తాగుతూనే ఉన్నాడు. 10.49 గంటలకు ఒక్కసారిగా కుర్చీ నుంచి వెనక్కి కుప్పకూలిపోయాడు. పక్క టేబుల్‌లో మద్యం తాగుతున్న ఓ వ్యక్తి అతడి వద్దకు వెళ్లి చేతిలో ఉన్న సెల్ ఫోన్ తీసుకొని ఉడయించాడు. అదే సమయంలో చాలా మంది అక్కడ మద్యం తాగుతున్నప్పటికీ ఎవరూ పట్టించుకోలేదు. యాజమాన్యమూ నిర్లక్ష్యం వహించింది. మద్యం విక్రయాల్లో మునిగితేలుతూ మానవత్వం మరిచింది. కింద పడిన వ్యక్తికి ఏం జరిగిందనే పట్టించుకోకుండా యథావిధిగా మద్యం విక్రయాలు కొనసాగించారు. అక్కడే ఉన్న కొందరు వ్యక్తులు దీన్ని గమనించి మీడియాకు సమాచారం అందించారు. అక్కడ చేరుకున్న మీడియా ప్రతినిధులు పోలీసులకు, ఎక్సైజ్ అధికారులకు సమాచారం చేరవేయడంతో సంఘటనా స్థలానికి ఏలూరు జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారావు, ఏలూరు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆవులయ్య, ట్రాఫిక్ సీఐ లక్ష్మణరావు, టూ టౌన్ ఎస్ఐ లక్ష్మణ నారాయణ... సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని మృతిపై ఆరా తీశారు. మద్యం దుకాణాన్ని మూసి వేయించారు. పోలీసులు వచ్చేవరకు మద్యం విక్రయాలు కొనసాగించడం మానవత్వం కంటే ధన దాహానికి ప్రాధాన్యతనివ్వడం నిదర్శనం. మృతుడి టేబుల్ వద్ద లభించిన మద్యం సీసాలను ల్యాబ్‌కు పంపుతామని ఎక్సైజ్ అధికారులు చెప్పారు. మృతిపై పలువురు రకరకాలుగా చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న రూ.99 మద్యంలో కల్తీ జరగడం వల్ల మృతిచెంది ఉండొచ్చని కొందరు చెబుతుండగా... మరికొందరు నిరంతరాయంగా మద్యం తాగడం వల్లే గుండెపోటుకు గురై మరణించి ఉంటాడని అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, అనిల్ మృతిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ చెప్పారు. రాత్రి డీఎస్పీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఎక్సైజ్ డీసీ ప్రభు కుమార్, సూపరింటెండెంట్ ఆవులయ్యతో కలిసి వివరాలు వెల్లడించారు. అనిల్ తాగిన మద్యం ఎక్సైజ్ శాఖ డిపో నుంచి వచ్చినట్లు ఆ శాఖ అధికారులు స్పష్టం చేశారు. ల్యాబ్ రిపోర్ట్ ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

భారత్-బ్రిటన్ సహజ భాగస్వాములు

- రెండు దేశాల బంధం ప్రపంచ స్థిరత్వానికి ఆధారం
- దేశంలో 9 యూకే యూనివర్సిటీల ఏర్పాటుకు అంగీకారం

ముంబై: ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల్లో భారత్, బ్రిటన్ మధ్య భాగస్వామ్యం ప్రపంచ స్థిరత్వానికి, ఆర్థిక ప్రగతికి ఒక ముఖ్యమైన స్తంభంలా నిలుస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో గురువారం రాజ్‌భవన్‌లో జరిగిన భేటీ అనంతరం ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఇరు దేశాల మధ్య రక్షణ, విద్య, వాణిజ్యం వంటి కీలక రంగాల్లో సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రక్షణ రంగంలో ఇరు దేశాలు ఒక చరిత్రాత్మక ఒప్పందానికి వచ్చాయి. ఈ ఒప్పందం ప్రకారం, భారత వాయుసేనకు చెందిన ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్లు యూకేలోని రాయల్ ఎయిర్‌ఫోర్స్‌లో శిక్షకులుగా పనిచేయనున్నారు. ఇది ఇరు దేశాల సైనిక సహకారంలో ఒక కొత్త అధ్యాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. అదేవిధంగా, విద్యారంగంలోనూ భారీ ముందడుగు పడింది. యూకేకు చెందిన తొమ్మిది ప్రముఖ విశ్వవిద్యాలయాలు తమ క్యాంపస్‌లను భారత్‌లో ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చాయి. ఇటీవలే సౌతాంప్టన్ యూనివర్సిటీ గురుగ్రామ్‌లో తన క్యాంపస్‌ను ప్రారంభించిందని, తొలి బ్యాచ్ విద్యార్థులు ప్రవేశాలు కూడా పొందారని ప్రధాని మోదీ సంతోషం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ అంశాలపై కూడా ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. ఉక్రెయిన్, గాజాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలపై చర్చలు, దౌత్య మార్గాల ద్వారా శాంతిని పునరుద్ధరించే ప్రయత్నాలకు భారత్ పూర్తి మద్దతు ఇస్తుందని మోదీ పునరుద్ఘాటించారు. ఇండో-పసిఫిక్, పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం, సముద్ర భద్రతలో సహకారాన్ని పెంచుకోవాలని ఇరు దేశాలు కట్టుబడి ఉన్నాయని తెలిపారు. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, చట్టబద్ధమైన పాలన వంటి ఉమ్మడి విలువలపై ఇరు దేశాల సంబంధాలు ఆధారపడి ఉన్నాయని మోదీ అన్నారు. యూకేలో స్థిరపడిన 18 లక్షల మంది ప్రవాస భారతీయులు ఇరు దేశాల మధ్య సజీవ వారధిగా నిలుస్తున్నారని, వారి సహకారంతోనే మన స్నేహం మరింత బలపడిందని కొనియాడారు. సాంకేతికత, ప్రతిభ ఆధారంగా మన భాగస్వామ్యం విశ్వసనీయంగా ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. కొద్ది నెలల క్రితం కుదిరిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సెటా) తర్వాత యూకే ప్రధాని భారీ వ్యాపార ప్రతినిధి బృందంతో భారత్‌కు రావడం.. ఇరు దేశాల మధ్య ఏర్పడిన కొత్త ఉత్తేజానికి నిదర్శనమని ప్రధాని మోదీ అభివర్ణించారు.

ఐరాస భద్రతామండలిలో భారత్‌కు స్థానం: బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్

బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ మాట్లాడుతూ...ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి లో భారత్‌కు శాశ్వత సభ్యత్వం ఇవ్వాల్సిందేనన్నారు. ప్రపంచ వేదికపై భారత్ తన సరైన స్థానాన్ని పొందాలని స్పష్టం చేశారు. భారత్ సాధిస్తున్న అద్భుత అభివృద్ధిని, అంతర్జాతీయ వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించగల సామర్థ్యాన్ని స్టార్మర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. "భద్రతా మండలిలో భారత్ తన హక్కుగా పొందాల్సిన స్థానాన్ని దక్కించుకోవడాన్ని మేము చూడాలనుకుంటున్నాం" అని ఆయన అన్నారు. భారత్ శాశ్వత సభ్యత్వానికి ఇప్పటికే అమెరికా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, రష్యా వంటి దేశాలు మద్దతు తెలుపగా, ఇప్పుడు యూకే కూడా అదే బాటలో నిలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. తన భారత పర్యటన ఉద్దేశాన్ని వివరిస్తూ, గత దశాబ్ద కాలంలోనే అతిపెద్ద వాణిజ్య ప్రతినిధి బృందంతో తాను ఇక్కడికి వచ్చినట్లు స్టార్మర్ తెలిపారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య భాగస్వామ్యాన్ని రెట్టింపు చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. మేము భారత్‌తో కలిసి భవిష్యత్తుపై దృష్టి సారించాం. కొత్త ఆధునిక భాగస్వామ్యాన్ని సృష్టిస్తున్నాం. అందుకే ఈ ఏడాది జులైలో యూకే-భారత్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. రెండు గొప్ప దేశాలు మరింతగా కలిసి పనిచేస్తాయనే నమ్మకం, విశ్వాసం ఉంది. సాంకేతికత, ఆవిష్కరణల రంగాల్లో భారత్, యూకేలు ప్రపంచ నాయకులుగా కలిసి నిలుస్తున్నాయని చెప్పారు. ఈ పర్యటనలో భాగంగా యూకేలో బాలీవుడ్ చిత్రాల నిర్మాణానికి సంబంధించి ఒక ఒప్పందం కుదిరిందని కూడా ఆయన ప్రకటించారు. ఇదే సమయంలో, గాజాలో శాంతి ఒప్పందం మొదటి దశకు చేరుకోవడం పట్ల స్టార్మర్ హర్షం వ్యక్తం చేశారు. ఇది ఎంతో ఉపశమనం కలిగించే క్షణమని, ఈ శాంతి ప్రణాళిక పూర్తిస్థాయిలో అమలు కావడానికి యూకే మద్దతుగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

స్వయం సహాయక సంఘాలకు సత్వరమే రుణాలు

విశాలాంధ్ర - సచివాలయం: స్వయం సహాయక సంఘాల కోసం రూపొందించిన సూక్ష్మ రుణ ప్రణాళికను బ్యాంకులకు అందజేసి... సాంకేతిక సమస్యల పరిష్కారంతో ప్రతీ సంఘానికి రుణాలను త్వరితగతిన అందించేందుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో మంత్రి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ సముద్రపునాచు, వెదురు సాగు, మునగ సాగు, మిల్లెట్ల ఉత్పత్తులలో తగిన లక్ష్యాలు సాధించాలని సూచించారు. ఫార్మర్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్‌లను బలోపేతం చేయాలని, అందుకు కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానాన్ని సంబంధిత సంస్థల నుంచి తీసుకుని... త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కేతి సంస్థ నుంచి తీసుకుంటున్న షేడ్ నెట్లను సకాలంలో ఏర్పాటు చేయాలన్నారు. సెర్ప్ సీఈఓ వాకాటి కరుణ, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల ఆస్తుల వెల్లడి తప్పనిసరి: స్పీకర్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రజాప్రతినిధులు తమ ఆస్తులు, అప్పులను స్వచ్ఛందంగా ప్రకటించే పద్ధతిని తప్పనిసరి చేయాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. బార్బడోస్‌లోని బ్రిడ్జ్‌టౌన్‌లో జరుగుతున్న 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సులో భాగంగా గురువారం జరిగిన "పార్లమెంటరీ స్క్రూటినీ ఫర్ ఇంప్రూవ్డ్ డెమోక్రసీ" అనే అంశంపై ఆయన ప్రసంగిస్తూ... భారత ప్రజాస్వామ్య వ్యవస్థ అత్యంత పటిష్టమైనదని, ప్రజలే ఇక్కడ సార్వభౌములన్నారు. గత 75 సంవత్సరాలుగా భారతదేశం ఒక గణతంత్ర రాజ్యంగా విజయవంతంగా కొనసాగడంలో పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. "ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలే పాలకులు" అనే స్ఫూర్తితో రూపొందించబడిన భారత రాజ్యాంగమే ప్రజాస్వామ్యానికి పునాది అన్నారు. భారత రాజ్యాంగం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మార్పులకు లోనవుతూ, వందకు పైగా సవరణలతో మరింత పరిణతి చెందిందని తెలిపారు. శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు తమ పరిధిలో పనిచేస్తూ రాజ్యాంగ ఆధిక్యతను గౌరవిస్తాయని, ప్రజలే నిజమైన యజమానులని స్పష్టం చేశారు.తన ప్రసంగంలో దివంగత నేత నందమూరి తారక రామారావు చెప్పిన "ప్రజలే దేవుళ్లు, సమాజమే దేవాలయం" అనే మాటలను, మహాత్మా గాంధీ చెప్పిన ప్రజాస్వామ్య సూక్తులను స్పీకర్ ఉటంకించారు.

శివశంకర్‌కు ఏఐటీయూసీ అభినందన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎస్పీడీసీఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా లోతేటి శివశంకర్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఏఐటీయూసీ అనుబంధ ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నేతలు బి. రామలింగారెడ్డి, పి.శివయ్య, ఎం.బాలకాశి, అనుబంధ సంఘాల నాయకులు గురువారం కలిసి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. విద్యుత్ రంగంలో ఇది ఆయనకు తొలి నియామకం అయినప్పటికీ... ఆయనకు పాలనాదృష్టి, సమస్యలపై సమగ్ర అవగాహన, సమన్వయ నైపుణ్యం ఉందన్నారు. విద్యుత్ రంగం బలోపేతానికి, ఉద్యోగుల సంక్షేమానికి పూర్తి సహకారం అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారని నేతలు తెలిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.